# కథా మంజరి

పది కథల సమాహారం



కథామార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**అక్టోబర్ 2021 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari

కథ



# సుస్వాగతం

# కథామంజరి శ్రావ్య సంచిక

## ఈ నెల శ్రావ్య సంచిక కోసం

**ఇక్కడ నొక్కండి**

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | విశిష్ట అతిథి | | v |
| V | కథా మార్గదర్శి | | vii |
| VI | దీపావళి కథల పోటీ వివరాలు | | x |
| | కథలు | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
| 1 | సీతాకోకచిలుకలు | కొయిలాడ రామ్మోహనరావు | 1 |
| 2 | పండగ వచ్చింది | భాగవతుల భారతి | 7 |
| 3 | మారిన మనసు | కొలిచిన జ్యోతిర్లత | 11 |
| 4 | జీవిత పాఠం | సి.హెచ్.వి.ఎస్.ఎస్. పుల్లంరాజు | 15 |
| 5 | కనబడని శత్రువు | వియోగి | 20 |
| | | | |
| ఓ కథ వ్రాయడానికి పాత్రల్లో రచయిత జీవించి రచించాలనే పెద్దల మాటలని శిరోధార్యంగా భావించి రచనల చేసిన రచయిత్రి డా.పరిమళా సోమేశ్వర్ గారి 'ఎవర్‌గ్రీన్' కథ "ఉరి"..ప్రత్యేకంగా అందిస్తున్నాం. | | | |
| 6 | ఉరి | పరిమళా సోమేశ్వర్ | 29 |
| అత్తగారి మీదే కాదు చక్రపాణి గారి మీద కూడా కథను సృష్టించగల 'కలం'కారిణి డా. భానుమతి రామకృష్ణ గారి విశిష్ట కథ "చక్రపాణీ-రాజధానీ" కూడా ఈ సంచిక ప్రత్యేకమే! | | | |
| 7 | చక్రపాణీ-రాజధానీ | భానుమతీ రామకృష్ణ | 38 |
| మంచి శైలి, కథనం, భాషాపటిమలతో పాటు మస్తిష్కంలో గూడు కట్టిన ఆలోచనలకు, అసలు కథగా మలచడానికి ప్రేరణ ఎలా కలిగిందో వివరించిన డా. పరిమళా సోమేశ్వర్ గారి ఈ రచన. | | | |
| 8 | నేను కథలు ఎలా రాస్తాను? | పరిమళా సోమేశ్వర్ | 47 |
| VI | వినదగు నెవ్వరు చెప్పిన | | XI |



# మా జట్టు

**సాంకేతిక సహకారం**

harbinger
PUBLISHING

**బొమ్మలు**

శ్రీ కొయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

**సంపాదక సహకారం**

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు

శ్రీ కృపాకర్ పోతుల

# కృతజ్ఞతలు

# SPONSORS

## ఈ సంచికకు ఆర్ధిక సహకారం

## OF THE ISSUE

**శ్రీ భమిడిముక్కల రమేష్ గారు**

**శ్రీమతి భమిడిముక్కల లక్ష్మి గారు**







# 'కథా'కీయం

ఈ మధ్య కాలంలో తెలుగు రచయితలకు చేతినిండా పని ఉంటోంది. ముద్రణా పత్రికలు, అంతర్జాల పత్రికలు, సాహితీ సంస్థలు.. కథల పోటీలను ఎక్కువగానే నిర్వహిస్తున్నాయి. దానాదీనా ఏడాది పొడవునా పోటీ ప్రకటనలు కనబడుతున్నాయి. కథా రచనలలో కొత్త ఒరవడి రావాలనీ, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కథాంశాలు కూడా రావాలనే ఆలోచనలతో, వాటికి అనుగుణంగా నిబంధనలు, సూచనలతో, కొత్త పంథాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఇది ఆనందదాయకమైన విషయమే!

అలాగే.. ఒకప్పుడు పత్రికలో వచ్చిన కథలని ఒకరు చదివితే, పదిమంది వారి చూట్టూ చేరి, శ్రద్ధగా లీనమై వినేవారు. తర్వాత కథల గురించి చర్చించుకునేవారు కూడా. ఆ కథల మీద వారి స్పందనలను పత్రికలకు ఉత్తరాల ద్వారా తెలియచేసేవారు. ఇప్పుడా ప్రక్రియ మరో రూపుదాల్చుకుని, కథలు యూట్యూబ్ ద్వారా వినే సౌకర్యంతో అందరికి చేరుతున్నాయి. ఈ ప్రక్రియ ద్వారా చాలామంది కథాభిమానులు శ్రమతో, కొండకచో డబ్బులు ఖర్చుపెట్టి కూడా, పాత కొత్త తెలుగు కథలను తమ గొంతు ద్వారా, శ్రోతలకు చేరుస్తూ, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవి విజయవంతం అవుతున్నాయి. ఇది కూడా అభినందించదగ్గ విషయమే!

అయితే.. పుస్తకం చేతిలో పట్టుకుని చదవటం, నడుం వాల్చి హాయిగా చదవటం.. వంటి అలవాట్లతో వచ్చే 'కిక్' పేరనే వాళ్ళు కూడా ఉన్నారు. ఈ 'కిక్' కోసం "కథామంజరి"ని కూడా ప్రింటు తీసుకుని చదివే పాఠకుల ఉత్సాహం చూస్తే కూసింత ఆనందం వేస్తుంది!

ఏదైతేనేం.. తెలుగు కథ నిలబడ్డానికి, ముందుకు నడవడానికి ఎందరో చేస్తున్న కృషి, ప్రయత్నాలతో పాటు.. ముఖ్యంగా రచయితల బాధ్యత కూడా చాలానే వుంది. రాశితోపాటు, వాసి ఉన్న కథలు రాయాలి. భాష, కథాంశం, శైలి.. ఇవి బావుంటే పర్లేదనుకోకుండా, కథని చదివించగలిగేలా రాయాలి. పోటీలను దృష్టిలో పెట్టుకుని కాకుండా.. పాఠకుడ్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఇద్దరో ముగ్గురో న్యాయనిర్ణేతల్ని, పత్రికల

సంపాదకవర్గ సభ్యుల్ని కథలు ఆకట్టుకుంటే చాలదు .. కోట్లాది పాఠకులని కూడా ఆకట్టుకుంటేనే కథకి గుర్తింపు వస్తుంది. ఖచ్చితంగా ఉత్తమ కథగా భాసిల్లుతుంది. బహుమతి రాని కథలు కూడా వేలాదిమంది పాఠకుల స్పందనలను సంపాదించిన ఉదాహరణలు కోకొల్లలు.

ఈ నెల “కథామంజరి”కి చేరిన కథలలో కాస్త 'వాసి' ఉన్న కథలు ఆరే ఉన్నాయనే న్యాయనిర్ణేత గారి అభిప్రాయాన్ని సగౌరవంగా స్వీకరించి, అవే ప్రచురించాం. కథ వ్రాయడంలో రచయితలకు ఉపయుక్తంగా ఉండే నాలుగు మాటలు వ్రాయమని.. ఈ సంచిక విశిష్ట అతిథి డా. పరిమళా సోమేశ్వర్ గారిని అభ్యర్థించాం. వెంటనే వారి అనుభవాలను వ్రాసి పంపారు. ఆ వ్యాసం అటు పాఠకులకు, ఇటు రచయిత(త్రి)లను ఉపయుక్తమవుతుందని ఆశిస్తూ.. అందిస్తున్నాం!

అలాగే.. ఎంత పనిలో ఉన్నా, మనసుంటే మార్గం ఉంటుందనే మన నానుడికి ఉదాహరణగా, సమయం చిక్కించుకుని, కలాన్ని సంధించి, కథలు వ్రాసి, ఆ కథలతో తెలుగు సాహితీ ప్రపంచంలో కూడా సుస్థిర స్థానం సాధించిన ప్రఖ్యాత నటీమణి, గాయని, చిత్ర దర్శకురాలు, ఈ సంచిక ‘కథా మార్గదర్శి’ కీ.శే. భానుమతి రామకృష్ణ గారి కథ కూడా ప్రచురిస్తున్నాం.

మన భాషను, మన కథని ముందు తరాలకు అందించే ప్రయత్నంలో అందరి సహాయ సహకారాలను కోరుకుంటూ.. దీపావళి ప్రత్యేక సంచికతో మళ్ళీ కలుద్దాం!!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



# శ్రీమతి డా. పరిమళా సోమేశ్వర్

ఏదైనా విషయం చూసినప్పుడో, విన్నప్పుడో మనసులో స్పందన వచ్చి, రాయాలనే తపన కలిగి, తర్వాతే అక్షరరూపానికి బీజం పడుతుంది. అది కథగానో, కవితగానో, మరో రూపంగానో ఆవిర్భవిస్తుంది. అవే.. అబాలగోపాలన్ని అకట్టుకుని, అజరామంగా సాహితీలోకాన్ని అలరిస్తాయి. ఆ కోవలో రచనలు చేసి, అబ్బురపరిచే కథలకు జన్మనిచ్చిన రచయిత్రి డా. జి. పరిమళా సోమేశ్వర్. కథామంజరి విశిష్ఠ అతిథిగా ఆహ్వానం పలికి, పత్రిక కోసం వ్యాసం రాయమని అభ్యర్థించినప్పుడు,.. "కొంచెం టైమివ్వండి, ఓ కథ రాయడంలో బిజీగా ఉన్నాను!" అంటూ ఆవిడ అన్నప్పుడు ఆనందం వేసింది. అంతకంటే ఎక్కువగా ఆశ్చర్యం అనిపించింది. ఎన్నో విషయాలు అడిగి తెలుసుకోవలనిపించింది. కారణం ఆవిడ వయసు జస్ట్ ఎనిమిది పదులు!! "నాకంటూ ఇష్టమైన లేదా అయిష్టమైన రచయిత(త్రి)లు లేరు. నాకు కథంటేనే ఇష్టం. మంచి కథ ఎవరు రాసినా ఇష్టపడతాను. ఏ 'ఇజం' తో ఎవరు ఏం రాసినా, నాకు నచ్చితే మెచ్చుకుంటాను. ఏ కథైనా పాఠకుడి మనసును తాకినప్పుడే ఆ రచనకు సార్థకత చేకూరుతుంది. అదే మంచి కథ అని నేను భావిస్తాను!" అంటూ కథ మీద, రచయితల మీద తన అభిప్రాయాన్ని పరిమళా సోమేశ్వర్ గారు నిక్కచ్చిగా చెప్తారు.

కృష్ణా జిల్లా కేలప్రోలులో జన్మించి, అక్కడే హైస్కూలు విద్యాభ్యాసం ముగించి, విజయవాడలో డిగ్రీ, రాయపూర్ సాగర్ యూనివర్సిటీ నుంచి రసాయనిక శాస్త్రంలో ఎమ్.యస్.సి. చేసి, హైదరాబాదులో యుజీ & పిజీ ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ, రసాయనిక శాస్త్రంలోనే డాక్టరేట్ చేసారు. సహోద్యోగి డా. సోమేశ్వర్ తో పరిమళ గారి వివాహం 1965లో జరిగింది. తర్వాత రచయితగా పేరు పరిమళా సోమేశ్వర్ గా మారింది. ప్రిన్సిపాల్ గా పదవి విరమణ చేసి, హైదరాబాదులోనే స్థిర నివాసంలో సాహితీ సేవలందిస్తున్నారు.

ఇక.. ఇంటినిండా సాహిత్య వాతవరణమే.. ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలు ఇంట్లో నిండుగా కనబడేవి. అవి చదివి, సాహిత్యాభిలాష కలిగి, ఎనిమిదో ఏటనే కవితలు రాయడం ప్రారంభించారు. డిగ్రీ చదువుతున్నప్పుడే కాలేజీ మాగజైన్ కోసం కథలు రాసారు. రెండు వందల ఏభై పైచిలుకు కథలు, ఇరవై రెండు నవలలు, వీరి కలం నుండి జాలువారాయి. ఈ రచనలు అన్ని ప్రముఖ పత్రికలలో ప్రచురణ కావడమే కాకుండా, ఆకాశవాణిలో కూడా ప్రసారమయ్యాయి. కొన్ని కథలు, నవలలు నాటికలుగా కూడా ఆకాశవాణి, దూరదర్శన్ లలో కూడా ప్రసారమయి, ప్రాచుర్యంలోకి వచ్చాయి. పరిమళా సోమేశ్వర్ గారు ఆంగ్ల భాషలో కూడా రచనలు చేసారు, చేస్తున్నారు. వీరి ఆంగ్ల కవితలు, చిన్న కథలు, వ్యాసాలు.. వివిధ మాధ్యమాలు, అంతర్జాల పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అలాగే వీరి తెలుగు కథలు, నవలలు ఇంగ్లీషు, హింది, తమిళ్, కన్నడ భాషల్లోకి అనువదించబడ్డాయి. పరిమళా సోమేశ్వర్ గారి సాహితీ పటిమకు గుర్తింపుగా కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీలో 'పానల్ ఆఫ్ జడ్జి'గా నియమింపబడి, చాలా కాలం పని చేసారు.

తెలుగు రచయిత్రులు తమ కథ, నవలలతో తెలుగు సాహితీ లోకాన్ని ఊర్రుతాలుగిస్తున్న స్వర్ణయుగంలో.. అంటే 1965 నుంచి 1980 మధ్య కాలంలో స్త్రీల చుట్టూ సాగే ఇతివృత్తాలతో ఎక్కువ రచనలు చేసారు పరిమళా సోమేశ్వర్ గారు. ఆ రోజుల్లో మధ్యతరగతి జీవితాలు, కుటుంబవ్యవస్థ, సమాజంలో వచ్చిన మార్పులు, ఆనాటి స్థితిగతులను ప్రతిబింబించే వీరి కథలు అగ్రతాంబూలాలు అందుకున్నాయి. చేదునిజాలు, గాజు పెంకులు, లేడీస్ స్పెషల్, తెల్లకాకులు, పిల్లలతో ప్రేమ యాత్ర, తప్పటడుగు, అంతరంగ తరంగాలు.. వంటి నవలలో వాస్తవ సంఘటన మీద అల్లిన కథనాలే పాటకులకు సాక్షాత్కరిస్తాయి. ఓ తలారి (ఉరి తీసే ఉద్యోగి) మీద రాసిన కథ 'ఉరి'. చిన్నతనంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్లు చేసే రోజుల్లో, పెళ్ళి కాని పిల్లల్ని క్రోటన్ మొక్కల్లా పెరిగారని అనేవారుట. ఆ నేపథ్యంలో రాసిన వాడైన కథ 'క్రోటన్ మొక్కలు'. మత విద్వేషాల మీద రాసిన 'అన్నదమ్ములు' కథ... ఇలా విభిన్నమైన అంశలమీద పరిమళా సోమేశ్వర్ రాసిన కథలన్నీ ఆణిముత్యాలే!

ఓ గృహిణిగా, ఉద్యోగిగా, ఉపాధ్యాయినిగా, స్త్రీగా, భార్యగా, తల్లిగా.. ఇలా ఆయా జీవితపాత్రల్లోంచి, సమాజంలో కనబడిన అన్ని అంశాలను, అన్ని కోణాల్లోంచి కథలుగా ఆవిష్కరించిన సాహితీ ఋషీమణి డా. పరిమళా సోమేశ్వర్ గారు ఈ "కథామంజరి" సంచికకు విశిష్ట అతిథిగా వ్యవహరించడమే కాకుండా కథలు వ్రాయడంలో అనుభవాలను పంచుకున్నందులకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ.. తన సాహితీ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ.. మరిన్ని రచనలతో తెలుగు పాఠకలోకాన్ని అలరించగలరని ఆశిస్తూ.. నమస్కారం!!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



# శ్రీమతి డా. భానుమతీ రామకృష్ణ

నటన, గాత్రం, సంగీతం, దర్శకత్వం, నిర్మాణం, స్టూడియో ఆధిపత్యం .. ఇలా సినిమా రంగంలో వివిధ శాఖలో ఆరితేరిన వారు బహుకొద్ది మంది ఉంటే, వాటితోపాటు సాహిత్యంలో కూడా ప్రవేశం ఉన్నవారు ఆ రంగంలో తారస పడటం అపురూపమైన విషయమే. అలా కోటికొక్కరులా ఆయా రంగల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సాధించిన ఏకైక మహిళామణి, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీమతి భానుమతి రామకృష్ణ. సినిమాలో అత్తగారు అనగానే సూర్యకాంతం గుర్తుకొస్తే, తెలుగు సాహిత్యంలో అత్తగారంటే జ్ఞాపకం వచ్చేది భానుమతిగారే. నటీమణులలో అగ్రస్థానంలో నిలిచినా, కోతిబావకు పెళ్లంట.. అంటూ గొంతులో మధురిమలు పలికించినా, 'యాక్షన్' అంటూ సినిమా చిత్రీకరణలో హుకుం జారీ చేసినా, అత్తగారి కథలు అంటూ తెలుగింట చిరస్థాయిగా నిలిచిపోయే సాహితీకుసుమాలు అందించినా.. అవన్నీ ఒక్క భానుమతిగారికే దక్కాయి. ఈ ప్రజ్ఞా పాటవాలకు వెనుక కృషితో పాటు, దృఢమైన సంకల్పం కనబడుతుంది, సాధికారత వినబడుతుంది.

భానుమతి గారు 1926 సెప్టెంబరు ఏడో తేదిన ఒంగోలులో దట్టమైనా కట్టుబాట్లు గల కుటుంబంలో జన్మించారు. ఆ వాతవరణంలోనే పెరిగి పదమూడేళ్ల వయసులో "వరవిక్రయం" సినిమాలో నటించి అరంగేట్రం చేసారు. పదిహేడో ఏట సినిమా రంగానికి చెందిన శ్రీ రామకృష్ణారావు గారిని వివాహమాడారు. వంద చిత్రాల్లో నటించారు. గాయనిగా ఎన్నో వందల పాటలు పాడారు. పద్నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించి, మరో పది చిత్రాలను నిర్మించారు కూడా.

విశ్వనాధ గారి ప్రభావంతో పదిహేనో ఏట నుండే వ్రాయడం మొదలెట్టిన భానుమతిగారి రచనలకు ఓ ప్రత్యేకత ఉంది. అత్తగారి కథలను అలవోకగా రచించారు. ఆ కథలు చదువుతుంటే.. ఎదురుగా పాఠకులకు చలనచిత్రం కనబడుతుంది. మాటల్లో విరుపు, సొగసు ఆ కథలకు ఓ గొప్ప గుర్తింపు తెచ్చాయి. మధ్యతరగతి కుటుంబాల ఇళ్ళల్లో కనబడే చిరు సంఘటనల సమాహారమైన ఆ "అత్తగారి కథలు"కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఎన్నో అవార్డులు, రివార్డులతో పాటు రెండు గౌరవ డాక్టరేటులు కూడా అందుకున్నారు. భారతదేశ ప్రభుత్వ "పద్మశ్రీ" బిరుదు కూడా సాహిత్యపరంగా దక్కినదే. "అయితే.. వీటన్నిటి కంటే ఎం.జి.రామచంద్రన్ గారు తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, నన్ను మద్రసులోని ప్రభుత్వ సంగీత కళాశాలకు డైరెక్టర్ గా, ప్రిన్సిపాల్ గా నియమించారు. ఇది నా సంగీత గర్వకారణం!" అంటూ భానుమతిగారు చాలా సందర్భాల్లో చెప్పేవారు.

'అత్తగారి కథల' సంకలనమే కాకుండా .. ఆమె రచించిన ఇతర కథలతో.. 'భానుమతి కథలు', 'అత్తగారు నక్సలైట్లూ', వంటి కథాసంకలనాలు వెలువడ్డాయి. ఆ రోజుల్లో ప్రముఖ పత్రికల 'ప్రత్యేక సంచిక'లలో భానుమతిగారి కథలు లేకుండా వెలువడేవి కావు. దాదాపు అన్ని వార, మాసపత్రికల్లో భానుమతిగారి కథలు ప్రచురితమయ్యాయి. వాటిలో చదవవలిసినవి అని జాబితా రాసుకుంటే. .. “ఇరుగు పోరుగు, ఎందుకులెండి, కథ కంచికి, కామాక్షి కథ, గుబేళ్లు, పతిత, టీవీ సిన్మాయనం, పెద్ద ఆకారాలూ చిన్న వికారాలూ..” ఇలా చెప్పుకుంటూ పోతే, ఆవిడ రాసిన అన్ని కథలన్నీ ఆ జాబితాలో ఉంటాయి. సంగీతంలో ఆమె బాణి, ఇతర రంగాల్లో ఆమె వాణి.. రెండూ ప్రత్యేకాలే! సున్నితమైన హాస్యం, సమగ్ర విషయ పరిశీలన, ఆసక్తిగా చదివించే శైలి, కథన చతురతలు అత్తగారి కథలనే కాకుండా, ఆమె కలం నుండి జాలువారిన ప్రతి అక్షరాన్ని చిరంజీవిగానే తెలుగు సాహిత్యంలో నిలిచిపోయేలా చేసాయి. నిత్యం మనకు కనిపించే మనుషులు, వారి స్వభావాలు, వైరుధ్యాలు.. వీటిని చిత్రీకరించడంలో భానుమతిగారు హాస్యాన్ని సాధనంగా చేసుకోవడం వల్ల ఆమె కథలు సుఖంగా, సునాయాసంగా నడుస్తాయి. ఆవిడ కథ ఎక్కడా కుంటుపడదు. ఆ కథలు చదువుతున్నంతసేపు చక్కటి నుడికారంతో తెలుగుమాటలు కంటికి, మనసుకి హాయిని కల్గిస్తాయి. తమాషా ఏమిటంటే.. భానుమతిగారు పోషించిన సినిమా పాత్రలలో పాత్ర కనబడదు.. ఆవిడే కనబడతారు. అలాగే 'అత్తగారి' కథలలో భానుమతి అత్తగారు కనబడరు.. అక్కడా భానుమతి గారే కనబడతారు.

పద్మశ్రీ అవార్డు ఇచ్చినప్పుడు భానుమతి గారు 'థాంక్స్' చెప్పకుండా, "వెరీగుడ్! మీరు మంచినిర్ణయం తీసుకున్నారు. మీది మంచి టేస్ట్!" అంటూ వారిని అభినందించారట. అలాంటి భానుమతిగారే.. "నాకు ఆహంభావం ఎక్కువని అందరూ అంటారు. కాని నాది ఆత్మవిశ్వాసం. అది ప్రదర్శించేది కాదు. అంతా భగవతి అనుగ్రహం!" అని కూడా ఘంటాపథంగా చెప్పారు.

ఆవిడ తరంలో మిగతా సినిమా నాయికలు కేవలం సినిమా రంగానికి పరిమితమై, ఆ గ్లామరు ప్రపంచంలోనే ఇరుక్కుపోయి ఉండగా, తాను మాత్రం ఆ సరిహద్దులను దాటి, తనలోని సృజనకి పలుమార్గాలు అన్వేషించడం.. తనని తాను పలురకాలుగా ఆవిష్కరించుకోవడం.. ఒక్క భానుమతిగారికే దక్కింది. ఆలాంటి మహామహిళ 2005 డిసెంబరు ఇరవైనాలుగో తేదిన కనుమూసినా.. ఆవిడ సాహితీకుసుమాలు, నటన, పాట, మాట.. అన్నీ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

కథామంజరి ఈ సంచిక కథా మార్గదర్శిగా, తన రచనల ద్వారా కూడా 'మనసున మల్లెల మాలలూగించిన' శ్రీమతి పాలువాయి భానుమతీ రామకృష్ణ గారిని తలుచుకోవడం ఓ అదృష్టంగా భావిస్తూ.. భానుమతిగారికి ఘనమైన నివాళి అర్పిస్తున్నాం.

**కథామంజరి బృందం**



# కథామంజరి

## దీపావళి కథల పోటీ



దీపావళి అంటే సాహితీ ప్రియులు ఎదురుచూసేది .. మంచి కథల ప్రత్యేక సంచిక. ఆ సంచికను దాచుకుని, అప్పుడప్పుడు చూసి మురిసిపోతూ, చదివి ఆనందపడుతూ ఉండేలా తీర్చిదిద్దడానికి కథామంజరి తలపెట్టింది. పదికాలలపాటు నిలిచేలా కథలు అందించాలని.. ఈ దీపావళి కథల పోటిని నిర్వహిస్తున్నాం.

| | | | |
|---|---|---|---|
| ప్రథమ బహుమతి | ₹ 5,116/- | ద్వితీయ బహుమతి | ₹ 3,116/- |
| తృతీయ బహుమతి | ₹ 2,116/- | 12 ప్రత్యేక బహుమతులు | ₹ 516/- |

నిబంధనలు

- ఇతివృత్తం ఏదైనా పర్వాలేదు. 1500 పదాలకు మించి ఉండకూడదు.
- కథను తెలుగులో 'వర్డ్' లో 'యూనికోడ్' లో టైపు చేసి పంపాలి. 'పిడియఫ్' లో పంపే కథలు అనుమతించబడవు.
- కథతో పాటు వేరే పేజీలో హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో.. కథ స్వీయ రచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, అలాగే ఇతర సాంఘిక మాధ్యమాలలో ప్రచురణ/ప్రసారణ జరగలేదనే హామీని పొందుపరచాలి. పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు కూడా ఎంపిక చేసుకుని వీలువెంబడి కథామంజరిలో ప్రచురణ జరుగుతాయి. ప్రచురణ కు తీసుకున్న కథలను శ్రావ్య సంచికలో తీసుకునే అవకాశం ఉంది. వీటికి అంగీకారం ఈ హామీపత్రంలోనే పొందుపరచాలి.
- కథల హామీపత్రం మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాసి పంపాలి.
- ఈ కథలను submit@kathamanjari.in కు ఇమెయిల్ ద్వారా 05.10.2021 తేది రాత్రి పది గంటలలోగా మాకు చేరేలా పంపించాలి. ఆ తర్వాత వచ్చే కథలను పోటీకి పరిశీలించడం జరగదు.
- కథల పోటీ ఎంపిక విషయంలో కథామంజరిదే తుది నిర్ణయం.

కథామంజరి దీపావళి ప్రత్యేక సంచిక ప్రత్యేకంగా ముస్తాబై నవంబరు ఒకటో తారీఖున మీ నట్టింట వెలుగుతుంది.

ఈ పోటీలో కథకులు అందరూ మంచి కథలతో పాల్గొని, విజయవంతం చేయవలసినదిగా కోరుతున్నాం!



# సీతాకోకచిలుకలు

## కొయిలాడ రామ్మోహనరావు



ఎంతోమంది కాలేజీ అమ్మాయిలు వెంటపడినా తన లోకంలో తాను ఉండే కొడుకు ప్రద్యుమ్న, 'గౌరి' వలలో ఎలా పడిపోయాడో, ఎంతగా దిగజారిపోయాడో తలుచుకుంటే మహర్షికి ఒళ్ళంతా కంపరం పుట్టినట్లుంది. మహర్షి విజయవాడలో ఇంగ్లీష్ లెక్చరర్ గా పనిచేసి రిటైర్ అయ్యాడు. పీజీ పూర్తిచేసి, మంచి ఫుట్ బాల్ కోచ్ గా పేరు తెచ్చుకున్న ప్రద్యుమ్న, డిగ్రీ చదువుతున్న వైశాలి అతని పిల్లలు. అపర్ణ అతని భార్య.

స్వంత ఊరు అనే మమకారంతో విశాఖపట్నంలో మంచి ఇల్లు కొనుక్కుని అక్కడికి మారిపోయాడు మహర్షి. 'సరసమయిన ధరకు మంచి ఇల్లు దొరికింది' అని ఆనందపడిన ఆ కుటుంబం, వాళ్ళున్న కాలనీకి పక్కనే ఉన్న మురికివాడ వల్ల సమస్యలు వస్తాయని ఊహించలేదు. విజయవాడలో ఉన్నంతకాలం ఫుట్ బాల్ వ్యాపకంతోనే గడిపేసే ప్రద్యుమ్నకి అమ్మాయిల గురించి ఆలోచించే సమయమే ఉండేది కాదు. విశాఖపట్నం వచ్చాక పూర్తిగా ఖాళీ అయిపోవడంతో, కొత్త సమస్య వచ్చింది. మురికివాడలో ఉండే గౌరి అతన్నిఆకట్టుకుంది. అతని కోసం రాత్రుళ్లు ఇంటికొచ్చేసేది. పెద్ద పెరడు, దానికి ఆనుకుని ఉన్న గుమ్మం అందుకు అనుకూలంగా ఉండేది. ఈ విషయం గౌరి తల్లితండ్రులకు తెలిసింది. వాళ్ళు జాగ్రత్త పడేలోపుగానే గౌరి కనబడకుండా పోయింది. దాంతో ఒక అర్ధరాత్రి దాదాపు ఏభై మంది అలగాజనంతో పాటూ గౌరి తల్లితండ్రులు మహర్షి ఇంటి కొచ్చి గొడవ చేసారు. వాళ్ళమ్మాయిని మహర్షి ఇంట్లో దాచారని వాళ్ళ అభియోగం. పెట్రోలింగ్ కి అటుగా వచ్చిన ఎస్ ఐ కలుగజేసుకొని, గౌరి కోసం పోలీసులతో ఇల్లంతా గాలించి, తను ఇంట్లో లేదని తెలిసాక, జనానికి వార్నింగ్ ఇచ్చి పంపేసి, గొడవ సర్దుబాటు చేసినా, మహర్షి కుటుంబం పరువు పోవడంతో, వాళ్ళంతా తల ఎత్తుకోలేని పరిస్థితి వచ్చింది. 'గౌరి నడవడిక మంచిది కాదని, మరో యువకుడితో లేచిపోయిందని' తర్వాత తెలిసినా, జరిగిన దానిలో కొడుకు తప్పు కూడా ఉందని తెలిసాక,

మహర్షి వేదనతో చాలా కుమిలిపోయాడు. ప్రద్యుమ్న పశ్చాత్తాపంతో కుమిలిపోయి, తన గదికే పరిమితమయిపోవడంతో అతన్ని ఎవరూ ఒక్క మాట కూడా అనలేదు.

అయితే ఆ తర్వాత అలగా జనం ప్రద్యుమ్నను విడిచిపెట్టలేదు. తలవంచుకుపోతున్న అతని మీద ఆడపిల్లలు కూడా అసహ్యమైన కామెంట్లు విసిరేవారు. అది గమనించిన మహర్షి వాళ్ళను మందలించేసరికి వాళ్ళు మరింత రెచ్చిపోయి, మహర్షి కుటుంబంలో ఎవర్నీ వదలకుండా అసభ్యంగా కామెంట్లు చెయ్యడం మొదలుపెట్టి, వారికి ప్రత్యక్ష నరకం చూపించేవారు. అలాంటి పరిస్థితిలో, రోజు కాలేజీకి వెళ్లి రావడం వైశాలికి నరకప్రాయంగా ఉండేది. వంతులవారీగా మహర్షి, ప్రద్యుమ్న ఆమెకు తోడుగా వెళ్ళాల్సిన అగత్యం పట్టింది.

ఒకరోజు ఇద్దరు యువకులు రెచ్చిపోయి వైశాలిని ఏడిపిస్తుంటే, ఓపిక నశించిన ప్రద్యుమ్న వాళ్ళ మీద చేయిచేసుకుని బుద్ధి చెప్పాడు. వాళ్ళు పగ పెంచుకొని, దారి కాసి ప్రద్యుమ్నను చితగ్గొట్టారు. పోలీసులు రంగం లోకి దిగడం వల్ల కొంతకాలం పాటూ ఆ జనం తగ్గినా, ఆ తర్వాత వాళ్ళ ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. ఆ మురికివాడలోని కుర్రకారంతా ఎప్పుడూ ఊర కుక్కల్లాగా మహర్షి ఇంటి దగ్గరే తిరుగుతూ మహర్షి కుటుంబానికి మనశ్శాంతి లేకుండా చేస్తుంటే, సహించి ఊరుకోవడం తప్ప వేరే దారేదీ కనబడలేదు వారికి.

***

ఒకరోజు మహర్షికి వసంత తారసపడటంతో, అతని జీవితం అనుకోని మలుపు తిరిగింది. గతంలో మహర్షితో పనిచేసిన బోటనీ లెక్చరర్ కిషోర్ భార్యే వసంత. కిషోర్ ఒక ప్రమాదంలో మరణించాక, వసంత వైజాగ్ వెళ్ళిపోయి, అక్కడొక టీచర్ గా పనిచేస్తుందని విన్నాడే గానీ, ఆ తర్వాత ఆమెను ఎప్పుడూ కలవలేదు. అనుకోకుండా ఆమె మహర్షికి ఒక షాపింగ్ మాల్ లో ఎదురయ్యింది. పక్కనే ఉన్న తమ ఇంటికి రమ్మని ఆమె ఆప్యాయంగా ఆహ్వానిస్తూ బలవంతపెట్టేసరికి, అతను కాదనలేకపోయాడు.

వసంత ఇంటిలోకి వెళ్ళకుండా గేటు దగ్గరే నిలబడిపోయి ఆ ఇంటి సౌందర్యాన్ని ఆస్వాదించడంలో మునిగిపోయాడు మహర్షి. సుమారు ఆరువందల గజాల్లో కట్టిన అందమైన చిన్న ఇల్లు, దాని చుట్టూ ఎంతో చక్కటి లేండ్ స్కేపింగ్ తోనూ, అందమైన పూలమొక్కలతోనూ బృందావనంలా ఉన్న తోట అతన్నెంతో ఆకట్టుకున్నాయి. ఇంటికి ముందున్న గార్డెన్ లోనే ఒక చెట్టు నీడన రెండు కుర్చీలు, ఒక చిన్న టేబుల్ ఉన్నాయి. అతన్ని అక్కడే కూర్చోబెట్టి, కాఫీ తేవడానికి లోపలకు వెళ్ళింది వసంత. 'అబ్బ ఎంత బాగుందిక్కడ! చక్కగా ఈ మొక్కల్నీ, చెట్లను చూసుకుంటూ కాలం గడిపేయవచ్చును' అనుకుంటూ ఆనందపడ్డాడు. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. అతనికి కొంత దూరంలో ఐదారు గొంగళి

పురుగులు ఆకులను, అందమైన పువ్వులనూ తినేస్తూ తోటను నాశనం చేయడం కనిపించడంతో అతని మనసు బాధతో విలవిలలాడింది. "అయ్యయ్యో ....ఈ గొంగళి పురుగులు తోటంతా నాశనం చేసేస్తున్నాయే...! నీకు బాధనిపించడం లేదా?" అని అడిగాడు వసంత తిరిగి రాగానే. "నిజమే మాస్టారూ...చాలా నాశనం చేసేస్తున్నాయి. ప్రాణప్రదంగా పెంచుకున్న ఏ మొక్కలనూ వదలడం లేదు. ఇప్పుడేం చూసారు? రెండు నెలల క్రితం వచ్చి చూడాల్సింది. ఎక్కడ చూసినా గొంగళీ పురుగులే. తోటంతా నాశనం చేసేసాయి. ఎక్కడపడితే అక్కడ పాకేసేవి. ఇంట్లోకి వచ్చేసేవి. ఆ ఆఖరికి నా ఒంటి మీద కూడా పాకేసేవి. దాంతో దురదలు, మంటలూ ....అబ్బబ్బా..! నరకం చూసాననుకోండి. ఎంత క్షోభ అనుభవించానో మీరు ఊహించలేరు" అని ఆమె అంటుంటే మహర్షికి అలగాజనం వల్ల తాము పడుతున్న క్షోభ గుర్తుకొచ్చింది. ఆ ఊహ వల్ల అతని కోపమంతా గొంగళి పురుగుల మీద మళ్ళింది. "మరి, భరిస్తూ కూర్చున్నావా? ఏ పురుగుల మందో కొట్టి చంపేయలేకపోయావా?" కసిగా అన్నాడు. అతని మాటల్లో పదునుకు కారణం తెలియక విస్తుపోయినా అదేమీ పట్టించుకోకుండా సమాధానం చెప్పింది. "చేసాను మాస్టారూ...అన్నీ చేసాను. మాలాథియాన్ స్ప్రే చేసాను. దెబ్బకు అన్నీ చచ్చిపోయాయి. కానీ వాటినలా చంపేయడం చాలా బాధగా అనిపించింది" అంది.

"తప్పదు కదా మరి" అన్నాడు. "తప్పదనుకోండి. కానీ వాటిని మళ్ళీ చంపడానికి నా మనసొప్పలేదు. 'జీవవైవిధ్యం అదే .. బయో డైవర్సిటి" గురించి మావారు తరచూ చెపుతుండేవారు. ఈ సృష్టిలో అన్ని ప్రాణులూ జీవించి ఉండాలని, అప్పుడే ప్రకృతి సమతుల్యత కాపాడబడుతుందని, ప్రతి ప్రాణి జీవించి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని' ఆయన చెప్పిన మాటలు గుర్తొచ్చినప్పుడల్లా గొంగళి పురుగులను చంపి నేను తప్పు చేసాననిపించేది. అప్పటినుంచి వాటికీ, నాకూ నష్టం లేని పరిష్కారం కోసం నిరంతరం అన్వేషించేదాన్ని" అంది. "మరి దొరికిందా?" ఉత్సాహంగా అడిగాడు. ఆమె తలూపగానే "ఏమిటది?" అంటూ కుతూహలంగా ప్రశ్నించాడు. "అదిగో" .... అంటూ దూరంగా ఉన్న రెండడుగుల ఎత్తున్న వెదురు బుట్టలను చూపింది. అతనికేమీ అర్థం కాలేదు. "ఈ పద్ధతి కాస్త కష్టమే. కానీ ఫలితం బాగుంది. ఆ బుట్టలో వాడి పోయిన పూలు, ఆకులు, ఇంట్లో మిగిలిపోయిన కాయగూరలు, పళ్ళు పడేసి, ఓపిగ్గా గొంగళీ పురుగులను ఏరి ఆ బుట్టల్లో పడేస్తున్నాను. మొదట్లో పురుగులు చాలా ఎక్కువగా ఉండడం వల్ల నా స్టూడెంట్స్ సహాయం తీసుకున్నాను. ఇప్పుడు వాటి సంఖ్య తగ్గిపోవడంతో నేనే శ్రమ పడుతున్నాను. మొదట్లో అవి బుట్టలో ఉండకుండా పాక్కుంటూ బయటకు వచ్చేసేవి. కానీ రాను రాను వాటికీ అలవాటయిపోయింది. ఇప్పుడు బయటకు రావడం లేదు" అంటూ ఒక పుల్ల తీసుకొని గొంగళీ పురుగులను బుట్టలో వేస్తూ అంది "వీటి లార్వా దశ నాలుగు నుంచి ఐదు వారాల వరకూ ఉంటుంది. ఆ తర్వాత ఫలితం ఎలా వుంటుందో చెప్పనక్కరలేదు" అంటూ హఠాత్తుగా కేక పెట్టి, ఆనందంతో చప్పట్లు కొడుతూ......" అటు చూడండి" అంటూ అరిచింది చిన్నపిల్లలా. విస్మయపడుతూ అటుచూసాడు. రెండు అందమైన సీతాకోకచిలుకలు రెక్కలు ఆడిస్తూ, బుట్టలోంచి పైకి వస్తున్న దృశ్యం ఎంతో రమణీయంగా కనిపించింది. ముగ్ధుడయిపోయిన

మహర్షి ఆ సీతాకోకచిలుకలు కనుమరుగయ్యే వరకూ అలా చూస్తూనే ఉండిపోయాడు. “టైం వచ్చేసింది మాస్టారూ… వచ్చేవారం మళ్ళీ రండి. అప్పుడు మా తోటనిండా రంగు రంగుల సీతాకోక చిలుకలే ..” అంటూ కళ్ళు మూసుకొని, ఆ దృశ్యాన్ని ఊహించుకుంటూ పరవశం చెందుతున్న వసంతను చూస్తుంటే అతనికి చాలా ముచ్చటేసింది.

మనసారా ఆమెను అభినందించి తిరిగి వచ్చేస్తున్నపుడు, అతని అంతరాత్మ వేసిన ప్రశ్నకు సమాధానం దొరక్క సతమతమైపోయాడు. “నువ్వు పడుతున్న క్షోభకు కారణమైన ఆ జనం శిక్షించబడాలని, వాళ్ళు నాశనమైపోవాలని కోరుకున్నావేగానీ, వసంతలా మంచి పరిష్కారం ఎందుకు వెదకలేదు? నువ్వు ఎంతగానో అసహ్యించుకొనే గొంగళి పురుగుల్లాంటి జనం, సీతాకోక చిలుకల్లా మారడానికి మార్గాలెందుకు అన్వేషించలేదు?” అంటూ అంతరాత్మ నిలదీస్తుంటే, ‘నిజమే నేను ఆ దిశలో ఆలోచించలేదు’ అనుకున్నాడు. ‘అంతరాత్మ ప్రబోధం చాలా కష్టమే గాని, అసాధ్యం కాదు’ అని అనిపించినా, దాన్ని కార్యరూపంలోకి ఎలా తేవాలో తెలియక సతమతమయ్యాడు. ఎంతగా ఆలోచించినా దారి దొరక్కపోయినా, ఆశ మాత్రం వదులుకుని మహర్షికి ఇంట్లో అడుగుపెట్టగానే దారి దొరికింది. టీపాయ్ మీదున్న దినపత్రిక ఆదివారం అనుబంధం సంచికను యథాలాపంగా అందుకున్న మహర్షి దృష్టి కవర్ పేజీ మీదున్న ప్రముఖ టీవీ హీరో పవన్ ఫోటో మీద పడింది. ఆసక్తిగా దానికి సంబంధించిన వ్యాసం చదివి, తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. తనికిప్పుడో దారి దొరికినట్లనిపించింది.

***

“ఈ నెల రోజులూ హాయిగా ఊళ్ళన్నీ తిరిగి, ఇప్పుడు మళ్ళీ నరకంలో పడుతున్నాం” అని బాధగా అంటూ టేక్సీ ఎక్కింది అపర్ణ. “నీ ఇష్టదైవం బాలాజీకి మొక్కుకున్నావు కదా? ఆయన ఏదో ఒక దారి చూపించకపోడులే” అంటూ నవ్వాడు మహర్షి. వైశాలికి ఇచ్చిన సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి మహర్షి దక్షిణ భారత యాత్ర ప్లాన్ చేసాడు. అది పూర్తి చేసి టేక్సీలో ఇంటికి వెళ్తున్నారు. ఇంటికెళ్ళే లోపల యాత్ర కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్న వారంతా, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ రావడంతో, ఠక్కున మాటలు ఆపేశారు. వాళ్ల ముఖాల్లో వెలుగు హఠాత్తుగా మాయమయింది. ఆ సబ్ స్టేషన్ తర్వాతే ….మురికివాడ. దాన్ని దాటిన తర్వాత వాళ్ళ కోలనీ వస్తుంది. ఈ నెల రోజులూ మర్చిపోయిన క్షోభ అందరికీ గుర్తు వచ్చింది. అయితే ……సబ్ స్టేషన్ దాటిన వెంటనే కనిపించిన దృశ్యాన్ని చూసి అందరూ ఆశ్చర్యంతో తలమునకలయ్యారు. మురికివాడ రూపు రేఖలు పూర్తిగా మాయమయిపోయాయి. గతంలో ఎంతో అసహ్యంగా ఉండే ఆ వాడ ఇప్పుడెంతో శుభ్రంగా కనిపిస్తుంది. ఇప్పుడెవరూ అల్లరి చిల్లరగా రోడ్ల మీద కనిపించడంలేదు. పరిసరాలను శుభ్రం చేస్తూనో లేదా ఏదో ఒక పనిచేస్తూనో కనిపించారు. అలా కనిపించే జనం, ఇంతకు ముందు కన్నా బాగా తక్కువగా ఉండడంతో ‘ఈ జనమంతా ఏమై పోయారు? ఏమిటీ

మార్పు?' అనుకున్నారందరూ. తమ కోలనీలో కూడా అలగాజనం కనిపించక పోయేసరికి మరింత ఆశ్చర్యం కలిగింది అందరికీ.

మర్నాడు గానీ వాళ్ల సందేహం తీరలేదు. వాళ్ళ పనిమనిషి ద్వారా అన్ని విషయాలు తెలిసాయి. 'ఒకప్పుడు ఆ మురికివాడలోనే పుట్టి పెరిగిన ప్రముఖ టీవీ హీరో, నిర్మాత పవన్, సబ్ కలక్టర్ గోవింద, ఆ వాడను ప్రక్షాళనం చేయడానికి పూనుకున్నారని, వాళ్ళ వల్లనే దాని రూపు రేఖలు మారిపోయాయని, వాళ్ళు ఏర్పాటుచేసిన ట్రయినింగ్ సెంటర్లలో వాడలోని యువతీ, యువకులు ఉద్యోగాలకోసం శిక్షణ పొందుతున్నారని, చిన్నపిల్లలు స్కూళ్ళకు వెళుతున్నారని, మునుపటిలా ఇప్పుడెవరూ ఖాళీగా ఉండడం లేదని' సీత ద్వారా తెలియగానే అపర్ణ ఆశ్చర్యంగా భర్త వైపు చూసింది. అతని ముఖంలో ఆశ్చర్యం లేదు. బదులుగా చిరునవ్వు కనిపించడంతో వింతగా చూసింది.

***

నెల రోజుల తర్వాత ...... 'గాంధీ కోలనీ' అని కొత్త పేరుపెట్టుకున్న ఒకప్పటి వాడలో 'సందడే సందడి'. అక్కడ ఏర్పాటుచేసిన ఒక పెద్ద బహిరంగ సభకు, అతిధులుగా రాష్ట్రమంత్రి రాజారావు, టీవీ హీరో పవన్, సబ్ కలక్టర్ గోవింద విచ్చేశారు. ఆ సభలో పవన్ ఉపన్యాసం అందరినీ ఆకట్టుకుంది.

"ఇక్కడికి రాగానే, ఒకప్పటి మా బాల్యం, చేదు అనుభవాలు గుర్తొస్తున్నాయి. మా దురదృష్టం కొద్దీ మా నాన్న, గోవింద నాన్న తాగుబోతులే. తాగుడికి డబ్బుకోసం మమ్మల్ని ఇద్దరినీ చదువు మానిపించేసి, కారు గేరేజ్లో పన్లో పెట్టేయడానికి సిద్ధమయ్యారు. నా సంగతెలా ఉన్నా, బాగా చదివే గోవిందను చూస్తే జాలేసేది. ఏం చెయ్యాలో అర్ధంకాక, ఎన్నో రోజులు ఏడ్చాం. చివరకు తెగించి ఇక్కడినుంచి పారిపోయి, హైదరాబాద్ చేరుకున్నాం, అక్కడేదయినా పనిలోచేరి ప్రయివేట్ గా చదువుకోవాలనే ఆశతో. వారం రోజుల వరకూ పని దొరకలేదు. తెచ్చుకున్న డబ్బులు అయిపోయాయి. మూడు రోజులు పస్తులున్నాము. ఆ తర్వాత టీవీ స్టుడియోలో మా ఇద్దరికీ చిన్న చిన్న పనులు దొరికాయి. ఏడాది తిరిగేసరికి మేము ప్రొడ్యూసర్ రాజు గారి దృష్టిలో పడ్డాం. నాలో చురుకుదనాన్ని, ఏక్షన్లో టేలెంట్ ని గుర్తించడమే కాక, గోవిందలోని అపారమైన తెలివితేటలనూ గుర్తించారు. గోవిందను మంచి హాస్టల్లో చేర్పించారు. నాకు మంచి ట్రైనింగ్ ఇప్పించి, టీవీలో అవకాశాలు ఇచ్చారు. అలా ఆయన దయవల్ల ఇద్దరమూ బాగా సెటిల్ అయ్యాము. ఆ తర్వాత మా కుటుంబాలను ఆదుకున్నాము గానీ, మన వాడకు ఏమీ చేయలేకపోయాము. చేయాలనే ఆలోచన ఉండేది కానీ, ఆచరణలోకి వచ్చేది కాదు. ఇప్పుడు మాకు సంతృప్తిగా ఉంది. మన వాడ బాగుపడింది. పిల్లలు స్కూల్ కి వెళ్తున్నారు. యువతకు ఏర్పాటు చేసిన ట్రైనింగ్ ప్రోగ్రాంల వల్ల వాళ్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే కొంతమంది ఉద్యోగాల్లో చేరారని తెలిసి చాలా సంతోషించాము. మునుపటిలా ఎవరూ ఖాళీగా ఉండడం లేదని తెలిసాక మాకెంతో సంతృప్తిగా ఉంది. అయితే ఈ అభివృద్ధి వెనుక మీకు కనిపిస్తున్న మంత్రిగారు, గోవింద, నేను కాక మరో

ముఖ్యమయిన వ్యక్తి ఉన్నారు. ఆ మహానుభావుడెవరో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు" అనగానే సభలో చిన్నగా కలకలం రేగింది. "ఎవరు? ఎవరు?" అనే ప్రశ్నలు దాదాపు అందరి నోటనుంచి వెలువడ్డాయి. పవన్ అతని పేరు చెప్తాడని జనం ఎదురుచూస్తున్న తరుణంలో వేదికకు దగ్గరగా ఒక కారు వచ్చి ఆగింది. "అదిగో ... నేను చెప్పిన మహానుభావుడు వచ్చేసారు" అంటూ పవన్ ఎనౌన్స్ చేసేసరికి, ఆవ్యక్తిని చూడడానికి జనం ఎగబడ్డారు. కార్లోంచి దిగుతున్న మహర్షిని చూడగానే ఆశ్చర్యంతో తెల్లబోయారు. "ఈయనా? ఇతనా?" అనుకుంటూ చెవులు కొరుక్కుంటూ మహర్షి వైపు చూస్తూ ఉండిపోయారు. మహర్షిని వేదిక మీదకు ఆహ్వానించగా, అతను రెండు చేతులూ జోడించి అందరికీ నమస్కారం చేసాడు. వాడలోని వారికి ఆ నమస్కారం చెంపపెట్టులా అనిపించింది. అందరి ముఖాల్లోనూ అపరాధ భావన. పవన్ మళ్ళీ తన ఉపన్యాసం కొనసాగించాడు.

"మీరు ఆయన్ని, ఆయన కుటుంబాన్ని ఎంతో క్షోభ పెట్టారు. మరొకరైతే మీ మీద పగ తీర్చుకోవడానికి ప్రయత్నించేవారు. కానీ ఆయన అలా చేయలేదు. పెద్ద మనసుతో ఆలోచించారు. లోపం ఎక్కడున్నదో తెలుసుకున్నారు. అది సరిదిద్దే ప్రయత్నంలో, అంత దూరంలో ఉన్న నన్నొచ్చి కలిసారు. ఆయన అలా కలిసి, నన్ను ప్రభావితం చేయకపోతే, ఈ అభివృద్ధి అంతా జరిగేదే కాదు. మీరు ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉండాలి. మీరు సన్మానం చేయాల్సింది, నాకు, గోవిందకు కాదు, ఈ మహానుభావుడికి" అనగానే అందరూ కొట్టిన చప్పట్లతో, సభ మారుమోగిపోయింది. మహర్షి ఉద్వేగంతో బాగా కదిలిపోయాడు. అతను ఎంత వద్దన్నా, ఊరుకోకుండా ఘన సన్మానం చేసారు. ఆ మహానుభావుడి పాదాలను స్పృశించడానికి జనం క్యూ కట్టారు.

***

రోజులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు కూడా మహర్షి ఇంటి చుట్టూ గాంధి కోలనీ యువతీ యువకులు తిరుగుతూనే ఉన్నారు. అంతేకాక స్వతంత్రించి ఇంట్లోకి కూడా రాగలుగుతున్నారు. మాస్టారనో, అమ్మగారనో, అన్నయ్యా అనో, అక్కా అనో సంభోదిస్తూ ఆ కుటుంబం వెంటపడుతున్నారు. మహర్షి దగ్గర, వైశాలి దగ్గర చదువు నేర్చుకుంటున్నారు. ప్రద్యుమ్న వాళ్లకు ఫుట్ బాల్ నేర్పిస్తున్నాడు. అపర్ణ ఆడపిల్లలకు వంటలు, కుట్లు, అల్లికలు నేర్పిస్తుంది. ఇంటి పనిలోనూ, తోటపనిలోనూ వాళ్ళంతా మహర్షి కుటుంబానికి ఎంతో సాయం చేస్తున్నారు.

వాళ్ళను చూస్తుంటే మహర్షికి అందమైన 'సీతాకోకచిలుకలే' గుర్తొస్తున్నాయి. మునుపటిలా అసహ్యంగా ఉండే గొంగళీ పురుగులు గుర్తుకు రావడం లేదు.

***0***

# పండగ వచ్చింది

## భాగవతుల భారతి



"అమ్మా! బతుకమ్మ పండుగకి అందరూ అమ్మమ్మా వాళ్ళిళ్ళకి వెడతారూ! మనమెందుకు వెళ్ళం?" కోకిల ప్రశ్నకు సమాధానం ఏం చెప్పాలో అర్ధంకాక అయోమయంగా చూసింది పార్వతి.

"అమ్మమ్మకి ఆరోగ్యం బాగుండదు కదా, మనం వెడితే తను మనకి వండిపెట్టలేక ఇబ్బంది పడుతుంది తల్లీ అందుకని వెళ్ళం"

కారణం అది కాదని తనకూ తెలుసు. కానీ ఎన్నో విడమరిచి చెప్తే, విని అర్ధం చేసుకునే వయసు కాదు కోకిలది.

"పోనీ! మనమే పని చేసేసి అమ్మమ్మని కష్టపెట్టకుండా చూసుకుందాం!" ఆ పసిదానికి వచ్చిన ఆలోచన మాకు రాకనా? నిట్టూరుస్తూ గతంలోకి జారిపోయింది పార్వతి .

***

మధ్యతరగతి కుటుంబాల్లో, అతి ప్రేమల పూల గుబాళింపులలో స్వేచ్ఛా స్వతంత్రాలు హరించే, బంధాల మమకారపు ముళ్ళు ఉంటాయి. చిన్నవే. కానీ గుచ్చుకుంటాయి. కారణాల సంకెళ్లు ఉంటాయి చిన్నవే. వదిలించుకోలేము. అదే సంకెళ్లలో ఉంటే ఊపిరాడదు...

ఇద్దరు అక్కచెల్లెళ్లు .. పార్వతీ, సరస్వతీ అక్కచెల్లెళ్ళ కన్నా ఎంత చక్కగా స్నేహితులల్లే మెలిగేవారూ!

బతుకమ్మ పండగ వచ్చిందంటే. రకరకాల తంగేడు పూలు, తుమ్మ, బంతీ, చేమంతి పూలూ చెట్టూ పుట్టా తిరిగి, కొమ్మ కొమ్మనూ అడిగి, రెమ్మరెమ్మనూ తెంపీ, బతుకమ్మను పోటా పోటీగా పేర్చి, దోస్తులతో గంతులేనా! చిందులేనా! పట్టులంగాల పరపరలూ, పసుపు కుంకుమల కళకళలూ పోటీపడి "నాది పెద్ద బతుకమ్మ" అంటే "నీ కంటే నేనే పెద్దగ పేర్చినా" అనుకుంటూ ఎన్ని పాటలూ, డాన్సులూ, నిమజ్జనం రోజు

చూడాలీ !...

అందరూ కదలి వెడుతుంటే, పూలవనం కదలి వెడుతున్నట్టే ఉండేది. ఎంగిలి పూవు రోజునుండీ సద్దుల బతకమ్మ వరకూ , ఎన్ని పిండివంటల సందళ్ళనీ. పార్వతికీ, సరస్వతికీ పెళ్ళయినాయి. పార్వతిని, బావకే ఇచ్చి చేసారు. పార్వతి అంటే బావ సత్తిపండుకు పంచప్రాణాలు . క్షణం వదిలి ఉండేవాడు కాదు. చెల్లి

సరస్వతికి బయటి సంబంధమే. బతుకమ్మ పండుగకి కూతుళ్ళనూ, అల్లుళ్ళనూ పిలిచేవారు రాయుడుగారు.

అసలు కథ ఇక్కడే మొదలయింది.

మేనల్లుడే కాబట్టి, అందునా చేసేది వ్యవసాయం పనులే కాబట్టి, పనులు జీతగాళ్ళ మీద వదిలి, ఎప్పటికప్పుడు ఫోన్ లో సూచనలిస్తూ, భార్య పార్వతితో కలిసి ముందే వచ్చేసేవాడు పెద్దల్లుడు, పండక్కి. చిన్నల్లుడు ప్రైవేట్ కాలేజీ లెక్చరర్. ఒకరి చేతి క్రింద ఉద్యోగం. పని ఒత్తిడి వలన లేటుగా వచ్చేవాడు. ఐతే ముందే వచ్చి కూర్చున్న పార్వతి భర్త తోడల్లుడికి, మరదలికీ ఫోనులు చేసి అతిప్రేమతో.... "ఏమర్రా! ఎప్పుడొస్తున్నారూ" అని తెగ ఫోనులు చేస్తూ ఉండేవాడు.

వాళ్ళు అదిగో ఇదిగో అంటూ పండుగ రేపనగా క్రితం రాత్రి దిగేవారు. పండగ చక్కగా కలివిడిగానే జరిగేది. ఆడపిల్లలిద్దరూ బతకమ్మను పేర్చి, పండగ అయిపోగానే, భార్యమీద అతి ప్రేమ గల పార్వతి భర్త ప్రయాణానికి సిద్ధమై "పార్వతీ! పద!" అనేవాడు.

సరస్వతి వాళ్ళు ఓ రెండు రోజులు ఆగేవారు ప్రయాణానికి .

రాయుడుగారు "ఉండు పార్వతీ నువ్వు కూడా" అనేవారు. చెల్లి సరస్వతి "అక్కా! మేం నిన్ననేగా వచ్చింది. ఇంకో రెండు రోజులు కలిసి ఉందామే" అనేది. పార్వతి మనసు ఊగేది, ఉండటానికి.

సత్తిపండు పేచీలు మొదలుపెట్టేవాడు.

"మేం వచ్చినప్పుడు మీరు వచ్చారా? మేం ఎన్నిసార్లు ఫోన్ చేస్తే వచ్చారూ తమ్ముడూ! మీరు రమ్మనగానే మీ ఆవిడ తోక ఊపుకుంటూ మీ వెనుకే వచ్చేయదా? మరి మా ఆవిడ నా వెనకే రావద్దా?" లా పాయింట్ తీసేవాడు.

"పోనీలే సత్తీ! అక్కచెల్లెళ్ళు ఇన్నాళ్ళకు కలిసారుగా, ఉండనీ రాదూ !" రాయుడుగారు నచ్చచెప్పబోయేవారు.

"సరేలే! మీ అమ్మాయిని మీరే ఉంచుకోండి నేను పోతున్నా." అని అన్నీ సదిరి అంగలూ పంగలూ వేసుకుంటూ, వెళ్ళేవాడు. వెళ్ళేవాడు వెళ్ళకుండా "వస్తావా! రావా!" అని అరిచేవాడు.

పార్వతి బిక్కముఖం పెట్టుకుని వెళ్ళలేక వెళ్ళేది. ఇంట్లోవాళ్ళ మనసు కలత చెందేది. ప్రతీ సంవత్సరం పండుగకూ ఇలాగే జరిగేది. సరస్వతీ, భర్తా పండుగ ముందుగా రారు. పార్వతీ, భర్తా పోట్లాట లేకుండా వెళ్ళరు. చిన్న విషయమే పెద్దదిదా మారి ఈ వ్యవహారం తలనొప్పిగా తయారయింది రాయుడు గారికి.

ఇక అక్కణ్ణించి "అమ్మాయ్! మీ అమ్మకి ఆరోగ్యం బాగుండలేదు, వండి వార్చే ఓపిక లేదు. మీరే వండి పండుగ జరుపుతామన్నా, రాకరాక వస్తారు ఆడపిల్లలు. వంటపనీ అదీ చేయిస్తే ఏం బాగుంటుండీ? ఆ చేతలేవో మీమీ ఇళ్ళల్లో చేసుకోండి." అని పండుగకు ఒకరిని పిలిస్తే, ఇంకొకరికి కోపం. అందుకే ఎవర్నీ పిలవట్లా.

అప్పుడప్పుడూ కూతుళ్ళు వెళ్ళి చూసి వస్తూనే ఉన్నారు అమ్మానాన్నలని. వాళ్ళూ అంతే అమ్మాయిలను

చూడ్డానికి రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. బంధుత్వాలేవీ తెగిపోలా! ఫోన్ల లో "చూసారా! అన్నయ్యగారూ! పండగలకు పిలవటం కూడా మానేసారు. వీళ్ళకి కూతుళ్ళు కావాలి, అల్లుళ్ళు అక్కర్లా!"
"అవునండీ! తమ్ముడుగారూ నేనూ అదే చూస్తున్నా! మనల్ని  పండుగలకే కాదూ దేనికీ పిలవటల్లా" అని సత్తిపండూ ఇలా గుంజుకోవటాలతోనే చాలా బతకమ్మ పండుగలూ, మామూలు పండుగలూ కూడా వెళ్ళిపోయి సంవత్సరాలు గడిచిపోతున్నాయి. పిల్లలూ పెరిగారు.

***

"అమ్మా! స్కూల్ వాళ్ళంతా విహారయాత్రకు వెడుతున్నారు. నేనూ వెడతానే! నాన్నా! నేనూ వెడతాను " తొమ్మిదో తరగతి చదువుతున్న కోకిల చాలా పట్టుబట్టింది.
"కోకిల వచ్చే సంవత్సరం పదవ తరగతికి వస్తుంది. చదువులోనే ఉండాలి. విహారయాత్రలూ అవీ కుదరదని,  పైగా ఎలాగూ దసరా సెలవులేగా!" అని సత్తిపండు, పార్వతీ కోకిలను వెళ్ళమన్నారు. విహార యాత్రకు వెళ్ళింది కోకిల.
మూడో రోజున వాకిట్లో కారు ఆగింది. పార్వతి తొంగి చూసింది. పుట్టింటి వాళ్ళ డ్రైవర్ 'నాని' ని చూసి గుండె గుభేలుమంది పార్వతికి.
"నానీ" అంది గాభరాగా.
"ఏంలేదమ్మాయ్ గారూ! బ్రతుకమ్మ పండుగకు ఆడపిల్లలు రావాలని మీ నాన్నగారు కబురంపినారు. మిమ్మల్ని తీసుకెళ్ళి దింపి, మీ సెల్లిగారి దగ్గరకు యెళ్ళాల. బయలుదేరండి. నేను మీరు రెడీ అయ్యేవరకూ ఆగుతాలెండీ" అన్నాడు నాని.
అవాక్కైచూస్తోంది పార్వతి తను విన్నది నిజమేనా అని.
ఇంతలో సత్తిపండు వచ్చాడు "నువ్వు వింటున్నది నిజమే పార్వతీ! రాత్రి మామయ్య ఫోన్ చేసాడు పండక్కి రమ్మనీ కారు పంపుతున్నాననీనూ! నీకు సర్ప్రైజ్ ఇద్దామనీ నీకు చెప్పలా!" అని నవ్వాడు.
"అయ్యో! సమయానికి కోకిల ఊళ్ళోలేదు, రేపు వస్తుంది. తనూ రావాలిగా!" పార్వతి తటపటాయించింది.
"మీరు రండి! పాపగారి కోసం అయ్యగారి కోసం మళ్ళీ వస్తా" అని హడావిడిగా బయలుదేరదీసాడు డ్రైవర్.
వాకిట్లో అడుగుపెట్టగానే బిలబిలమంటూ సరస్వతీ, పిల్లలూ కారును చుట్టు ముట్టేసేసరికి పార్వతి ఆశ్చర్యపోయింది.
"అరే మీరంతా?" అంది కారు దిగి లోపలికి నడుస్తూ,
"అవునక్కా! అప్పుడే ఆశ్చర్యపోకూ! నీ కూతురు కోకిలకూడా ఇక్కడే ఉంది." అంటూ "కోకిలా!" అని పిలిచింది.
తలుపు చాటునున్న కోకిల బయటికి తొంగి చూసింది.
"అవునమ్మాయ్! మీ పిల్లలు పిల్లలు కాదే పిడుగులే!  నీ కూతురూ, సరస్వతి కూతురూ విహారయాత్ర అని మీకు చెప్పి ఇక్కడికే వచ్చారు. తాతయ్యా! పండక్కి మమ్మల్ని ఎందుకు పిలవట్లేదూ? అని నిలదీసి, రెండు

రోజులనుండీ, ఇంట్లో సందడిగా తిరుగుతుంటే, పూర్వం రోజులు గుర్తుకు వచ్చి మనసు తహతహ లాడిందమ్మా. ఆడపిల్లలంటే బతకమ్మ సందడే కదా! మళ్ళీ కళకళలాడుతూ ఉండాలని.. " రాయుడు గారి గొంతు గద్గదమైంది. తమాయించుకున్నారు

"ఇన్నాళ్లకు మళ్ళీ సంతోషం నట్టింట నాట్యమాడిందమ్మా" అని ఆనందభాష్పాలతో కళ్ళు తుడుచుకుంది రాయుడి గారి భార్య.

"మీ అనందం చెడగొట్టటానికి నేనూ వచ్చేసాగా " అన్న గొంతు వినబడి వాకిట్లోకి తొంగి చూసారు.

సత్తిపండు లోపలికి వస్తూ కనిపించాడు.

"అక్క వెనకాల తోక రాలేదేమా ఇంకా! అనుకుంటున్నా! వచ్చేసింది" సరస్వతి బావను మేలమాడింది నవ్వుతూ.

"అవును మరి! అక్క వెనకాల కుక్క! కుక్కకి తోక లేకపోతే ఎలా?" నవ్వుతూ మరదలి నెత్తిమీద మొట్టికాయ వేసాడు సత్తిపండు.

"ఇన్ని సంవత్సరాలు గడిచినా పార్వతి మీద నీ కున్న ప్రేమ మారలేదు సత్తీ! పార్వతి అదృష్టవంతురాలు." అన్నారు రాయుడుగారూ, భార్య.

"పార్వతీ! ఎప్పుడూ మన తిరుగు ప్రయాణం? ముందే చెప్పు" అన్న సత్తిపండు మాటలకు సత్తిపండుతో పాటు అక్కడున్న వాళ్ళంతా ఫక్కున నవ్వారు.

నట్టింట నవ్వుల సందడి చూసి బతుకమ్మ నిండుగా మురిసింది.

***0***

# మారిన మనసు

## కొలిచిన జ్యోతిర్లత



రైలు నాగపూర్ లో ఆగింది. ఇంతలో ఒక కుర్రాడు కాఫీ.. కాఫీ అంటూ అరుస్తూ స్టీల్ క్యాను, పేపర్ కప్పులతో రైల్లో ప్రత్యక్షమయ్యాడు. అదే రైల్లో కాశీ వెళుతున్నారు రఘురామయ్య, కామేశ్వరమ్మ. జీవితంలో అన్ని బాధ్యతలు తీరిపోయిన ఆ దంపతులకు కాశీలో కొన్నాళ్లు ప్రశాంతంగా కాలం గడపాలని రఘురామయ్య ఈ ప్రయాణానికి నడుం కట్టాడు. రఘురామయ్య శాంత స్వభావి. దేనికీ ఎక్కువ చలించడు. అందుకు పూర్తి విరుద్ధం కామేశ్వరమ్మ. ప్రతి చిన్న విషయానికి కంగారు పడుతుంది. కొంత అమాయకత్వమూ వుంది. సంతోషం వచ్చినా, బాధ వచ్చినా ఇట్టే బయట పడిపోతుంది. ఎన్నోసార్లు తన తొందరపాటు పనులతో రఘురామయ్యను ఇరకాటంలో పెట్టింది.

కాఫీ తెచ్చిన కుర్రాణ్ణి చూసి "ఏవండి కాఫీ తాగుదామా" అని అంటూనే "బాబూ రెండు కాఫీ" అంది కామేశ్వరమ్మ. అడిగిందే తడవుగా వాడు రెండు కప్పుల్లో కాఫీ పోసి యిచ్చాడు. ఏదో పుస్తక పఠనంలో వున్న రఘురామయ్య

"నాకొద్దు. నువ్వు కావాలంటే తాగు. అయినా నన్నడక్కుండా ఎందుకు చెప్పావు." విసుక్కున్నాడు.

"నాకేం తెలుసు. నాకు తాగాలనిపించింది. మీరూ తాగుతారని అనుకున్నాను" అంది.

"సరేలే, నాకు చెప్పకుండా ఇంక ఎవ్వరినీ పిలవకు. జేబులో చిల్లర రూపాయలు కూడా ఎక్కువ లేవు." జేబులోంచి రెండు పది రూపాయల నోట్లు తీసి వాడికిస్తూ అన్నాడు రఘురామయ్య. కాఫీ తాగి మళ్లీ పుస్తకంలో నిమగ్నమయ్యాడు. ఒక గంట గడిచింది.

ఇంతలో "బటర్ మిల్క్, బటర్ మిల్క్" అంటూ మరొక కుర్రాడు వీళ్లు కూర్చున్న చోటికి వచ్చాడు. కామేశ్వరమ్మ " బాబూ, ఒక్క గ్లాసు యెంత" అని అడిగింది. "పది రూపాయలు" అన్నాడు వాడు. "ఏదీ ఒక గ్లాసు ఇవ్వు" అంటూ తీసుకొని " ఏవండి, వాడికి పది రూపాయలు ఇవ్వండి" అంది. సీరియస్ గా

పుస్తకం చదువుతున్న రఘురామయ్య తలెత్తి భార్య వైపు చూస్తూ " ఈ మజ్జిగ ఎందుకు తీసుకున్నావు. ఇందాకే కాఫీ తాగావు కదా" చిరాకు పడ్డాడు.

"నేను ఊరికేనే తీసుకున్నాననుకున్నారా, మీరు ఇందాక మీ దగ్గర చిల్లర రూపాయలు ఐపోయాయన్నారు. వాడి దగ్గర బోల్డు చిల్లర వుంది. వందకి చిల్లర ఇస్తావా బాబూ అని అడిగాను. మజ్జిగ కొంటే ఇస్తానన్నాడు. అందుకే తీసుకున్నాను. అయినా ప్రతీ చిన్న విషయానికి విసుక్కోవటం మీకు అలవాటైపోయింది."

"అది కాదే, జేబులో చిల్లర అంతా అయిపోయింది. డబ్బులు సీటు కింద సూటుకేసులో వున్నాయి. సూటుకేసుకు తాళం వుంది. ఇప్పుడు తియ్యాలంటే టైం పడుతుంది. కూర్చున్న వాళ్ళందరిని జరగమనాలి. నువ్వు మజ్జిగ ఇంకా తాగలేదు కదా. గ్లాసు వాడికిచ్చెయ్" అన్నాడు.

ఇది విన్న వాడు " సారూ, ఒకసారి ఇచ్చాక వాపసు తీసుకోను. భలే బేరం దొరికింది. నా పైసలు నాకిచ్చేస్తే పోతాను" వాడు తొందరపెట్టసాగాడు. చేసేదేమీ లేక పక్కన కూర్చున్న తోటి ప్రయాణీకులను కాళ్లు కాస్త పక్కకి జరుపుకోమని చెప్పి సూటుకేసు తాళం తెరచి అడుగున బట్టల పొరల్లో జేబురుమాలులో దాచిపెట్టిన నోట్ల కట్టను తీయగా అన్నీ ఐదు వందల నోట్లు కనపడ్డాయి. అందులో ఒక నోటు తీసి మిగతావి మళ్లీ బట్టల మడతల్లో పెట్టేసి మజ్జిగమ్మిన కుర్రాడికి ఐదువందల నోటు ఇచ్చాడు. వాడు నోటు చేత బుచ్చుకొని చిల్లర తెచ్చి ఇస్తానని కదలబోతుండగా కామేశ్వరమ్మ " నీ దగ్గర చాలా చిల్లర చూశాను. మళ్లీ ఎక్కడినుండో తెచ్చి ఇస్తానంటావేమిటి. నీ దగ్గర చూడు వుంటాయి" అంటూ దబాయించింది.

"ఐదువందలకి చిల్లర లేవమ్మా. తెచ్చి ఇస్తానంటున్నా కదా" అంటూ ఐదొందలు తీసుకొని మాయమయ్యాడు.

పావుగంట గడిచింది. వాడు రాలేదు. వాడి కోసం ఎదురుచూస్తున్న కామేశ్వరమ్మకు ఆందోళన మొదలయ్యింది. భర్తతో చెబుదామంటే కసురుకుంటాడు. ఇంకో పావుగంట గడిచింది. ఆవిడ బీపీ పెరిగింది. ఉండబట్టలేక భర్తతో "ఐదువందలు పుచ్చుకొని వాడు అటే పోయాడు. వస్తాడంటారా" సందేహం వెలిబుచ్చింది.

"వాడు ఎక్కడికీ పోడు లేవే. కంగారు పడకు. అయినా నీ పిచ్చి గానీ చిల్లర కోసం మజ్జిగ తాగడమేంటి " అన్నాడు.

"అది కాదండీ, కాశీలో చాలా మోసాలు జరుగుతాయని విన్నాను. చిల్లర డబ్బులు పెట్టుకోకపోతే వున్న డబ్బంతా రిక్షా వాళ్లు, వీళ్లు దోచేస్తారట. అందుకే వాడి దగ్గర చిల్లర డబ్బులు కనపడగానే మీ దగ్గర చిల్లర ఐపోయిందన్న మాట గుర్తొచ్చింది. అందుకే మజ్జిగ తాగాను. దాహం కోసం కాదు. వాడేమో ఐదొందలు పట్టుకొని వెళ్ళిపోయాడు. ఇంక రాడో ఏమో" విచారంగా అంది.

"కాస్త ఓపిక పట్టవే. అంత కంగారెందుకు?"

" ఏమోనండీ వాడు రాడనే అనిపిస్తూంది." దిగులుగా అంది.
"సరే, వాడు రాడనే అనుకుందాం. పోతే యెంత పోతుంది. నాలుగు వందల తొంభయ్. లేనివాడికి దానం చేశాననుకో. ఆ డబ్బు లేకపోతే మనం బతకలేని స్థితిలో లేము కదా. దేవుడు మన అవసరాలకు కావలసినంత డబ్బు ఇచ్చాడు.  ఇంక ఆ విషయం వదిలేయ్. ఇదిగో ఈ పుస్తకం చదువుకో" అంటూ కామేశ్వరమ్మ చేతిలో ఒక ఆధ్యాత్మిక పుస్తకం పెట్టి మళ్లీ తన పుస్తక పఠనంలో మునిగిపోయాడు. కొంతసేపు అయ్యాక తలెత్తి చూసిన రఘురామయ్యకు ఇంకా దిగాలు పడి వున్న భార్య కనిపించింది.
"ఏమిటోయ్, ఇంకా అలాగే కూర్చున్నావేమిటి. ఆ గొడవ వదిలేయ్ మని చెప్పానా" .
" కాదండీ, వాడు మంచివాడు లాగా కనిపించాడు. ఇంతలా మోసం చేస్తాడని అనుకోలేదు. నిష్కారణంగా డబ్బులు పోయాయని బాధగా వుంది".
"నీకు ప్రతివాడు మంచివాడి లాగానే కనిపిస్తాడు. వాళ్ల మొహాలపై రాసి ఉంటుందా అలా అని.  అయినా వాడి దగ్గర తప్ప చిల్లర పేరెక్కడైనా దొరకదా. పెట్లోంచి నోటు తీయించి మరీ ఇవ్వమన్నావు."
మౌనమే శరణ్యంగా వుంది కామేశ్వరమ్మ పరిస్థితి. రఘురామయ్య ఇంకా అందుకున్నాడు.
"ఇదిగో చూడు, మన డబ్బులు కష్టార్జితం. ఎక్కడికీ  పోవు. నాకా నమ్మకం వుంది. నువ్వు దిగులు పడకు," ఓదార్పుగా చెప్పాడు.
కామేశ్వరమ్మ అన్యమనస్కంగానే ఆయన చెప్పేది వింటోంది. ఇంకో అరగంట గడిచింది. దూరంగా మజ్జిగమ్మిన వాడు వాళ్ళ వైపు రావడం కామేశ్వరమ్మ చూసింది. "ఏవండి, వాడు వస్తున్నాడు". చిన్నగా అరిచింది.
"ఎవరూ.... మజ్జిగ అమ్మినవాడేనా",
"అవునండీ, ఇటువైపే వస్తున్నాడు."
ఇంతలోనే వాడు వీళ్ల దగ్గరకి వచ్చేసాడు. కామేశ్వరమ్మ వాడిని నిలదీస్తూ
"ఏంటయ్యా, చిల్లర ఇవ్వకుండా అటే పారిపోయావు. ఇలా మోసాలు కూడా చేస్తారా" అంటూ గయ్యిమంది.
"అమ్మా, మిమ్మల్ని మోసం చేయాలనుకుంటే అసలు ఇక్కడికి వచ్చేవాడిని కాదు. ఈరోజు బేరాలు బాగున్నాయి. చాలా పెట్టెల్లో అమ్మాను. తెచ్చిన సరుకంతా అమ్ముడయిపోయింది. పైసలు లెక్క చూస్తుంటే ఎక్కువ వచ్చినయ్. అప్పుడు గుర్తొచ్చింది మీకు చిల్లర ఇవ్వలేదని. అందుకే వేగిరం వచ్చినాను. ఇదిగోండి మీ డబ్బులు" అంటూ వాళ్ళకివ్వవలసిన డబ్బులు యిచ్చి వెళ్లిపోయాడు. డబ్బులు చూశాక కామేశ్వరమ్మ మనసు కుదుటపడింది.
"చూశావా... కామేశ్వరం, నేను చెప్పాను కదా. కష్టపడి సంపాదించిన సొమ్ము ఎక్కడికీ పోదని. నువ్వే అనవసరంగా కంగారు పడి నన్ను కంగారు పెట్టేశావు. ఐనా.. మనం కాశీకి ఎందుకు వెళుతున్నాము? ఎటువంటి జంజాటాలు పెట్టుకోకుండా ప్రశాంతంగా కొన్ని రోజులు గడుపుదామనేగా. ఇప్పటికైనా మనసుని భగవంతుడిపై కాస్త మరల్చుకో. నేను ఇచ్చిన పుస్తకం చదువుకో".

అప్పుడే శాంత పడ్డ కామేశ్వరమ్మ భర్త మాటలకి ఆలోచనలో పడింది.

కాశీ విశ్వనాథుడి దర్శనం, అన్నపూర్ణాదేవి దర్శనం చాలా బాగా అయింది. గుడిలో నుండి బయటకు వస్తుంటే హుండీలో వేయటానికి కామేశ్వరమ్మ భర్తను ఐదు వందల రూపాయలు ఇవ్వమని అడిగింది. "మన కుటుంబం తరఫున పెద్ద మొత్తాన్ని హుండీలో వేశాను. నువ్వు వేరే వెయ్యక్కరలేదు" రఘురామయ్య చెప్పబోయాడు. "అదికాదండీ, ముందు ఇవ్వండి, అక్కడ లైను పెరిగిపోతోంది. డబ్బులు వేసి వస్తాను" తొందర పెట్టింది. రఘురామయ్య భార్య చేతిలో ఐదువందల నోటు పెట్టగానే గబగబా హుండీలో వేసి వచ్చింది. భార్య చేసిన పనికి నవ్వుతూ రఘురామయ్య "నువ్వెందుకు హుండీలో డబ్బులు విడిగా వేశావో నాకు తెలుసు." అన్నాడు.

"నాకు రైల్లో జరిగిన సంఘటన ఆలోచనలో పడేసిందండి. అన్ని వ్యామోహాలకు దూరంగా వుండాలని, కాశీలో భగవంతుడి సన్నిధిలో హాయిగా వుండాలని ఇక్కడికొచ్చాము. రైల్లో జరిగిన చిన్న విషయానికి నేను ఎందుకంత ఆందోళన పడ్డానో యిప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది. మీ లాగా నేను ఎందుకు ఆలోచించట్లేదు అని అనిపించింది. అందుకే ఆ ఐదొందలు భగవంతుడికి సమర్పించాక నిశ్చింతగా వుందిప్పుడు. తొందరగా సత్రానికి వెళదాం పదండి, ఆకలేస్తోంది" అంటూ వడివడిగా నడిచింది కామేశ్వరమ్మ. నవ్వుకుంటూ భార్య వెంట నడిచాడు రఘురామయ్య.

***0***

# జీవిత పాఠం

సి.హెచ్.వి.ఎస్.ఎస్. పుల్లంరాజు



రజతోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల వేదిక సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదిక మీద కళాశాల ప్రిన్సిపాల్, విద్యాశాఖ అధికారులు, పుర ప్రముఖులు ఆసీనులయ్యారు. సభాసదులను ఉద్దేశించి, వక్తలు ప్రసంగిస్తున్నారు.

"విజేతల అనుభవాల కంటే పరాజితుల అనుభవాలే తప్పకుండా తెలుసుకోవాలి. విజయం సంతోషం కలిగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చు. ఐతే, మరొక ప్రమాదం లేకపోలేదు. విజయం కొందరిలో అహం, గర్వం కలిగించవచ్చు. అతి విశ్వాసం కలిగించవచ్చు. విజయం వైఫల్యాలని కప్పిపుచ్చవచ్చు." శ్రద్ధగా ఆలకిస్తున్న వాళ్ళలో కొందరికి ఈ భావన రుచించలేదు. అసహనంగా ఆ వక్త కేసి చూశారు. ప్రేక్షకుల మనసుని గ్రహించిన ఆ వక్త తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, "కానీ పరాజయం, పొరపాటులను ఎత్తి చూపుతుంది. ఏది ఎప్పుడు చేయకూడదో, ఎందుకు చేయకూడదో చాటి చెప్పుతుంది. నింగిలో ఎగిరి పోతున్న వాళ్ళని నేల మీదకు దింపి, వాస్తవాన్ని కళ్ళ ముందు నిలబెడుతుంది. చిన్న చిన్న కారణాలకు ఆత్మహత్య చేసుకున్న డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారుల గురించి వింటే ఆవేదన కలుగుతుంది. వారి ఆత్మహత్యలకు గల కారణాలు వింటే ఆశ్చర్యం వేస్తుంది. జీవితంలో గెలుపు, ఓటమి సహజమనే చిన్న విషయం వాళ్లకి అర్థం కాలేదు. ఓటమి సమయంలో కావలసింది కాస్తంత ఓదార్పు, బ్రతుకు మీద ఆశ. ఓటమికి కృంగిపోకు. విజయానికి పొంగిపోకు. పడినా, లేచి నిలదొక్కుకుని గమ్యం వైపు నడక సాగించు.. ప్రతి వ్యక్తీ ఓటమిని హృదయపూర్వకంగా ఆమోదించగలగాలి, ఆహ్వానించాలి, స్వీకరించాలి. మీ పిల్లలకు విజయంతోపాటు, ఓటమి కూడా రుచి చూపించండి. విద్యార్థుల ప్రతిభకు మార్కులే కొలమానం కాదు. కోట్ల సంపాదనే చదువుకి ప్రధాన లక్ష్యం కాదు. తరగతి గదిలో మొదటి బెంచ్ లో కూర్చున్న విద్యార్థులే విజేతలనుకోకండి. చివరి బెంచ్ వాళ్లు చక్రం తిప్పే మహా నాయకులు కూడా కావచ్చు. వివిధ రంగాలను వాళ్లు శాసించవచ్చు. ప్రజా సేవలో దూసుకుపోవచ్చు. ఎందుకంటే నేను కూడా ఒకప్పుడు చివరి బెంచ్ విద్యార్థినే". దద్దరిల్లుతున్న చప్పట్ల మధ్య హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పి, అందరి దగ్గరా సెలవు తీసుకుని కారులో కూర్చున్నాడు, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ చంద్రుడు.

***

ప్రభుత్వ వాహనం వడి వడిగా, రోడ్డు మీద ముందుకు దూసుకుపోతుంటే, అతని ఆలోచనలు గతంలోకి తొంగిచూశాయి. పాఠశాలలో జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది చంద్రుడుకి. పాఠశాలలో ప్రతి శనివారం చివరి రెండు పీరియడ్స్ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించడం పరిపాటి. తెలుగు వాచకంలో ఒక పేజీని చూసి తప్పులు లేకుండా, చూడ చక్కని దస్తూరితో వ్రాయాలి. ఏది వ్రాయాలో, ఎంత సమయంలో పూర్తి చెయ్యాలో పోటీ ముందు ప్రకటిస్తారు. పోటీలో పాల్గొన్న చంద్రం, ఈ పోటీలో కూడా తనకి ప్రథమ స్థానం తప్పకుండా వస్తుందన్న ధీమాలో వున్నాడు. నిజంగా అతని దస్తూరి బాగుంటుంది కూడా. అంతకుముందు జరిగిన పోటీలలో అతనిదే ప్రధమ స్థానం. సాధారణంగా సోమవారం నాడు ఉదయం జరిగే ప్రార్థన కార్యక్రమంలో పోటీ ఫలితాలు ప్రకటిస్తారు. కానీ ప్రసాదరావు మాష్టారు ఆ రోజు అనారోగ్య కారణంగా పాఠశాలకు రాలేక పోవడంతో, పోటీ ఫలితాలు ప్రకటించలేదు. చంద్రుడు నిరుత్సాహ పడ్డాడు. ప్రధమ బహుమతి తనదేనని, అందుకు గాను విద్యార్థుల కరతాళ ధ్వనుల మధ్య తను ఎంతో సంతోషంగా పాఠశాల వేదిక మీద చిరునవ్వులు చిందిస్తూ, మనసులో చిన్నపాటి గర్వంతో నిలబడి ప్రధానోపాధ్యాయుల అభినందనలు అందుకొంటాడు. ఇది అతని కల కాదు. చాలా సార్లు బహుమతులు గెల్చుకున్నాడు. పోటీకి వెళ్ళితే బహుమతి వచ్చి తీరుతుంది. అందుకే అతను నిరుత్సాహపడ్డాడు ఆ రోజు. కానీ, బహుమతి తనదేనన్న ధీమాతో, ఫలితాల ప్రకటన కోసం ఎదురు చూస్తున్నాడు. నాలుగు రోజుల తర్వాత ప్రసాదరావు మాస్టర్, ఉదయం ప్రార్థన కార్యక్రమంలో పాఠశాల వేదిక మీద, చేతిలో సాంస్కృతిక కార్యక్రమ ఫైల్ పట్టుకొని నిలబడటం గమనించిన చంద్రుడు, ఆనందంతో పొంగిపోయాడు. ఈ బహుమతితో కలిసి ఐదు ప్రధమ బహుమతులంటూ లెక్కలు వేసుకున్నాడు.

***

గతుకుల రోడ్డు కారణంగా, కారు వేగం మందగించడంతో, చంద్రుడు వాస్తవంలోకి వచ్చి, కిటికీ లోంచి బయటకు చూశాడు. బ్రిటిష్ కాలం నాటి భవనం, దాని మీద మండల రెవెన్యూ కార్యాలయం, ఏడుకొండలు అని వ్రాయబడివుంది. ఆ భవనం ఎదురుగా ఒక తుమ్మ చెట్టు. చంద్రుడి సూచనల మేరకు, కారు ఆ కార్యాలయం ముందు ఆగింది. ఆ కారుని, కారులోంచి దిగుతున్న జిల్లా కలెక్టర్ ని చూస్తూనే, ఆ కార్యాలయ సిబ్బంది పరుగులాంటి నడకతో కారుని సమీపించారు. చంద్రుడు ఒకసారి అటూ ఇటూ పరికించి, "మీ కార్యాలయానికి పనులు కొరకు వచ్చే ప్రజలకు ఏమైనా సదుపాయాలున్నాయా? కనీసం త్రాగునీరు సౌకర్యం వుందా?" అని అడిగాడు సంబంధిత అధికారిని. ఆ ప్రశ్నకు ఆ అధికారికి నీళ్లు నములడం చూసి, కలెక్టర్ చంద్రుడు,"ఈ భవనంలో ఒక గది, నాలుగు కుర్చీలు, త్రాగునీరు వాళ్ళ కోసం ఏర్పాటు చేయండి. నాకు తెలుసు ప్రస్తుతం వాళ్ళు ఈ తుమ్మ చెట్టు నీడలోనే..." అంటూ ఆ కార్యాలయ సిబ్బంది కేసి చూశాడు. "నిజమే సార్! ఈ చెట్టు నీడలో..."అని చెబుతున్న అధికారి కేసి చంద్రుడు

చూస్తూ, "కొత్త భవన నిర్మాణం కోసం ఫండ్స్ ఇస్తాను. పేపర్స్ సిద్ధం చేయండి" అంటూ డ్రైవర్ కేసి చూశాడు. కళాశాల వారు ఇచ్చిన వేప మొక్కని డ్రైవర్ చేతుల్లోంచి అందుకొని, ఆ కార్యాలయ అధికారికిస్తూ, "దీన్ని ఈ ప్రాంగణంలో నాటండి. ఈ చెట్టు పెరిగి పెద్దదయితే, కొందరు దీని నీడలో కూడా సేద తీరుతారు." అన్నాడు. కారు రోడ్డు మీద మళ్ళీ పరుగు ప్రారంభించింది. చంద్రుడుకి చిన్నతనంలో, కుల ధ్రువీకరణ పత్రం కోసం తాను పడిన పాట్లు, రెవెన్యూ అధికారి సంతకం కోసం, మండుటెండలో, ఒక తుమ్మ చెట్టు నీడలో రోజుల తరబడి నిరీక్షించిన వైనం జ్ఞాపకం వచ్చాయి. మళ్ళీ పాఠశాల జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి.

***

తన అంచనా తారుమారయినందుకు విపరీతంగా నొచ్చుకున్నాడు చంద్రుడు. ఆకలి, దాహం మరిచి పోయాడు. ప్రథమ బహుమతి శంకర్ గాడు ఎలా గెల్చుకున్నాడు? పదే పదే ఆ ప్రశ్న వేసుకున్నాడు. వాడేమి మాయ చేశాడు? తన స్థానంలో శంకర్ వేదిక మీద నిలబడ్డాడు. వేదిక క్రింద నిలబడి తను తప్పట్లు కొట్టాడు. రెండు రోజులు స్నేహితులతో మాట్లాడలేకపోయాడు. శంకర్ గాడ్ని ఏదో విధంగా అవమానించాలని పథకాలు రచించాడు. ప్రసాదరావు మాష్టారు వాడ్ని కొట్టాలని భగవంతుడ్ని వేడుకున్నాడు. వాడికి భయంకరమైన జ్వరం వచ్చి, పాఠశాల విడిచి వెళ్ళి పోవాలని దేవుడికి మొర పెట్టుకున్నాడు. పాపం ఆ ఆశలన్నీ అడియాశలయ్యాయి. ప్రసాదరావు మాష్టారు కావాలనే బహుమతిని శంకర్ కి ఇచ్చివుంటారా? అలా ఎందుకు చేస్తారు? ఇలాంటి చిత్ర విచిత్ర ఆలోచనలతో కొన్ని రోజులు సతమతమయ్యాడు.

ఈ లోపులో పరీక్షలు రావడంతో ఆ విషయం పూర్తిగా మర్చిపోయాడు. పరీక్షలు ముగిసాయి. తమ పిల్లల ప్రగతి పత్రాల కోసం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి, ఉపాధ్యాయులతో సమావేశమై, వెళుతున్నారు. ప్రగతి పత్రం తీసుకుని, చంద్రుడు తల్లి, ప్రసాదరావు మాష్టారు గదికి వెళ్ళింది. ఆమె చదువుకోలేదు. కానీ సంస్కారవంతురాలు. ఉపాధ్యాయులంటే ఆమెకు ఎంతో గౌరవం. "నమస్కారం బాబూ! మా చంద్రుడ్ని మీ చేతిలో పెట్టాం బాబు, మీ దయ. బాగానే సదువుతున్నాడా బాబు? ఏదో పెద్ద పెద్ద సదువులు సదువుతాడట! ఎప్పుడూ ఆ ఊసులే సెబుతాడు. ఇయన్ని మా బోటోళ్లకు అవుద్దా బాబూ! ఈడంటే, కూడు గుడ్డ ఇత్తున్నారు. ఏదో నడుత్తోంది. కాలేజీ సదువులంటే..." ఆమె కళ్ళు నీటి చెలమలౌతున్నాయి. పేదరికంలో మ్రగ్గిపోతూ, పట్టెడు అన్నం కోసం జీవన సమరం జరుపుతున్న మనుషుల నిస్సహాయత, ఆక్రోశం, బంగారు జీవితం కోసం తపిస్తున్న కొడుకుకి, ఎవరూ ఆసరాలేరనే ఆవేదన, ఆమె కళ్ళల్లో ద్యోతకమయ్యింది. కన్న పేగు ఆందోళనకి చలించిపోయాడు ప్రసాదరావు . ఆమెను కుర్చీలో కూర్చోమని సైగ చేస్తూ, "పట్టుదలతో ప్రయత్నం చేసే వారిని వెదుక్కుంటూ అవకాశాలు వస్తాయి. మీ వాడి సత్తా నాకు తెలుసు. పుస్తకాలలో పాఠాలు మాత్రమే కాదు జీవిత పాఠాలు కూడా నేను నేర్పుతా. ఎప్పుడు ఏ సహాయం

కావాలన్నా  చెప్పండి. నా వంతు సహాయం నేను చేస్తాను." అన్నాడు ప్రసాదరావు . ఆమె కళ్ళు ఆనందంతో మెరిసాయి. ఆయన ఇచ్చిన భరోసాతో గుండెలమీది పది ఏనుగుల బరువుని ఎవరో దించేసినట్లయ్యింది.  అప్రయత్నంగా రెండు చేతులు జోడించి దండం పెట్టింది. గది బయట నిలబడిన చంద్రుడు జరిగినదంతా చూశాడు. ఆ చిన్న బుర్ర వినీలాకాశంలో పున్నమి చంద్రుడు తళుక్కున మెరిసాడు.

***

చూస్తుండగానే సంవత్సరాలు దొర్లిపోయాయి. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని చదువుకున్న సామెత చందంగా చంద్రుడు చదువుల్లో దూసుకుపోయాడు. పడి లేచే కెరటంలా జీవితంలో ముందుకు సాగాలని ఒకనాడు పాఠశాలలో ప్రయోగాత్మకంగా ప్రసాదరావు  మాష్టారు సూటిగా చెప్పకుండా చెప్పిన పాఠం,
అతనికి ఒక మధురానుభూతిగా, జ్ఞాపకంగా మిగిలింది. అంతకంటే ఎక్కువగా స్మృతిపథంలో మెలిగే ఆ సంఘటన....

***

"ఒరే చంద్రుడు! పనులన్నీ పూర్తి చేసుకుని, సర్టిఫికెట్స్ తీసుకుని నన్ను కలిసి వెళ్ళు. నేను నా గదిలో వుంటాను, మరిచిపోకు. కాలేజీలో చేరితే తీరిక వుండదు." అని ప్రసాదరావు  మాష్టారు తన గదికి వెళ్లిపోయారు. కొంతసేపటికి చంద్రుడు ఆయన గదిలోకి వచ్చి, ఎప్పటిలాగే చేతులు కట్టుకొని నిలబడ్డాడు. సర్టిఫికెట్స్ దాచుకున్న చేతి సంచి, అతని భుజానికి వ్రేలాడుతోంది. కుర్చీలో కూర్చున్న మాష్టారు, విప్పారిన కళ్లతో, ఒక నిమిషం అతని వంకే చూస్తూ, "నీకో రహస్యం చెప్పాలిరా చంద్రుడు! అందుకే రమ్మని చెప్పా, ఇలా రా."అన్నారు. అవ్యాజమైన అనురాగానికి చిరునామా ఆయన మనస్సు.  చంద్రుడికి ఏదో వింతగా వుంది. ఆయన గొంతు లోంచి మాటలు అస్పష్టంగా వస్తున్నాయి. ఎప్పుడూ గంభీరంగా, హుందాగా వుండే మాస్టారులో ఏమిటీ ఈ మార్పు అనుకున్నాడు మనసులో.  ఆయన బల్ల మీద కొన్ని ఫైల్స్ వున్నాయి. వాటిని చూపిస్తూ, " ఇవి ఏమిటో తెలుసురా? గత పది సంవత్సరాల నుండి మన పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణా బాధ్యత నాదే. నీకు తెలియకపోవచ్చులే ఆ సంగతి." అని ఆగి, కొంచెం దగ్గరకు రమ్మని సంజ్ఞ చేసి, ఫైల్ లో వున్న పేపర్లు కొన్ని చూపించి, "ఇలా చూడరా, ఈ పోటీలో నీకు బహుమతి వచ్చింది. కానీ నేను, న్యాయ నిర్ణేతలతో మాట్లాడి, నీకు మార్కులు తగ్గించాను. ఇలాగే మరి కొన్ని పోటీలలో కూడా.  నీ మిత్రులు అబ్దుల్ కలామ్, జయరాజ్,, శ్రీనివాస్, శ్రీదేవి, రాజ కుమారి ఇలా కొందరు బహుమతులు పొందటానికి కారణమదే. ఆవిధంగా, నేను నీకు అన్యాయం చేశాను. ఏమంటావు? నీకు నా మీద పీకలదాకా కోపం వచ్చింది. కానీ విద్య వలన అలవడిన సంస్కారం, నిన్ను

మూగవాడ్ని చేస్తోంది, నాకు తెలుసు. పోటీల ఫలితాలు, నేను ప్రకటించే సమయంలో, నీలో చెలరేగే ఆశ్చర్యం, ఉద్వేగం, ఉక్రోషం, నిర్లిప్తత...ఇలా నీ భావావేశాల్ని నేను గమనించే వాడిని. అదే సమయంలో పోటీల్లో విజేతలుగా నిలిచిన నీ స్నేహితులలో సంతోషంతో బాటు, వెల్లివిరిసే ఆత్మవిశ్వాసం కూడా గమనించే వాడ్ని. ఐతే నిరాశ కలిగించిన ప్రతిసారీ, నిన్ను మరో విధంగా ప్రోత్సహించి, రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించడానికి పరోక్షంగా సహాయం చేశాను. రాను రాను నువ్వు, ఓటమి, గెలుపులకు అతీతమైన పరిపక్వత సాధించడం గుర్తించాను. ఓటమిని ఓడించడమనే కళని ఆకళింపు చేసుకోవడం నేర్చావు. మరొక వైపు, బహుమతులు సాధించామన్న ఉత్సాహంతో, నీ సహపాటి మిత్రులు, రెట్టించిన ఆత్మబలంతో చదువుల్లో రాణించడం నాకు తృప్తినిచ్చింది. ఇప్పుడు చెప్పరా, నీకు అన్యాయం చేసానా? జీవిత పాఠం నేర్పానా?" గురువు మాటలకి చలించిపోయింది ఆ శిష్యుడి హృదయం. ఇద్దరి కళ్ళల్లోనూ ఆనంద బాష్పాలు. పుత్ర వాత్సల్యంతో చంద్రుడ్ని కౌగలించుకొని, శిరస్సుని ముద్దాడి మనస్సులోనే, "శతమానం భవతి..." ఆశీర్వదించాడు. ఒకనాడు పాఠశాలలో పిల్లలు నాటిన చిన్న మొక్కలు, నేడు పెద్దగా పెరిగి చంద్రుడుకి వీడ్కోలు పలుకుతున్నాయి. సగర్వంగా పాఠశాల గేటు దాటి, బయట ప్రపంచంలోకి అడుగు పెడుతున్న చంద్రుడ్ని, తన గది కిటికీ లోంచి తృప్తిగా చూస్తున్నారు ఆ మాష్టారు.

***0***



# కనపడని శత్రువు

## వియోగి

"హలో డాక్టరుగారు! మా నాన్నగారికి జ్వరం వచ్చింది. నీరసంగా కూడా ఉంది. కొంచెం వస్తారా?" అడిగింది పార్వతి.

"సారీ అండి. ఇప్పుడు ప్రాక్టీసు చేయడం నిషేధం, మీరు పేపరులో చూసే ఉంటారు." అట్నించి డాక్టరు ప్రసాదు చెప్పాడు.

"అలాగంటే ఎలాగండి. ఎన్నో ఏళ్లుగా మీ దగ్గర వైద్యం చేయించుకుంటున్నాము. ఎన్నిసార్లు మీ డిస్పెన్సరీకి రాలేదు? పెద్దాయన, లేవలేని పరిస్థితిలో ఉన్నాడు. దయచేసి వచ్చి యింజెక్షను యివ్వండి." బ్రతిమాలింది పార్వతి.

"సారీ! గవర్నమెంటు హాస్పిటలుకు గాని, ఆథరైజుడు పెద్ద ప్రయివేటు హాస్పిటలుకు గాని తీసుకుపోండి. ఈ కాలంలో ఎవరికి కరోనా వస్తుందో, ఎవరికి రాదో తెలియడం లేదు." చెప్పాడు డాక్టర్.

"మా నాన్నకు కరోనా సింప్టమ్సు లేవు సార్! ఉత్త జ్వరం, ఒల్లు ఏజి వలన నీరసం అంతే!" చెప్పింది.

"అయితే డోలో 650 వేసి, ఒరల్సు తాపించండి."

"రెండు రోజులుగా ఆ డోలో 650 మాత్రలు వేస్తూనే ఉన్నాము తగ్గడం లేదు. మందులు మార్చి మంచివిస్తారని మిమ్మల్ని రమ్మంటున్నాను. మీ ఫీజు రెట్టింపు యిస్తాను. ప్లీజ్ సర్!" పార్వతి ప్రార్థన.

"అర్థం చేసుకోండి. మేము ఎవరికీ ట్రీట్‌మెంటు యివ్వకూడదని కలెక్టరు ఆర్డరు. కావాలంటే కొన్ని మెడిసిన్ల పేర్లు మెసేజ్ పెడతాను తెప్పించుకుని వాడండి. మీరు నా పాత పేషంట్లు కాబట్టి ఒక సలహా యిస్తాను. మీ నాన్నగారికి వెంటనే కోవిడ్19 టెస్టు చేయించండి. కరోనా కనుక ఆయనకు తగిలితే మీ యింటిల్లిపాదికి వస్తుంది."

"అయ్యో! ఆయన రాలేరు సార్!"

"అంబులెన్సును పిలిపించుకోండి, వెంటనే హాస్పిటలుకు వెళ్ళండి."

ఇంకో మాటకు అవకాశం ఇవ్వకుండా సెల్లు ఆఫ్ చేశారు డాక్టర్.

పార్వతికి ఏమీ పాలు పోలేదు.

ఆమె భర్త అనంతపురంలో పని చేస్తున్నాడు, మునిసిపల్ ఆఫీసులో. ఈ పార్వతి ప్రయివేటు స్కూలు టీచరు కర్నూలులో. పిల్లలు కర్నూలు స్కూల్లో చదువుతున్నారు. తండ్రి ఆమెతోనే ఉంటాడు. తల్లి మరణించింది. అన్నయ్యలు తండ్రిని పట్టించుకోరు. తన పేరిట కొంత ఆస్తి రాసిచ్చారని వాళ్ళకు కోపం. అనంతంకు పద్నాలుగు సంవత్సరాలు, అనితకు పన్నెండు సంవత్సరాలు. కరోనా దెబ్బకు లాక్‌డౌన్ ప్రకటించడంతో స్కూళ్లు మూతపడ్డాయి. తను కూడా స్కూలుకు వెళ్ళనక్కరలేదు కాని యాజమాన్యం ఆమెతోటి రెగ్యులర్‌గా ఆన్‌లైన్ పాఠాలు చెప్పిస్తున్నది. తను కొన్ని గంటలు కష్టపడి ఆన్‌లైన్‌లో పాఠాలు చెబుతుంది గాని ఎంత మంది వింటున్నారో అర్థం కాదు. వందమందిలో యిద్దరు రెస్పాన్సు యిస్తే గొప్ప. అయినా తను చెప్పకపోతే ఉద్యోగానికి తిలోదకాలు యివ్వాలి.

బస్సులు లేక కన్వేయన్సు లేక, సెలవులు లేక, పని ఒత్తిడితో హరనాథ్, ఆమె భర్త, అనంతపురం నుండి కొన్ని వారాలుగా కర్నూలుకు రాలేక పోయాడు. అంతా సెల్లులోనే వ్యవహారం నడిపిస్తున్నాడు. అతడికి విధి నిర్వహణలో ఎక్కడ కరోనా అంటుకుంటుందోనన్న భయం ఉంది. భార్యకు, పిల్లలకు చాలా హెచ్చరికలు చేస్తూ ఉంటాడు. మాస్కు లేకుండా బయటకు పోవద్దని, పోయినా దూరం పాటించమని, ఎప్పుడూ చేతులను శానిటైజరుతో శుభ్రం చేసుకోమని చెబుతూ వుంటాడు.  కూరగాయలు కొన్నా కొంతసేపు వేడినీటిలో ఉంచమని, ఎండబెట్టమని, బయట పదార్థాలు ఏమీ తినవద్దని, యిలా ఎన్నో జాగ్రత్తలు రోజూ చెబుతూనే ఉంటాడు.

పార్వతి పక్కింటి పరంధామయ్యగారిని పిలిచింది.

ఆయనకు అరవయ్యేళ్ళ వయసుంది. ఆయనకు పార్వతి నాన్నగారు భుజంగరావుకు మంచి దోస్తీ, ఎన్నో గంటలు కాలక్షేపం చేసేవారు ఒకప్పుడు.

“ఏం చేద్దామంటారు?” పరిస్థితి వివరించి అడిగింది పార్వతి.

“చూడమ్మా! బయట కరోనాకు తప్పించి ప్రస్తుతం ఎక్కడా ట్రీట్‌మెంటు యివ్వడం లేదు. ఏ జబ్బు కోసం పోయినా ముందు కరోనా టెస్టు చేయించమంటారు. అది రావడం కొన్ని గంటలు ఆలశ్యమైపోయి గుండె జబ్బున్న వాళ్ళు కొందరు పైకి పోతున్నారు. టెస్టులో నెగిటివ్ వచ్చినా వారి ప్రాణాలు తిరిగి తీసుకురాలేము కదా! ప్రైవేటుగా ఎవరినీ ప్రాక్టీసు చెయ్యనివ్వడం లేదు. చిన్నా చితక నర్సింగుహోములు మూసివేస్తున్నారు రిస్కు ఎందుకని. డాక్టర్లూ మనుషులే కదా! వాళ్ళకి కూడా కరోనా జబ్బు అంటుకుంటున్నది. మనవూళ్ళో రూపాయి డాక్టరు, పాపం పేషంట్లకు ట్రీట్‌మెంటు యిచ్చి, ఈ కరోనాతో చనిపోయారు. ఆయన వలన ఆయన భార్య కూడా అదే జబ్బుతో పోయింది.” పరంధామయ్య చెప్పారు.

“ఇవన్నీ నిజమే సార్, మనం యిప్పుడేం చేయాలి?” పార్వతి ప్రశ్న.

“ధైర్యం చేసి అంబులెన్సులో హాస్పిటలుకు తీసుకుపోవాలి. అక్కడ కరోనా టెస్టులో పాజిటివ్ వస్తే వాళ్ళే ఆయన్ను ఏదో ఒక హాస్పిటల్లో చేర్చుకుంటారు. మన కర్మకొద్దీ బెడ్సు లేకపోతే, ఏదో ఒక ప్రయివేటు కరోనా

ఆసుపత్రికి పంపిస్తారు. అక్కడ వేలకు వేలు, లక్షలకు లక్షలు ఫీజులు కట్టాలి" పరంధామయ్య సాలోచనగా అన్నారు.

"రోజుకు ఇరవై నుండి ముప్పయిపైన కూడా ఫీజ వసూలు చేస్తున్నారట, సీరియసుగా లేని కేసుల్లో. ఇంకా కొంచెం క్రిటికల్‌గా ఉంటే లక్షల్లోనే వసూలు చేస్తున్నారు. మాకు తెల్సినవాళ్ళకు వారం రోజులకు హైద్రాబాద్‌లో ప్రయివేటు హాస్పిటల్‌లో పదకొండు లక్షలు బిల్లు అయింది." బాధపడింది పార్వతి.

"అదికాదు పార్వతి. కొందరు పాజిటివ్ లేక పోయినా, నెగెటివ్ వచ్చినా ఖరీదైన కరోనా ట్రీట్‌మెంటు యిచ్చి లక్షలు గుంజుతున్నారు. ఈ విషమ సమయంలో మానవత్వం పరిమళించాల్సింది పోయి, కొందరిలో దానవత్వం విజృంభిస్తున్నది. చేతిలో లక్షలుంటే ప్రయివేటు హాస్పిటల్‌లో చేరుద్దాము. గవర్నమెంటులో ఖాళీలు లేవని విన్నాను." పరంధామయ్య చివరికి చెప్పారు.

"కొందరు ప్రభుత్వ ఆసుపత్రులలో గాని, కోవిడ్ సెంటరులలో గాని, ప్రయివేటు ఆసుపత్రులలో గాని ట్రీట్‌మెంటు సరిగా జరగడం లేదంటున్నారు. పేషంటు దగ్గరికి కూడా రాకుండా చాలా దూరం నుండి డాక్టర్లు మాట్లాడుతున్నారట. మందులు, భోజనం అంతా దూరంగా ఉంచి పోతున్నారట. పేషంట్లు నర్సుల దయాదాక్షిణ్యాలపైన ఆధారపడుతున్నారట గదా సార్!" పార్వతి సందేహం.

"కరోనా వచ్చి మానవ విలువలకు కొత్త భాష్యం నిర్వచిస్తున్నది. మనుషులు హోమ్ క్వారంటైన్‌లో ఉండి పోవలసి  వస్తున్నది. ఎందుకైనా మంచిది మీరంతా మీ జాగ్రత్తల్లో ఉండండి. మీ నాన్నగారి దగ్గరకు వెళ్ళేటప్పుడు మాస్కు తప్పనిసరి. శానిటైజరు వాడటం మంచిది. నేను కూడా ఆయన దగ్గరికి పోలేను నాదీ పెద్దవయసు. సీనియరు సిటిజన్లు చాలా జాగ్రత్తగా ఉండాలి. మహమ్మారి తొందరగా తగులుకుంటుంది. తగిలితే వదలదు." పరంధామయ్య జాగ్రత్తలు చెప్పాడు దూరం నుండి.

"అయితే ఆ డాక్టరు ప్రసాదుగారు మెసేజి పెట్టిన మందులను వాడతాను. రెండు రోజులు చూసి తగ్గకపోతే మీరు చెప్పింది ఆలోచించాలి"

అనంతను మెడికలు షాపుకు పంపించి డాక్టరు చెప్పిన మందులు తెప్పించింది. ఆ మందుల కోసం అతను రెండు మూడు షాపులు తిరగాల్సి వచ్చింది. మందులకు కటకట ఏర్పడింది.

ఇడ్లీ తినిపించి తండ్రికి ఆ మాత్రలు యిచ్చి మింగించింది. చేతికి తను గ్లవుజులు వేసుకుంటున్నది తండ్రి దగ్గరకు వెళ్ళేటప్పుడు. మాస్కు ఉండనే ఉంది.

"అయ్యో! మీ అందరికి చాలా యిబ్బంది కలిగిస్తున్నాను." బాధపడ్డారు భుజంగరావు.

"ఆ దేవుడు నన్ను ఒకేసారి తీసుకుపోతే బాగుంటుంది, యిలా మంచం మీద పడేసే బదులు" దండం పెట్టుకుంటూ అన్నారు.

"అవేం మాటలు నాన్నగారు. మీరు కోలుకుంటారు. మంచి మందులు యిచ్చాను" పార్వతి ధైర్యం చెప్పింది.

"అయితే నేను లేచి తిరుగుతానంటావా?" అడిగారు ఆశగా.

“ఆ! మీరు ఇలాంటి జబ్బులు ఎన్ని చూడలేదు? ఇవి వస్తూ ఉంటాయి. పోతూ ఉంటాయి. ఆ భగవంతుడి దయ ఉండాలేగాని మీకేమీ కాదు.”
“ఆ .. అల్లుడు అనంతపురంలో యిరుక్కుపోయాడు. అతనుంటే కొంత ధైర్యంగా ఉండేవాళ్ళం. పబ్లిక్కుతో కాంటాక్టులు ఉండే జాబు అతనిది. జాగ్రత్తగా ఉండాలి ఈ మహమ్మారి అంటుకోకుండా. మీ అన్నలు చూడవలసిన వాళ్ళు నన్ను పూర్తిగా వదిలేశారు. ఆడపిల్ల నీపైన నా బాధ్యత పడవేశారు వెధవలు.” బాధపడ్డారు.
“ఊరుకోండి నాన్నా! ఈ కాలంలో మొగ, ఆడ తేడాలు ఎక్కడున్నాయి? సుప్రీం కోర్టు ఆడపిల్లలకు కూడా ఆస్తి హక్కు ఉందని చెబుతున్నది. అంటే బాధ్యతలు కూడా ఉన్నాయనే కదా అర్థం!” పార్వతి అంది.
“అమ్మా, పార్వతీ! ఇక్కడ నుండి వెళ్ళమ్మా! ఎక్కువసేపుంటే ఈ జబ్బు నీకు వచ్చే ప్రమాదం ఉంది.” భయపడి చెప్పారు.
“అన్నింటికీ ఆ దేవుడున్నాడు.” పార్వతి చెప్పింది వెళుతూ.

అంతకు ముందు పార్వతి యింటికి యిరుగు పొరుగు అమ్మలక్కలు బాగా వస్తూ పోతుండేవారు. చుట్టు ప్రక్కల పిల్లలు కూడా వచ్చి ఆడుకోవడం, పార్వతి దగ్గర డౌట్లు చెప్పించుకోవడం చేసేవాళ్ళు. పార్వతి తండ్రికి జ్వరం వస్తున్నదని తెల్సి అంతా భయపడి పోయి రావడం మానుకున్నారు.
ఇంకా ‘ఆయన్ను కరోనా హాస్పిటల్‌కు పంపవచ్చుగదా’ అని సెల్లులో సలహాలు యివ్వడం మొదలెట్టారు.
గొంతునొప్పి, ఊపిరి సమస్య, ఆయాసం తదితర కరోనా లక్షణాలు లేవని పార్వతి వారి మాటలు వినలేదు.
సెల్ఫ్‌క్వారంటైన్ పాటించింది. తను కూడా ఎవరి యిళ్ళకు పోకుండా, ఎవ్వరితోనూ దగ్గరగా నిలబడి మాట్లాడకుండా పరిమితులు విధించుకుంది.

అక్కడ అనంతపురం నుండి హరనాధ్ ఒకటే టెన్షను పడుతున్నాడు. మామగారికి ఏమవుతుందోనని. ఆయనకి కనుక ఈ మహమ్మారి జబ్బు తగిలిందంటే కుటుంబ సభ్యులందరూ క్వారంటైన్‌లోకి పోయి జాగ్రత్తగా మందులు తీసుకోవాలి. ఎన్నో జాగ్రత్తలు చెబుతున్నాడు. అస్సలు కోవిడ్ సెంటరులో పడెయ్యమని సలహా కూడా యిచ్చాడు.

నాలుగు రోజుల్లో భుజంగరావుకు జ్వరం తగ్గిపోయింది.
కానీ చుట్టు పక్కల వారు ఆయన్ను చూసి యింకా భయపడుతూనే ఉన్నారు. ఆయన బయటకొచ్చినా రావద్దని సలహా యిస్తున్నారు. ప్రొద్దున్నే పాల ప్యాకెట్టుల కోసం పోయినా, పోవద్దని చెబుతున్నారు.
పరంధామయ్య గారు కూడా వచ్చినా ఓ మూడు గజాల దూరంలో ఉండి మాస్కు తియ్యకుండా మాట్లాడుతున్నారు భుజంగం గారితో.

ఆయనకు జ్వరం తగ్గినా నీరసం తగ్గడం లేదు.
పార్వతి రకరకాల టానిక్కులు కొని తెచ్చింది.
మానసికంగా ధైర్యంగా ఉండమని చెప్పింది, అదే సగం బలం అన్నది.
మెడికల్ టీము వచ్చి ఆ వాడలో కరోనా పరీక్షలు నిర్వహించింది.
కొంతమందికి పాజిటివు అని తేలింది. ఇంకేముంది ఆ ప్రాంతంలో రాకపోకల పైన ఆంక్షలు విధించారు. ఉదయం ఒంటిగంట కల్లా అన్ని షాపులు బంద్ చేయిస్తున్నారు. మాస్కులు లేకుండా తిరిగితే జరిమానా విధిస్తున్నారు.
విషాదం ఏమంటే పరంధామయ్యగారికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఆయనకు లక్షణాలు బయటకు కనపడటం లేదు. చూడ్డానికి బాగానే ఉన్నారు. హోమ్ క్వారంటైన్‌లో ఉండమని డాక్టర్లు సలహా యిచ్చారు. ఆయనింట్లో ఆయన, ఆయన కొడుకు రఘురామ్, కోడలు సుచరిత, పిల్లలు సుజాత, పుష్పలత ఉంటారు. పిల్లలకు బహు జాగ్రత్తలు పాటించాల్సి వచ్చింది. వారి వయసు తొమ్మిది, పది. రఘురామ్ మనిషి మెతక. కోడలు సుచరిత గడసరి. ఒక పాతగదికి పరంధామయ్యను పరిమితం చేసింది. వరండాలో నుండి ఆ గది లోపలికి వెళ్ళచ్చు. బయట టాయిలెటు కమ్ బాత్‌రూమును ఆయనకు యిచ్చింది. ఇంకెవరినీ వాడద్దని హెచ్చరించింది.
కాఫీలు, టీలు, భోజనం, మందులు అన్నీ వరండాలోని కుర్చీలో పెడుతుంది. ఒక గంట వాయించి తీసుకో మంటుంది. ఆమె ఏ వేళకు అవి యిస్తే అప్పుడు తీసుకోవాలి.
ఇంక చుట్టుపక్కలకు తమ కుటుంబసభ్యులను రానివ్వదు. భుజంగరావు మటుకు పరంధామయ్యను బయటనుండి దూరంగా ఉండి పలకరించసాగారు.
"మీరెందుకు మా యింటికి వస్తారు. ఆ జబ్బు మీకు అంటుకుంటుంది. జాగ్రత్త, మేమే బిక్కు బిక్కుమంటూ బ్రతుకు తున్నాము" సుచరిత ఒకసారి హెచ్చరించింది.

పార్వతికి ఆరు యిళ్ళ అవతల కాంతమ్మ ఉంటుంది. ఆమెకు భర్త, పిల్లలు ఉన్నారు. పిల్లలు వేరే ఊళ్ళల్లో ఉద్యోగాలు వెలగబెడుతున్నారు. దురదృష్టం కొద్దీ కాంతమ్మకు ఆమె భర్త రంగయ్యకు కరోనా జబ్బు అంటుకుంది. పాజిటివ్ రాగానే భయపడిపోయారు.
డాక్టర్లు భయపడవద్దని చెప్పి మందులిచ్చారు.
నాలుగు రోజులుగా తలుపులు వేసుకుని వాడుతున్నారు.
ఈ రోజు పార్వతి చెవికి పిడుగులాంటి వార్త వినపడింది.
కాంతమ్మ, రంగయ్యలు యిద్దరూ ఉరేసుకుని చనిపోయారు.
అది పెద్ద సంచలన వార్త అయిపోయింది.

ఇరుగు పొరుగు చెప్పగా అంబులెన్సు వచ్చి వారి దేహాలను తీసుకు పోయింది. హాస్పిటలులో చేయవలసినందతా చేసి మరునాడు బాడీలను బాగా కరోనా ప్రూఫ్‌డ్రస్ చేసి యింటికి తెచ్చారు.
వరండాలో దించి వెళ్ళిపోయారు.
వారి పిల్లలకు ఈ వార్త తెలిసినా యింకా రాలేదు.
వీధి వీధి గగ్గోలుగా ఉంది. ఆ శవాలనుండి ఎక్కడ తమకు అంటుకుంటుందోనని ప్రజలు భయపడసాగారు. చివరికి విషయం పోలీసుల దృష్టికి కూడా వెళ్ళింది.

కాంతమ్మ, రంగయ్య బాడీలను వాళ్ళు మునిసిపలు వ్యాన్‌లో తీసుకుపోయి ఊరికి దూరంగా వున్న శ్మశానంలో ఒక పెద్ద గుంత తీసి ఖననం చేయించారు. గుంతలోకి బాడీలను విసిరి వేసి చేతులు దులుపుకున్నారు.
పాపం వారికి జరుగవలసిన కర్మకాండ జరుగలేదు.
వారి పిల్లలు ఆ యింటికి రావడానికి భయపడుతున్నారట, ఆ యింటికి వస్తే తమకు కూడా కరోనా వస్తుందేమోనని. కరోనా జబ్బు మనుషులలోని మానవత్వాన్ని దూరం చేస్తున్నది.

పార్వతి భర్త కష్టపడి ఆ బండి ఈ బండి పట్టుకుని ఊరు చేరుకున్నాడు. "కొన్ని దినాలు ఈ పరిసరాలనుండి పారిపోతే బాగుంటుంది. పల్లెలకు యింకా ఈ జబ్బు అంటలేదు. కారు మాట్లాడుకుని మన బాబాయి ఉంటున్న పల్లెకు వెళదాము. కొన్ని రోజులు అక్కడ ఉండి, తగ్గింతర్వాత వద్దాము." హరనాధ్ వ్యక్తపరిచాడు.
"ఎన్ని రోజులని పరాయింట్లో ఉండగలము?" పార్వతి ప్రశ్న.
"మరి బంధువులన్న తర్వాత ఆదుకోవాలి కదా! ఆయనతో సెల్లులో మాట్లాడి పర్మిషన్ తీసుకుంటాను." అంటూ సెల్లు చేశాడు.
అక్కడనుండి వచ్చిన జవాబు ఆశ్చర్యకరంగానూ, బాధాకరంగానూ ఉంది.
ఆ వూరి ప్రజలు యింకెవరూ పట్టణం నుండి తమ వూరికి రాకుండా రోడ్డును తాత్కాలికంగా మూసి వేశారట. జాతీయ రహదారి మీద గోడలాగా కట్టి వేశారట. అంతే కాదు ఎవరైనా నడిచి వస్తారేమోనని, దొంగతనంగా వస్తారేమోనని ఆ వూరి యువత అక్కడ రాత్రింబగళ్ళు కాపలా కాస్తూ ఉన్నారట. దానితో ఆ వూరికి పట్టణానికి, యితర గ్రామాలకు రాకపోకలు బందు అయిపోయాయట. కరోనాను బహిష్కరించారుట. వారి బహిష్కరణతో కొంతమంది ప్రజలు తీవ్ర యిబ్బంది పడుతున్నారట. ఎవరైనా వారి ఊరి వాళ్ళే వేరే చోటనుండి వస్తే వారిని ఏ దేవాలయంలోనో, సత్రంలోనో ఉంచి కాపలా కాస్తున్నారట కరోనా లేదని తెలిసేవరకు. అది కూడా ఒక రకమైన జబ్బని దానికి కూడా మందులు దొరుకుతాయని వారికి నచ్చచెప్పడానికి వచ్చిన వైద్యబృందానికి శృంగభంగమయింది.

"అంటే మనందరం కరోనా వ్యాక్సిన్ వచ్చేదాకా కరోనాతో సహజీవనం చేయాలి. ఎవరి జాగ్రత్తలో వాళ్ళు ఉంటూ" చెప్పాడు హరనాథ్.
"ఏమండీ, కొందరు హోమియో మందు ఆర్సనిక్ ఆల్బు 30 యిస్తున్నారు రాకుండా వేసుకోమని. పంచదార మాత్రలే కదాని తెచ్చి మనింట్లో అందరికి వేశాను" పార్వతి చెప్పింది.
"మంచిదేగా! కొందరు నోషలు మీడియాలో ఆయుర్వేద కషాయాలు వాడమని చెబుతున్నారు. నీకు చూపిస్తాను. ఆ మూలికలు తెచ్చి రోజు కషాయం వాడదాము" హరనాథ్ సెల్లు ఫోను చూస్తూ చెప్పాడు.
"అది కాదమ్మాయి! రెండు గంటలకొకసారి కాసిని వేడినీళ్లు తాగితే ఆ వైరస్ చచ్చిపోతుందిట. అలా చేద్దాం. సులభమయిన ఉపాయం" భుజంగరావు చెప్పారు.
"నాన్నా! పూజలు చేస్తే కూడా ఆ జబ్బు రాదుట గదా!" అనిత చెప్పింది.
"అవును అప్పట్లో మశూచి అటలమ్మ లాంటి జబ్బులు వస్తే పూజలు చేసేవారు మా చిన్నప్పుడు." భుజంగరావు గుర్తు చేసుకున్నాడు.
"నిజమే నాన్న! ఆ దేవుడి అనుగ్రహం వుంటే ఎటువంటి జబ్బు రాదు. కనుక భక్తితో పూజలు చేస్తే ఎప్పటికైనా మంచిదే!" పార్వతి చెప్పింది.
"అదేసే ఆ భక్తి మనలో ఉండాలిగా! ఆ భగవంతుడి పైన గాఢనమ్మకం మనకు ఉండాలిగా! గాల్లో దీపం పెట్టి దేవుడా నీవే దిక్కు అంటే దేవుడు మటుకు దీపం ఆరకుండా అడ్డుకుంటాడా! దేనికైనా మానవ ప్రయత్నం ముఖ్యం. మాస్కు ధరించడం, దూరం పాటించడం, తరచుగా చేతులు శుభ్రపరచుకోవడం లాంటివి చెయ్యాలి." హరనాథ్ చెప్పాడు.
"ముందు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటే ఏ జబ్బు రాదు. హరనాథ్! నువ్వు వర్రీ కావద్దు. ప్రభుత్వం చెప్పే జాగ్రత్తలు పాటిస్తే మంచే జరుగుతుంది. గాడ్ ఈజ్ గ్రేట్! ఆందోళన చెందవద్దు" ధైర్యం చెప్పారు.
"నాన్న చెప్పినట్లు ఏమీ జరగదు మన జాగ్రత్తలో మనం ఉంటే, ఎక్కువ ఆలోచించి బుర్ర పాడు చేసుకోవద్దు. కొన్ని నెలల్లో ఈ మహమ్మారికి మంచి మందులు వస్తాయి. టీకాలు వస్తాయి. ఆందోళన చెందవద్దు" పార్వతి చెప్పింది.

హరనాథ్‌కు హనుమాన్ సేవాదళ్ సభ్యులనుండి కబురు వచ్చింది. అది ఒక వాలంటరీ ఆర్గనైజేషన్. సామాజిక కార్యక్రమాలు చేస్తూ ఉంటుంది. దానిలో చాలామంది వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు మొదలైనవారు సభ్యులుగా ఉన్నారు. సమాజానికి ఆపదలు వచ్చినప్పుడు మేమున్నామని ముందుకు వస్తూ ఉంటారు.
ఆ వూరికి కొన్ని వందలమంది కార్మికులు ఎన్నో వందల కిలోమీటర్ల దూరం నుండి నడుచుకుంటూ వచ్చారుట. వారికి పెద్ద సిటీలో ఉద్యోగాలు పోయాయి. ఉపాధి కోల్పోయిన కూలీలు, కార్మికులు

మూటాముల్లె సర్దుకుని వాహనాలు తిరగక పోవడం వలన నడుచుకుంటూ వచ్చారు. యింకా చాలా దూరం పయనించవలసి ఉంది, వారి స్వగ్రామాలకు వెళ్ళడానికి. వారిలో చాలా మందికి తెలుగు రాదు.  వారికి తిండి తిప్పలు లేవు. నిర్విరామంగా నడుస్తూ అలసిపోయినప్పుడు ఏ రోడ్డు ప్రక్కనో, చెట్టుకిందో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎవరైనా దాతలు దయతలచి యింత పెడితే తింటున్నారు. కుటుంబాలు కుటుంబాలు వీధిలో పడి నడుచుకుంటూ పట్టణాలు వదిలి పల్లెబాట పట్టారు. చిన్నపిల్లలు సైతం నడుస్తున్నారు. మరీ చంటి వాళ్ళనయితే పెద్దలు భుజాన వేసుకుని పోతున్నారు.

అంత మండు టెండలో అంత శ్రమకోర్చి నడుచుకుంటూ పోతూ వచ్చిన వారిని చూస్తే ఎవరికైనా హృదయం ద్రవిస్తుంది.

హనుమాన్ సేవాదళ్ సభ్యులు చందాలు వసూలు చేసి వలస బాట పట్టిన కార్మికులు, కూలీలకు అన్నం పొట్లాలు, మంచినీళ్ళు, మందులు అందిస్తున్నారు. శిబిరాలు ఏర్పాటు చేసి వారికి సేద తీరుస్తున్నది. ఆ వలస కారుల మొహాలలో కాస్త దరహాసాలు వచ్చేట్లు చేస్తున్నది ఆ చారిటబుల్ సంస్థ.

గర్భిణీస్త్రీలను, బాలింతలను, చిన్న పిల్లలున్న వారిని కొన్ని వాహనాలు మాట్లాడి వారి గమ్య స్థానాలకు పంపించారు. అందుకు పోలీసుల సహకారం కూడా చాలా తోడయింది.

దేశప్రగతి కుంటుపడిపోయింది. ఆర్థిక వ్యవస్థ దిగజారి పోయింది. హరనాధ్ వారిని వీడియో తీసి పార్వతికి చూపించాడు. ఆమె గుండె బరువెక్కింది. తమవంతు సాయంగా కొంత డబ్బులు, బియ్యం, దుస్తులు యిచ్చారు.

ఆ వీధిలోనే డాక్టరు మదన్ ఉన్నాడు. అతనికి భార్య, యిద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. అతడికి డ్యూటీ కోవిడ్ సెంటర్‌లో పడిరది. అతను ప్రత్యేకంగా లాడ్జీలో రూము తీసుకొని ఉంటున్నాడు. పన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఆ మహమ్మారి యింట్లోని చిన్నపిల్లలకు వస్తుందేమోనని భయం. ఇంటిల్లిపాది డాక్టర్ మదన్ యింటికి ఎప్పుడొస్తాడాని ఎదురు చూస్తూ వుంటారు.

ఆరోజు హరనాధ్ ఒక వార్త పార్వతి చెవిన వేశాడు. ఆ వీధి చివర కాపురం ఉంటున్న కానిస్టేబులు కనకారావు కరోనాతో మరణించాడట. అతను కోవిడ్ డ్యూటీలో ఉన్నాడు. దురదృష్టవశాత్తు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది అతనికి సోకింది. పెద్ద వయసు కూడా లేదు. నలభైల్లో ఉన్నాడు. కోవిడ్ సెంటర్లో కోలుకోలేక నిన్న మరణించాడట. ప్రభుత్వం అంత్యక్రియలు చేసేసింది.

హరనాధ్ వారిస్తున్నా పార్వతి కనకారావు భార్య మమతను పలకరించడానికి వచ్చింది. ఇద్దరూ తరచూ షాపుల్లో కలుసుకుంటూ ఉంటారు. వారి పిల్లలు ఈ పార్వతి పనిచేసే స్కూలులో చదువుతున్నారు.

"మమత! వెరీ సారీ! నీ దుఃఖం ఎవరూ పోగొట్ట లేరు. పిల్లల్ని చూసి ధైర్యంగా బ్రతుకు. ఆయన నీపైన పెద్ద బాధ్యతలు పెట్టిపోయారు. ఊరుకో" ఓదార్చింది.

మమత వెక్కిళ్ళు పెడుతూ ఏడ్చింది చాలాసేపు.

“ఆయన బదులు నేను పోయినా బాగుండేది. ఈ పిల్లలను ఎలా పెంచాలి?”

“దిగులు పడకు, ప్రభుత్వం విధినిర్వహణలో కోవిడ్ బారిన పడి మరణించిన వారికి భారీగా నష్టపరిహారం ప్రకటిస్తున్నది. దానితో నువ్వు బ్రతుకుతూ, పిల్లలను ప్రయోజకులను చెయ్యి.” అంటూ చాలా సేపు ఓదార్చి వచ్చింది.

“కరోనా అన్నది ఒక శత్రువు. ఎటునుంచి ఎలా దాడి చేస్తుందో తెలియదు. అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఏ పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసం, ధైర్యం కోల్పోరాదు” భుజంగరావు పార్వతిని, హరనాధ్‌ను పిల్లలను కూర్చోబెట్టుకుని బోధించారు.

***0***

# ఉరి

పరిమళా సోమేశ్వర్



గణగణ మంటూ చర్చి బెల్లు పన్నెండు గంటలు కొట్టింది. ఆ ధ్వని తరంగాలు చీకటిని చీల్చుకుంటూ చెట్లమీదుగా ఇళ్లకప్పుల మీదుగా ప్రయాణం చేస్తూ, రంగయ్య గుడిసెలోకి దూరి, అతని చెవులగుండా పోయి అతని గుండె 'ఝల్లు'మనేటట్టు చేసాయి. ఆ గగుర్పాటుకు అతని రోమాలన్నీ నిక్కబొడుచుకున్నాయి. అతని కాళ్ళూ చేతులూ చల్లగా అయినట్టనిపించింది.

గుడిసె మధ్య వెలుగుతున్న కిరసనాయిలు బుడ్డి వెదజల్లే వెలుగులో అతని కళ్ళు నిప్పు కణికల్లా మెరుస్తున్నాయి. అతని పెదాలు ఎన్ని నెలలుగానో నీటిచుక్క నెరుగక పగిలి బీటలువారిన నల్లరేగడి నేలలోని మట్టిగెడ్డల్లా ఉన్నాయి. అసలే మోటుగా వికృతంగా ఉన్న అతని మొహం భయంతో, అనేక రకాల సందేహాలతో, ఆవేదనతో భయంకరంగా తయారైంది. కిరసనాయిలు బుడ్డీనుంచి వచ్చే మసక వెలుతురు తాలూకు నీడలు అతని ముఖం మీద అటూఇటూ ఊగుతూ, అతని ముఖానికి ఒక వింత ఆకృతినీ, దాని మీద గల భావముద్రకు ఒక విలక్షణమైన అర్థాన్నీ ఇస్తున్నాయి.

గుడిసెలో ఒకమూల ఎండిన గోగుపుల్లలా ఉన్న అతని భార్య రత్తి కాళ్ళు ముడుచుకుని పడుకుంది. అమాయకంగా అలసట తీరేలా నిద్రపోతున్న రత్తి ముఖం చూస్తుంటే రంగయ్య గుండె ద్రవించిపోతుంది. రోజూ తను కూడా అంత నిశ్చలంగా ఆదమరిచి నిద్రపోయేవాడు. కాని సాయంత్రం జైలు వార్డెను చెప్పిన సంగతి విన్న దగ్గర నుంచీ తనకి నిద్రాహారాల మీదనే విరక్తి కలిగింది.

"తెల్లవారుజామున నాలుగుగంటలకంతా పని పూర్తి చేసెయ్యాలి. ఓ గంట ముందుగానే అక్కడ సిద్ధంగా ఉండాలి" అదీ వార్డెన్ ఆజ్ఞ.

ఆ ఆజ్ఞ పిడుగులా అతని గుండెను తాకింది. ఆ మాట విన్న దగ్గరనుండీ రంగయ్య మనసు మనసులో లేదు. రంగయ్య 'సెంట్రల్ జైలు'లో 'హేంగ్ మన్'గా పని చేస్తున్నాడు. అతను ఉద్యోగంలో చేరి పట్టుమని రెండేళ్ళు కూడా పూర్తి కాలేదు. అంతకు ముందు రాళ్ళు మొయ్యడం, ఇళ్ళు కట్టేటప్పుడు ఇటుకలూ, సిమెంటూ అందించడం, పెద్దపెద్ద భవనాలకు సున్నం వెయ్యడం వంటి పనులు చేస్తూ ఉండేవాడు రంగయ్య. భార్య రత్తి అక్కడా ఇక్కడా పాచిపని చేస్తూ ఉండేది.

కాని, రత్తి రోగిష్టిదవడం వల్ల ఏ ఇంట్లోనూ వరసగా నెల రోజులపాటూ నిలకడగా పనిచెయ్య గలిగేది కాదు. చీటికీ మాటికీ నాగాలు పెట్టే రత్తిని ఏ గృహిణీ పనిలో పెట్టుకోవడానికి ఒప్పుకునేది కాదు. ఇటు రంగయ్యకు కూడా రోజూ

తప్పకుండా పని దొరుకుతుందన్న గేరంటీ లేదు. అందుకే నెలలో కనీసం పదిరోజులైనా పస్తులుండేవారు దంపతులు. అలాంటి సమయంలోనే సెంట్రల్ జైలులో 'హేంగ్ మన్' ఉద్యోగానికి ఖాళీ ఉందని తెలిసి, దరఖాస్తు పెట్టుకున్నాడు రంగయ్య.

తీరా ఉద్యోగం దొరికిన తరవాత, తను చెయ్యవలసిన పనేమిటో తెలుసుకొని గజగజలాడిపోయాడు. "ఖూనీలు చేసిన నేరస్థులను ఉరితీయడమే నీ పని" అని అధికారులు చెప్పినప్పుడు కళ్ళు తిరిగి పడిపోయినంత పనైంది.

"పస్తులైనా ఉంటాను కాని, ఇలాటి పాపపుపనులు మాత్రం చెయ్యను" అనుకున్నాడు.

కాని అక్కడ పనిచేసే చప్రాసీలు అతనికి అభయం ఇచ్చేరు. "పేరుకు మాత్రమే నీకీ డ్యూటీ. నిజంగా ఉరి తీయాల్సిన అవసరం నీకెన్నడూ రాదు. ఈ రోజుల్లో చాలావరకూ ఆజన్మాంత ఖైదు విధిస్తున్నారే గాని, ఎంతటి నేరస్తుడికైనా ఉరిశిక్ష అనేది పడడంలేదు." అంటూ ధైర్యం చెప్పేరు.

ఆ మాటలు విన్నాక కాళ్ళ దగ్గరకొచ్చిన ఉద్యోగాన్ని కాదనలేకపోయాడు రంగయ్య. నెలకింత ఖంగుమంటూ జీతంరాళ్ళు జేబులో పడేసే సర్కారు ఉద్యోగాన్ని ఎంత తెలివితక్కువ వాడు మాత్రం వదులు కుంటాడు? పైగా తనకి ఉద్యోగం దొరికిందంటే, రత్తి మూలుగుతూ ముక్కుతూ ఆ ఇంటా ఈ ఇంటా పాచిపని చెయ్యక్కర్లేదు. తను ప్రతీరోజూ సూర్యోదయమవగానే ఏం పని దొరుకుతుందా అని నోరు తెరుచుకొని వేచి ఉండక్కర్లేదు. తన నెలజీతంతో తమ ఇద్దరి కడుపులూ నిండుతాయ్. రత్తికి మందూ మాకూ ఇప్పించి, ఇంటి దగ్గరే విశ్రాంతిగా ఉండేటట్టు చూడవచ్చు.

ఆ ఆశతోనే ఈ ఉద్యోగంలో చేరేడు రంగయ్య. మొదటినెల జీతం అందుకున్న రోజున, తను చేసిన పనిలో పొరపాటేమీ లేదన్న విశ్వాసం ధృవపడింది అతనిలో. రెండేళ్ళు ఏ చీకూచింతా లేకుండా కొద్దిపాటి ఒడిదుడుకులతో సాగిపోయింది రంగయ్య జీవితం. నెలరోజుల క్రితం, ఆ జైలులోకి సత్యం ఖైదీగా వచ్చిన రోజునుండీ రంగయ్య మనసు రెపరెపలాడసాగింది. కారణం...అతనికి ఉరిశిక్ష విధించేరట.

అయితే, అతను మామూలు ఖైదీ కాదు. చాలా ఖరీదైన ఖైదీ. ప్రభుత్వం మూడు సంవత్సరాలనుండీ అతని కోసం గాలిస్తున్నదనీ, అతన్ని సజీవంగా పోలీసులకు అప్పజెప్పినవారికి లక్ష రూపాయల బహుమతి కూడా ప్రకటించిందనీ విని, రంగయ్య ఆశ్చర్యపోయాడు. ప్రభుత్వ ప్రకటన వినిన వారికెవరికైనా, ఆ నేరస్తుడు ఎంత ప్రమాదకరమైన వ్యక్తో, అతని రూపురేఖలు ఎంత భయంకరంగా ఉంటాయోనన్న ఆలోచన రాకపోదు. కాని అలాంటి ఆలోచనలకు విరుద్ధంగా, ఎంతో నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉన్న, చిర్నగవుల ముఖంతో వెలిగిపోయే ఆ పాతికేళ్ళ యువకుడ్ని చూసి, రంగయ్యే కాదు, జైలు అధికారులే ఆశ్చర్యపోయారు.

"అతను పదిమందిని హత్యచేసాట్ట" అన్న వార్త విని రంగయ్య మరింత ఆశ్చర్యపోయాడు.

"అబద్ధం. నేన్నమ్మను" అన్నాడు అప్రయత్నంగా.

"అబద్ధమా? ఏదబద్ధం? అతను పదిమందిని హత్య చేయడమా? లేకపోతే లక్షరూపాయలు ఊరికే ప్రకటించేరా అతని కోసం ఏం పనిలేక ఈ కుర్రాణ్ణి జైల్లో పెట్టేరనుకున్నావా?" అన్నారొకరు.

రంగయ్యకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. కాని ఇంత చురుకైన కళ్ళూ, ఇంత కాంతివంతమైన ముఖంగల ఈ కుర్రాడు హత్యచేసాడంటే ఎలా నమ్మడం! అటూఇటూ చూసి, అతను మెల్లగా చెప్పాడు రంగయ్య చెవిలో "ఈ కుర్రాడి చేతిలో చచ్చిపోయినవారందరూ డబ్బున్న మారాజులేనట" అని.

"డబ్బున్న మారాజులా? వాళ్ళను చంపడం అంత తేలికైన పనేనా" గుండెమీద చెయ్యి వేసుకున్నాడు రంగయ్య.

"కాదు కాబట్టే ఈ కుర్రాణ్ణందరూ గుండెలు తీసిన బంటు అంటున్నారు."

"పాపం వాళ్ళీ అబ్బాయికి ఏమి అన్యాయం చేసారో ఏమో?"

"ఇతనికి వాళ్ళేమీ అన్యాయం చెయ్యలేదట, వాళ్ళ ముఖాలితనికి తెలిసినదీ లేదట. ఇతని పేరు వాళ్ళకు తెలియదు. వాళ్ళ సంగతి ఈయనకు తెలియదు.  అయినా చంపేసాట్ట."

"ఏందుకో?"

"అదంతా ఒక పెద్ద కథలే. ఈయనకో పెద్ద గేంగు ఉందట.  వాళ్ళ పని పగలల్లా నరమానవుడి కంటబడకుండా బతకడం, రాత్రయ్యేసరికి రోజుకో ఊరిమీద పడి, ఊరి పెత్తందార్లందరినీ సఫా చెయ్యడమూనట.  గమ్మత్తేంటంటే, వీళ్ళు డబ్బున్నవాళ్ళని చంపుతారే తప్ప, పేదోళ్ళ జోలికి చచ్చినా పోరట."

ఆ విషయాలు విన్న పది పదిహేను రోజులదాకా,  రంగయ్యకి మనసు మనసులో లేదు. సత్యం మొఖం చూసి, అతను హంతకుడన్న విషయం విన్నాక, ఎంత ఆశ్చర్యపోయాడో అతను చేసిన హత్యల ఉదంతం విన్నాక అంతకు రెట్టింపు ఆశ్చర్యపోయాడు.

"అతను పేదోళ్ళ జోలికి చచ్చినా పోడట!!"

పేదోళ్ళను చూసి జాలిపడేదెవ్వరు ఈ రోజుల్లో? పేదవాళ్ళను చూస్తేనే పెద్దవాళ్ళందరికీ అసహ్యం, కోపం. పేదరికం మహా పాపం అయినట్టూ, పేదరికాన్ని అనుభవించే ప్రజలంతా పాపాత్ములైనట్టూ భావించి, గొప్పింటి వాళ్ళంతా తమకు దూరంగా ఉంటారు.  కుక్కలూ, పిల్లులూ, నల్లులూ, బల్లులూ మొదలైన జంతుజాలం వలే పేదలను కూడా ప్రాణికోటిలోని ఒక భాగంగా భావిస్తారే తప్ప, వాళ్ళూ తమలాంటి మనుషులేనన్న సమదృష్టితో, గౌరవభావంతో ఎవరూ చూడరు.  అవసరమైతే గుర్రాన్ని బండి తోలడానికీ, ఎడ్లను పొలం దున్నడానికీ, కుక్కలను ఇంటికి కాపలా ఉంచడానికీ, పిల్లుల్ని ఎలకల్ని చంపడానికి పెంచుకున్నట్టు, పేదలను కూడా, రిక్షాలు లాగడానికీ, ఇళ్ళు కట్టించుకోవడానికీ, పాయిఖానాలు కడగడానికీ, చెప్పులు కుట్టించుకోవడానికీ, శవాల్ని తగలబెట్టడానికీ, ఇలా రకరకాలుగా ఉపయోగించుకుంటారు డబ్బున్న మహారాజులు. అలా తమ పనులకోసం తోటి మనుషులను ఉపయోగించుకునే గొప్పవాళ్ళకు వాళ్ల మీద దయాదాక్షిణ్యాలుండవు సరికదా, సక్రమంగా పని చేయించుకోదలచినప్పుడు జంతువులను అదిలించినట్టు వీళ్ళను అదిలించడం, తిట్టడం, కొట్టడం, ఇంకా తిక్కరేగితే చంపెయ్యడం కూడా కద్దు.

ఇదంతా చూసి డబ్బున్న వాళ్ళు పేదవాళ్ళను ద్వేషించడం వాళ్ళ సహజలక్షణం అన్న అభిప్రాయాన్ని చిన్నతనంలోనే ఏర్పరచుకున్నాడు రంగయ్య.  అందుకే భాగ్యవంతుల చేతుల్లో నానా రకాలుగా హింసించబడే

తనలాంటి పేదవాళ్ళు అతని కంటికి వింతగా కనబడేవాళ్ళు కారు. అంతేకాదు, పట్టపగలు పదిమంది చూస్తుండగా నడిరోడ్డు మీద హత్యచేసిన భాగ్యవంతులెంతోమంది జైలు గడప తొక్కకుండా, కోర్టు ఛాయలకు పోకుండా, నిశ్చింతగా, కులాసాగా బతకడం తను కళ్ళారా చూసేడు కూడా. కాని పాపం, ఈ కుర్రాడు గొప్పవాళ్ళను చంపినందుకు జైలులో పడ్డాడు. రేపో, మాపో ఉరి తీయబడతాడు కూడా. అందుకే అన్నారు భాగ్యవంతుల ప్రాణాలతో ఆడడం నిప్పుతో చెలగాటమాడడం వంటిదని.

రంగయ్య వీలు చిక్కినప్పుడల్లా సత్యంతో మాట కలపడానికి ప్రయత్నించేవాడు. సాధారణంగా సత్యం ఎవరితోనూ మాట్లాడేవాడు కాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ, అటూఇటూ పచార్లు చేస్తూ ఉండేవాడు. కాని అతను మాట్లాడడం మొదలు బెట్టాడంటే, ఆ వాగ్ధాటికి అడ్డుండేది కాదు. ఆవేశంగా అతను మాట్లాడుతుంటే, ఉజ్జ్వలంగా ప్రకాశించే అతని కళ్ళవంక రెప్పవాల్చకుండా చూసేవాడు రంగయ్య.
“మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతిక సంవత్సరాలు దాటుతున్నాయి గాని, బానిసత్వం నుండి బయట పడినందుకు దక్కిన ఫలితాలేంటి? ధనవంతులు మరీ ధనవంతులవుతున్నారు. పేదవాళ్ళ స్థితి మరింత దిగజారిపోతోంది. లక్షాధికారులు కోట్లు గడించడానికీ, ఒకపూట తినేవాడు పస్తులుండడానికీ తప్ప, స్వాతంత్ర్యం వల్ల ఒరిగిందేమీ కనబడడం లేదు. దేశంలో ఇంతటి అవినీతీ, దారిద్ర్యం ఒకపక్కనా, సిరిసంపదలూ విలాసాలూ మరోపక్కనా పెచ్చుపెరిగిపోతూ ఉండగా, దేశంలో ఆహారధాన్యాల కొరత ఎలా ఏర్పడుతోంది? దేశం పారిశ్రామికంగా ఇంతటి అభివృద్ధిని పొందుతున్నా, విద్యా వైద్యానిక రంగాలలో ఎంత ముందడుగు వేసినా, దేశంలో నిరుద్యోగసమస్య ఇంతటి తీవ్రరూపం దాల్చడానికి కారకులెవ్వరు? ఈ అనర్థాలన్నిటికీ కారణం ఒక్కటే. దేశసంపద నంతటినీ కొంతమంది స్వార్థపరులు తమ గుప్పెట్లో పెట్టుకొని, మిగిలిన కోట్లాదిమంది ప్రజలనూ నానాగడ్డీ కరిపిస్తున్నారు. ధరలు పెరిగినా, నిరుద్యోగసమస్య రోజుకు పదింతలైనా, ఆకలిచావులు వందలనుంచి, వేలసంఖ్యలోకి మారినా, ఈ కొద్దిమంది మారాజులకు చీమ కుట్టినట్టైనా ఉండదు. పైగా ప్రజలను పీడించడానికీ, దోచుకోవడానికీ వీరికి మరింత అనువుగా ఉంటుంది. అందుకే, పరిస్థితులు ఎంతగా విషమిస్తే, వారికి అంత లాభదాయకం. ఇలాంటి చీడపురుగులను నాశనం చేస్తేగాని దేశం బాగుపడదు. పుస్తకంలోని ఒక పేజీకి చెదలు పడితే, ఆ పేజీని చింపి, మిగతా పేజీలకు అవి పాకకుండ చూడాలి. అలాగే ఒక చిన్నభాగం అవినీతిలో, స్వార్థపరత్వంతో కుళ్ళిపోతుంటే, మిగతా సమాజం యొక్క శ్రేయస్సు దృష్ట్యా ఆ కొద్దిభాగాన్నీ నిర్మూలించక తప్పదు” అనేవాడు సత్యం.
అలా వ్యక్తులిని చంపడం వల్ల అతను కోరుకున్న సమసమాజ స్థాపన జరగదని అతనికి తట్టకపోవడం చిత్రం. చెదపట్టిన కాగితాన్ని చింపేస్తే... దక్కొచ్చు. వ్యక్తుల్ని ఏరిపారేసినంత మాత్రాన సామాజిక విప్లవం జరుగుతుందా? ఆలోచించాడు రంగయ్య. సత్యం మాటల్లోని నిజాయితీని మెచ్చుకున్నా అతని మాటలు వింటుంటే రంగయ్యకెందుకో విచారంగా ఉండేది. రంగయ్య అక్షరజ్ఞానం లేనివాడేం కాదు. కాస్తోకూస్తో చదవడం, రాయడం వచ్చు. పైగా తన చుట్టూ ఉన్న పరిస్థితులనూ, సమాజాన్నీ అర్థంచేసుకోగల తెలివితేటలూ ఊహ కొంతవరకూ అతనిలో లేకపోలేదు.

“భాగ్యవంతులు పేదోళ్ళను ప్రేమించడంలేదని ఇన్నాళ్ళూ మొత్తుకున్నాం. ఇప్పుడు పేదవాళ్ళు కూడా ధనవంతుల్ని ద్వేషించడం వల్ల సమస్యలు తీరిపోతాయా?” అన్నాడు రంగయ్య దిగులుగా.

“సమాజంలో హెచ్చుతగ్గులున్నంత కాలం ఈ వర్గద్వేషం, రక్తపాతం తప్పవు. అందుకే వర్గరహితమైన సమాజాన్ని నెలకొల్పడానికి మేమంతా ప్రయత్నం చేస్తాం. అవసరమైతే రక్తాన్ని బలిగొనడానికి రక్తాన్ని త్యాగం చెయ్యడానికి కూడా సిద్ధపడ్డాం.” అన్నాడు సత్యం.

రంగయ్యకి అతని మాటలు సగం అర్ధమయ్యేవి. సగం అర్ధమయ్యేవి కావు. అతనికి బాగా తెలిసిందల్లా ఒకటే విషయం. “ఈ సత్యం హత్యలు చేస్తే చేసుండొచ్చు. కాని ఏం చేసినా ఇతను స్వార్ధం, స్వప్రయోజనం కోసం చేసుండ లేదు. సమాజం కోసం చేసాడు. దేశం కోసం చేసాడు. అందుచేత అతనింతటి కఠినశిక్షకు అర్హుడు కాడు. అతను చేసింది తప్పే కావచ్చు. కాని అతని ఆశయంలో కల్మశం లేదు. అలాంటి వాడికి ఉరిశిక్ష ఎందుకు వెయ్యాలి? ఎయిర్ కండిషన్డ్ గదుల్లో, యూఫోం బెడ్లమీద పడుకొని, తమ స్వార్ధం కోసం కాలు కదల్చకుండా కనుసైగ తోనే ఎన్నో మారణహోమాలనూ, హింసాకాండలనూ జరిపించే అహింసావాదుల కంటే సత్యం ఎన్నోరెట్లు మెరుగు” అనుకునేవాడు రంగయ్య.

సత్యం జైలుకు వచ్చిన దగ్గర నుంచీ ఎంతోమంది అతన్ని చూడడానికి వచ్చేవారు. ఆ వచ్చిన వాళ్ళలో తెలుగులో మాట్లాడేవారు కొందరు; హిందీ మాట్లాడేవాళ్ళు కొందరు; ఇంగ్లీషులో మాట్లాడేవాళ్ళు కొందరు. ఏ భాషలోనైనా అనర్గళంగా, అనాయాసంగా మాట్లాడే సత్యంని చూసి చకితుడయ్యేవాడు రంగయ్య. వాళ్ళందరూ సత్యంతో ఏదో వాదించేవారు. నచ్చ చెప్పడానికి ప్రయత్నించేవారు. అదేమిటో కొద్దిరోజుల తరవాతగాని తెలియలేదు రంగయ్యకి. అతనికి ఉరిశిక్ష తప్పించేందుకుగాను సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకోమని వాళ్ళు ప్రాధేయపడితే అతను ఒప్పుకునేవాడు కాడు. చివరికి అతని తరుఫున ఒకతను సుప్రీం కోర్టుకు అప్పీలు చేస్తే, అతని అభ్యర్ధనను తిరస్కరించింది కోర్టు. సత్యంకి ఉరిశిక్ష ఖాయమైంది.

అది విని రంగయ్య గుండెలు గుభేలు మన్నాయి. అలా అవడానికి సత్యంకు చావు దాపురించడం ఒకటే కాదు, ఆ చావు తన చేతుల మీదుగా జరగవలిసి ఉండడం కూడా ఒక కారణమే. సత్యంకి ఉరిశిక్ష ఖాయమని తేలిన తరవాత అతన్ని చూడడానికి ఎవరుబడితే వారు రాకూడదని నిషేధించారు.

సత్యంని కొద్దిరోజుల్లో ఉరి తీయబోతున్నారని తెలిసి చాలామంది ఏడ్చేరు. అందులో ఒకడు అక్కడే ఉన్న రంగయ్యనూ, నలుగురైదుగురు చప్రాసీలనూ చూసి, “సత్యం ఎందుకు చనిపోతున్నాడో తెలుసా? నీ కోసం...మీలాంటి వాళ్ళకోసం...” అన్నాడు. అందరూ ఆ మాటలువిని ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. అందరి మనసులూ కలుక్కుమన్నాయి.

సత్యం మాత్రం తనను మృత్యువు సమీపిస్తున్నందున విచారిస్తున్న ఛాయలనేమీ కనపరచలేదు. పైగా సంతోషపడుతున్నట్టు కూడా కనిపించాడు. కారణం అతడే చెప్పేడొకసారి: “ఈ స్థితిలో నేను బతికి ఉన్నందువల్ల

ప్రయోజనం ఏమీ లేదు. పైగా చనిపోవటం వల్ల కొన్ని లాభాలు కూడా ఉన్నాయి. నా మరణవార్త విని కనీసం కొద్దిమంది ప్రజలలోనైనా చైతన్యం వస్తే అంతే చాలు." అన్నాడు.

రోజులు గడుస్తున్నాయి. సత్యంను ఉరితీసే సమయం ఆసన్నమౌతున్న కొద్దీ రంగయ్య మనసు నీరసించసాగింది. శరీరం కంపింపసాగింది. ఏ క్షణంలోనైనా, ఏ కారణంచేతనైనా ఈ ఉరి తప్పిపోతే బాగున్నని కోరుకొనేవాడు. అలా రంగయ్య కలవరపడుతున్నాడే తప్ప, సత్యం మాత్రం నిశ్చింతగానే కనపడేవాడు. మృత్యువు ఆగమనం కోసం వేచి ఉన్నట్టు అతని కళ్ళు అనిమిషంగా తీక్షణంగా చూస్తుండేవి.

ఇక మూడురోజుల్లో అతన్ని ఉరి తీస్తారనగా, సత్యం మాట్లాడడం పూర్తిగా మానివేసాడు. భోజనం చేసేవాడు కాదు. ఎటో దూరంగా...అతి దూరంగా, సాధారణ నేత్రాల చూపుకందని ప్రదేశాలలోనికి ఎక్కడికో చూస్తుండేవాడు. అతని ఈ భంగిమ చూసి, రంగయ్య నరాలు మరింత బిగుసుకు పోయేవి. ఒకప్పుడు అగ్నిజ్వాలలు చిమ్మి, ఇప్పుడు మరీ హిమాచలం వలే ఘనీభవించుకుపోయిన ఈ వ్యక్తిని తన చేతులతో ఎలా చంపడం?.
రంగయ్య అవస్థ చూసి రంగి గుబులు పడింది. వెంటనే ఆమె ధైర్య తెచ్చుకొని, భర్తకు ధైర్యం చెప్పింది. "నీ డ్యూటీ నువ్వు చేస్తున్నావు. అతన్ని చంపాలన్న కోరిక నీకు లేదు. అయినా చంపడానికి మనమెవరం? చంపేవాడూ చంపించేవాడూ ఆ భగవంతుడే" అన్న ధోరణిలో మాట్లాడేది కాని ఆ మెట్టవేదాంతం రంగయ్య మనసును సమాధానపరచేది కాదు. అసలే ఒక నిండు ప్రాణాన్ని బలిగొనవలసి వస్తోందే అన్న చింత. దానికి తగ్గట్టు సత్యంవంటి నవయువకుడు, ఉత్సాహవంతుడు, ధైర్యశీలి, ఆదర్శశీలీ అయిన మనిషిని ఉరి తీయవలసి వస్తోందన్న బెంగ.

చివరికి ఆఖరురోజు రానే వచ్చింది.
"నీకిష్టమైన బట్టలు, ఇష్టమైన తిండీ...ఏం కావాలి చెప్పు. తెచ్చిస్తాం." అన్నారు జైలు అధికారులు.
దానికి సత్యం నవ్వి, "దేశంలో కోట్లాదిమంది ప్రజలు కడుపు నిండా తిండి లేక, వంటి నిండా బట్టలేక దిక్కుమాలిన బతుకు బతుకుతున్నారు. వారి కష్టాలు తీరే మార్గాలేమిటో చూడండి. రేపీపాటికి ఈ లోకాన్ని వీడిపోయే నా తిండీ, బట్టను గురించి మీకెందుకంత ఆలోచన?" అన్నాడు. అతని మాటలు వింటుంటే, అందరి కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినాయి. ఆ సమయంలో కూడా అంత స్వచ్ఛంగా నవ్వగలిగిన అతనిని చూసి ముగ్ధులయ్యేరు.
అక్కడున్న వాళ్ళలో కాస్త తలనెరిసిన ఉద్యోగి ఉరిశిక్ష విధింపబడిన వారి ప్రవర్తనను గురించి తన అనుభవాలను కొన్నింటిని చెప్పసాగాడు. "ఎంతటి ఉద్దండులైనా, గుండెలు తీసిన బంటులైనా, ఎన్ని ఖూనీలు చేసినవారైనా, తమకు ఉరిశిక్ష ఖాయమని తెలిసేక, డీలా పడిపోయేవారు. ఉరితీసే రోజు దగ్గర పడుతున్న కొద్దీ వారి శరీరంలో, మానసికావస్థలో ఎన్నో విపరీతమైన మార్పులు కనబడేవి. కొందరు ఆలోచనను భరించలేక పిచ్చివాళ్ళయేవారు. కొందరు వెక్కివెక్కి ఏడ్చేవారు. కొందరా వార్త వింటూనే మూర్ఛపోయేవారు. గుండె ఆగిపోయిన కేసులు కూడా

ఒకట్రెండు లేకపోలేదు. ఏమైనా తనకు చావు ఖాయమనీ, అందునా తన చావు బలవంతాన సంభవిస్తున్నదనీ తెలుసుకున్న ఏ మనిషీ సహజంగా ఉండలేడు. ఆ పరిస్థితి నుండి ఎలాగైనా తప్పించుకుపోదామని ప్రయత్నిస్తాడు. లేదా ఆత్మహత్యకైనా పాల్పడతాడు." ఆ కథలన్నీ వింటుంటే రంగయ్యకి పై ప్రాణాలు పోతున్నట్టుండేది.
"నీ వాళ్ళెవరైనా ఉన్నారా? ఎవరినైనా చూస్తావా?" అన్న ప్రశ్నకు "ఈ దేశ ప్రజలందరూ నావాళ్ళే. పుట్టిన క్షణంనుండీ పాతికేళ్ళుగా వీరి దురవస్తను చూస్తూనే ఉన్నాను. వాళ్ళ కోసం ఏమీ చెయ్యకుండానే, వారి దుస్థితి రూపుమాపకుండానే చనిపోతున్నందుకు నాకు సిగ్గుగా ఉంది. ఈ అవమానాన్ని నేను భరించలేను. నన్ను వెంటనే ఉరితీయండి. నన్ను చంపండి" అన్నాడు.

ఆ సాయంత్రం వార్డెన్ రంగయ్యను పిలిచి తాడూ, ముసుగూ, బల్లా మొదలైన సరంజామానంతటినీ సిద్ధం చేయమని చెప్పేడు.
"సరిగ్గా తెల్లవారుజామున నాలుగు గంటలకు అతని ప్రాణం పోవాలి" అని హెచ్చరించాడు.
అప్పట్నుండీ రంగయ్యకు భయంతో నాలుక పిడచకట్టుకు పోయింది. రత్తికీ మధ్యనే సుస్థీ చేసింది. అందువల్ల పెందరాలే అన్నం తిని నిద్రపోయింది. కాని రంగయ్య ఆ రాత్రి అన్నం తినలేదు. అతని కంటిమీద కునుకు రావట్లేదు. గుడిసె బయట గాఢాంధకారం. తన మనసులోనున్న చీకటికి బయటనున్న గాఢాంధకారం తోడై అతన్ని భయపెడుతోంది. అందుకే, కిరసనాయిలు బుడ్డిని ఆర్పకుండా, కన్నార్పకుండా కాళ్ళు ముడుచుకు కూర్చున్నాడు రంగయ్య.

మరో రెండు గంటల్లో తను ఉరితీసే ప్రదేశానికి వెళ్ళి, అన్నీ సిద్ధం చెయ్యాలి. కాని ఎలా వెళ్ళటం. కొద్ది గజాల దూరంలో ఉన్న జైలు గోడలు అతని కంటికి భయంకరంగా కనబడుతున్నాయి. ఈ ఆపద నుంచి తప్పించుకోవడానికి ఒకటే మార్గం, తనీ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చెయ్యాలి. కాని ఆ తరవాత జీవితాంతం తను చేసిన పనికి పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. లేమి ఎలాంటిదో అనుభవపూర్వకంగా తనకు తెలుసు. తెలిసితెలిసి దరిద్రాన్ని మళ్ళీ కొనితెచ్చుకోవడమా. తనొక్కడే కాదుగా ఇలాంటి ఉద్యోగం చేస్తున్నది. తనలాంటి ఉద్యోగులు ప్రపంచంలో చాలామంది ఉన్నారు. వాళ్ళందరూ తనలానే బాధపడుతున్నారా? ఒక్కొక్కరి ఉద్యోగాలూ ఒక్కొక్క రకంగా ఉంటాయి. రోగి ప్రాణాన్ని కాపాడడానికి డాక్టరు శరీరభాగాలను కత్తితో కోస్తాడు. అంతమాత్రాన అతన్ని హింసాకారుడంటామా? అతనిలో దయాదాక్షిణ్యాలు లేవనగలమా? తన సంగతీ అంతే. ఉద్యోగనిర్వహణలో తనొక వ్యక్తి మెడకు ఉరితాడు బిగిస్తున్నాడు. అందులో తప్పేమన్నా ఉంటే అది తనది కాదు. అలా మనసు కుదుటపరచుకోవడానికి సాయశక్తులా ప్రయత్నించాడు రంగయ్య.

***

చివరికి ఎలాగైతేనేం అన్నీ టైంకి సిద్ధం చేసాడు. ఏదో అతని కాళ్ళూ చేతులూ ఆడుతున్నాయే తప్ప, రంగయ్య మనసు మాత్రం శూన్యంగా ఉంది. అతనికి బాహ్యస్పర్శ నశించిపోతున్న అనుభూతి కలుగుతోంది. అంతటి

వెర్రిభయంలోనూ, అంతటి శీతల, గంభీర వాతావరణంలోనూ కూడా ఏదో ఒక క్షణంలో ఈ ఉరి తప్పిపోతే బాగుండును అన్న కోరిక అతని మనసులో మినుకు మినుకు మంటూనే ఉంది.

సరిగ్గా ఉరితీసే ముందు అతన్ని క్షమించానంటూ ప్రెసిడెంటు దగ్గర నుంచి ఉత్తర్వు రావచ్చు; లేదా అతని మెడకు తగిలించిన ఉరితాడులో ఏదో లోపం ఉండి, సమయానికి పుటుక్కున తెగిపోవచ్చు. హఠాత్తుగా సత్యానికి ఏదో విపరీతమైన జబ్బు వచ్చి, అతని ఉరిశిక్ష తేదీ పొడిగింపబడవచ్చు. అందులో ఏది జరిగినా తనకీ పాపం తప్పుతుంది. సత్యం ప్రాణం దక్కుతుంది" అనుకున్నాడు రంగయ్య.

కాని అతననుకున్న వాటిలో ఏ ఒక్కటీ జరగలేదు.

సత్యాంని ఉరితీసే ప్రదేశానికి తీసుకొచ్చారు. అతనితో పాటూ జైలు వార్డెనూ, జైలు సూపర్నెంటూ, ఒక డాక్టరూ, ఒక పోలీసూ ఉన్నారు. వీళ్ళందరి సమక్షంలోనూ రంగయ్య సత్యం మెడకు ఉరితాటిని బిగించాడు.

“చివరగా నువ్వు చెప్పదలచుకున్నదేమైనా ఉందా” సూపర్నెంటు అడిగాడు.

సత్యం తన సహజమైన ధోరణిలో అన్నాడు. “కొద్ది క్షణాల్లో నా మెడకు ఉరి బిగించబోతున్నారు. నా ప్రాణాన్ని తియ్యబోతున్నారు. కాని మీరు ఈ ఉరిని వేస్తున్నది నాకు కాదు...అల్లకల్లోలంగా ఉన్న దేశంలో, నిప్పురవ్వల్లా ఎగిసిపడుతున్న వందలాది చైతన్యమూర్తులకు!! చంపుతున్నది నన్ను కాదు... యుగయుగాల హింసాద్వేషాల వికటట్టహాసాల మధ్య హీనస్వరంతో ఎలుగెత్తి చాటుతున్న మానవతని!! ఆ సంగతి మీరందరూ గుర్తుంచుకోండి. అదే నేను చెప్పవలసిందీ, చెప్పగలిగిందీను” అన్నాడు సత్యం.

“నీ చివరి కోరిక ఏమిటి” అన్న ప్రశ్నకు “మనిషిని మనిషిగా చూడాలన్నదే నా మొదటి కోరికా ఆఖరి కోరికా కూడాను. హెచ్చుతగ్గులు లేని సమాజిక వ్యవస్థే నా ఆశయం. అందరికోసం అంతా పాటుపడే సమసమాజమే నా సుందరస్వప్నం.” ఆవేశంగా అదేపనిగా అనుకుంటున్న మాటలు అందరి హృదయాలనూ కదిలించివేసాయి.

సూపర్నెంటు ఆదేశాల ప్రకారం వణుకుతున్న చేతులతో ముఖానికి నల్లముసుగు వెయ్యబోతూ అతని వంక ఆఖరిసారిగా చూసాడు రంగయ్య. సత్యం భావరహితంగా, మౌనంగా, సూటిగా రంగయ్య కళ్ళలోకి చూసాడు. తెల్లగా బలంగా ఉన్న అతని కళ్ళలోని భావమేమిటో అర్థం చేసుకుందామని అతను ప్రయత్నిస్తుండగానే ఛటుక్కున అతని చేతుల్లోని ముసుగు జారి, సత్యం ముఖాన్ని కప్పేసింది. కిందికి దిగివచ్చి ఉరితాడును బిగించి పట్టుకున్నాడు రంగయ్య. సూపర్నెంటు ఏదో అంటున్నాడు. రంగయ్య వంటిమీద స్పృహలేదు. గడియారం ఠంగుఠంగుమంటూ నాలుగు గంటలు కొట్టడం, సూపర్నెంటు 'ఒన్, టూ, త్రీ...రెడీ” అనడం, సత్యం మెడకు ఉరితాడు బిగుసుకుపోవడం, అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

సత్యం ప్రాణాలు గాలిలో కలిసిపోయే సమయంలో ఒక భయంకరమైన కేక వినవచ్చింది. ఆ కేక వచ్చింది సత్యం కంఠంనుండి కాదు. రంగయ్య గుండెను చీల్చుకొని వచ్చిందది. స్పృహ తప్పి పడిపోయిన రంగయ్యను జైలు ఆవరణలోనికి తీసుకుపోయారు. డాక్టరు ప్రథమచికిత్స చేసిన తరవాత తేరుకొని కళ్ళు తెరిచేడు రంగయ్య. ఒక గంటసేపైన తరవాత ఇద్దరు పోలీసులు అతనిని వెంటబెట్టుకొని ఇంటిదగ్గర దింపేరు.

గుడిసెలలోని వారందరూ ఎవరిపనులలో వారున్నారు. రత్తి అలవాటు ప్రకారం పొయ్యిలోకి కావలసిన కట్టెలూ, పొయ్యిమీదకు కావలసిన పదార్థాలనూ తెచ్చుకోవడానికి బజారుకు వెళ్ళింది. అతనిని దించిన మనుషులు వెళ్ళిపోయారు. రంగయ్య ఒంటరిగా గుడిసెలో కూర్చున్నాడు. అతని కళ్ళముందు ఏవేవో దృశ్యాలు కదులుతున్నాయి. అతని గుండెలో ఏవేవో మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి.

ఉరితాడు...సత్యం చూపు...ఏమిటా చూపులో భావం? "రంగయ్యా నేను చనిపోతున్నదెవరి కోసమో తెలుసా? నీ కోసం. నీలాంటి వాళ్ళ కోసం అనా, ఆ చూపులో భావం? ఈ ఉరిని వేస్తున్నది నాకు కాదు. అల్లకల్లోలంగా ఉన్న, నిప్పురవ్వల్లా ఎగిరిపడుతున్న వందలాది చైతన్యమూర్తులకు. నల్ల ముసుగు. సత్యం కళ్ళు...కళ్ళు...వన్, టూ త్రీ...రెడీ... కెవ్వున కేక...డాక్టర్...డాక్టర్...తెల్లకోటు...జైలు వార్డెన్...పోలీసులూ. "ఈ దేశప్రజలందరూ నావాళ్ళే. ఈ అసమానతలన్నీ నేను భరించలేను. నన్ను వెంటనే ఉరి తీయండి. ఠంగ్ ఠంగ్...ఠంగ్ ఠంగ్! ఒన్, టూ, త్రీ...రెడీ! సమాజంలో హెచ్చుతగ్గులున్నంత కాలం, వర్గద్వేషం, రక్తపాతం...రక్తపాతం...రక్తపు...రక్తం...రక్తం...నల్లని ముసుగు...ముసుగు...ఠంగ్ ఠంగ్...ఒన్, టూ త్రీ...రెడీ.

"మీరు చంపుతున్నది నన్ను కాదు. యుగయుగాలుగా, హింసాద్వేషాల వికటట్టహాసాల మధ్య హీనస్వరంతో ఎలుగెత్తి చాటుతున్న మానవతని...మానవతని...సత్యం కళ్ళు...నల్ల ముసుగు...ముసుగు...నేను చచ్చిపోతున్నది ఎవరికోసమో తెలుసా? నీకోసం...నీలాంటి వారికోసం. వన్...టూ...త్రీ!

ఒక గంట తరవాత బజారునుంచి వచ్చిన రత్తి, నులకమంచంలో చేష్టలు దక్కి, స్థాణువులా పడి ఉన్న రంగయ్యను చూసి, స్థంభీభూతురాలైంది.

***0***

| |
|---|
| ఈ కథ 1971 లో ప్రచురితం అయింది. కాని పత్రిక వివరాలు రచయిత్రి దగ్గర కూడా లభించలేదు. |

# చక్రపాణీ-రాజధానీ!

## భానుమతీ రామకృష్ణ



సాయంకాలం అయిదుగంటలవేళ హైద్రాబాదు వీధులన్నీ అలజడిగా వున్నాయి. ఒక వైపు నుంచి పెద్ద గుంపు పరుగెత్తుకొస్తున్నారు.. కేకలేసుకొంటూ.. “బాబోయ్ చంపేస్తున్నారు. పొడిచేస్తున్నారు.. త్వరగా పరుగెత్తండి! ఎరక్క యీ వైపొచ్చాం దేవుడా.." అంటూ!

అదే సమయంలో ఒక సన్నటి పొడుగాటి వ్యక్తి తాపీగా ఆ వైపు నడిచి రావడం చూసి ఆ గుంపులో యిద్దరు అగి, "ఏం చావడానికి కొచ్చావా?" అని నిలదీశారు!

అది విని సన్నటి పొడుగాటి వ్యక్తి తాపీగా తాగే సిగరెట్ చిటికెన వేలుతో విదిలించి,

“ఏం.. చచ్చే వచ్చాను" అన్నాడు.

“అంటే...? అన్నారు వాళ్లు కనుబొమలు చిట్లించి

“అంటే, నేను చచ్చిపోయి నాలుగైదేండ్లు అయిందిలే! నా పేరు చక్రపాణి! నాకిక చావులేదు" అది విని వాళ్లు ఒక్క సారిగా,

“అయ్యబాబోయ్! యితను మనిషిగాడు" అంటూ గావుకేక పెట్టి అక్కణ్ణుంచి పరుగు లంకించుకొన్నారు. చక్రపాణిగారు మరికొంత దూరం నడిచారు. మళ్లీ కొందరు గుంపుగా రావడం చూసి, వాళ్లని చక్రపాణిగారే ఆపి "ఏంటయ్యా! ఎందుకు పొడుచుకొని చస్తున్నారు? ఏం జరిగింది?" అని అడిగిన చక్రపాణి గారికి సమాధానం యిచ్చే సమయమూ, సహనము లేని ఆ గుంపు “ఏమో మాకు తెలీదు బాబూ. ఆవైపు అల్లర్లుగా వున్నాయ్! ముందు మమ్మల్ని పోనీండి" అంటూ పరుగెత్తిపోయారు!

యింతలో వెనక నుంచి “నమస్కారం చక్రపాణిగారూ!" అంటూ వచ్చి చక్రపాణిగారి ముందు నిలబడ్డాడొక పెద్దమనిషి. అతనెవరో తెలీని చక్రపాణిగారు ఆ పెద్దమనిషిని ఎగాదిగా చూశారు. మళ్లీ ఆ పెద్దమనిషే అడిగాడు "ఏమిటిట్లా వచ్చారూ!"

"ఎట్లా రమ్మంటావ్?" అన్నారు చక్రపాణిగారు.

"అది కాదండి మీరు..."

"ఎందుకొచ్చానంటావ్? చూడూ ప్రతి ఏడాది దీపావళి ముందు నేను హైద్రాబాదు వస్తుంటా, మా దీపావళి యువ యిష్యూ ఎట్టా తయారవుతుందో చూట్టానికి. ఆస్పరే గానీ యిక్కడ ఒకే అల్లర్లుగా వున్నాయంటనే."

"అవునండి. యీ రోజు నే నొక్కడ్ని తప్ప మిగతా అంతా పారిపోయారు. యిప్పుడు ఎక్కువ లేవులెండి అల్లర్లు. గవర్నమెంట్ కంట్రోల్ చేశారు. కాని సైక్లోనూ, వరదలూ చాలా జననష్టం చేసి తెలుగుదేశం అంతా దెబ్బ తిన్నది."

"ప్రతి ఏటా యిదొక పీకులాటే. వానలు కురవకపోతే నీళ్లు లేక చస్తున్నారు, కురిస్తే వరదల్లో చస్తున్నారు. గవర్నమెంట్ దీనికేదైనా చేయాలి."

"అన్నట్లు రామారావుగార్ని చూశారా?"

"ఏదీ యిప్పుడేగా వస్తున్నా"

"పోయిన సంవత్సరం వచ్చినప్పుడు చూశారా! చీఫ్ మినిష్టరుగార్ని"

"పోయిన సంవత్సరం దీపావళి ముందు నేనొచ్చినప్పుడు రామారావెక్కడున్నాడయ్యా చీఫ్ మినిస్టర్ గా!?"

"చిత్తం. చిత్తం. అప్పటికింకా ఆయన సి. యమ్ కాలా. ఎలక్షన్ల గొడవలో వూళ్లన్నీ తిరుగుతున్నారు అప్పట్లో"

"అందుకే చూళ్ళా. ఏదో వేన్ ఒకటి కొని తిరిగాడని విన్నా"

"అవునండి! ఒక్కొక్క పల్లే, ఒక్కొక్క యిల్లు, చివరికి చిన్నచిన్న గుడిసెల్లో బీద ప్రజలతో పాటు కూర్చుని 'అమ్మా అన్నం పెట్టు' అని దోసిలిపట్టి వాళ్ల చేత ముద్దలు వేయించుకు తిన్నారటండీ. ప్రతి ఆడది 'అన్నా...అన్నా' అని...

"అది నే విన్నా"

"ఎండలో తిరిగి ఎంత కష్టపడ్డారనుకొన్నారు .. నల్లబడ్డారు. బాగా....."

"ఎప్పుడూ ఎ సి రూములో కూర్చునేవాడు మరి ఒక్కసారి ఎండలోకొస్తే కష్టమే గదా. అంత ఎండలో అదే పనిగా తిరిగితే నల్లబడక తెల్లబడతాడా? నీకో కథ తెల్సా"

"తెలీదండి"

"ముప్పయ్యేళ్ల కొకసారి శనీశ్వరుడు ఒక రౌండ్ తిరిగొస్తాడు ప్రతివాడి జీవితంలో. అట్టా రావడంలో ఒకనాడు వెండి కొండ మీద కూర్చున్న శివుడి దగ్గరకొచ్చాడంట. శివుడు దేవుడు గనక మర్యాదిచ్చి "యిదుగో చూడు శివుడా. నిన్ను నేను అయిదు క్షణాలు పట్టబోతున్నానన్నాడంట. శివుడు మొండోడూ, ఆవేశపరుడు గదా! "అదంతా నాతో పెట్టుకోబాక. నీకు నే చిక్కన్లే" అన్నాడంట అలక్ష్యంగా!

శనీశ్వరుడు నవ్వేసి పోయాడంట.

వెంటనే శివుడు శనికి దొరక్కుండా ఒక చెట్టు తొర్రలో పురుగు రూపంలో దాక్కున్నాడు. ఆ అయిదు క్షణాలూ అయింతర్వాత శనిగాణ్ణి మోసం చేశాను గదానే విజయగర్వంతో చెట్టు తొర్రలోంచి బయటి కొచ్చాడు శివుడు. ఎదురుగ్గా శని నవ్వుతూ నిలబడ్డాడు.

'చూశావా, నేను నీకు దొరకనన్నాగా!' అన్నాడు శివుడు శనిని చూసి. అది విన్న శనీశ్వరుడు పగలబడి నవ్వుతూ "అయ్యో పిచ్చి శివుడా. నేను నిన్ను పట్టుకోబట్టే గదా వెండికొండమీద వుండాల్సినోడివి పురుగువై యీ చెట్టు తొర్రలో దాక్కున్నావు" అన్నాడంట.

"అప్పుడు శివుడేమన్నాడండీ"

"ఏమంటాడు. గుడ్లెళ్ల బెట్టుంటాడు.  అట్టా వుంది నువు చెప్పిందింటే."

"అయితే యీశ్వరుణ్ణి వదల్లేదన్నమాట శనీశ్వరుడు. ఏమైనా రామారావుగారు సి.యమ్. కావడం గొప్ప గదండి."

"ఏం గొప్పంట.  యాక్టర్ రామారావు గొప్పంటే ఒప్పుకుంటా.  అసలు చీఫ్ మినిస్టర్ కావడానికి పునాది యాక్టర్ రామారావేగద... లేకపోతే యీయనేమైనా దేశసేవ చేశాడా? జైల్లో కెల్లాడా? ఆస్తిపాస్తులు దేశానికి పంచిపెట్టాడా! ఏం త్యాగం చేశాడని ఓట్లేశారు జనం. యాక్టర్ రామారావు మీద  మోజుతోనే గదా! అంతెందుకూ, నీకు ఇంకో సంగతెల్సా?"

"నాకే సంగతి తెలీదండి"

"కన్నడ దేశానికి శానా ఏండ్లుగా రాజ్ కుమార్ అనే హీరో మకుటంలేని మహారాజనొచ్చు. అతను చీఫ్ మినిష్టరు కావాలనుకొంటే ఎలక్షన్ గొడవ లేకుండానే అరగంటలో కాగల్డు. అతనంటే కన్నడ జనానికి అంత పిచ్చి. మన తెలుగోళ్లకి రామారావన్నా అంతే. యింతెందుకూ, అమితాబ్బచ్చన్ యీ రోజు ప్రైమ్ మినిస్టర్ కావాలని నిలబడితే ఇండియా మొత్తం ఓట్లు అతనికే పడతయ్! అదొక గొప్పాంట. ఎంతైనా సినిమా 'ఇమేజ్' ఎప్పుడూ గొప్పదంటా! రాజకీయాల్లోకి దిగితే రొచ్చే, తెల్లటి ఇస్త్రీ గుడ్డ బురదలో బడ్డట్టే"

"గొప్ప నిజం చెప్పారు. అయినా మన ఆంధ్ర దేశంలో గడిచిన రెండు మూడు సంవత్సరాల్లో చాలామంది చీఫ్ మినిస్టర్లు మారడం జరిగింది. చాలా విచారకరమైన విషయం."

"ఎందుకయ్యా విచారం? అట్ట మార్చబట్టే గద మన రామారావు సులభంగా రాగలిగాడు."

"అవునండోయ్! గొప్ప పాయింటే శెలవిచ్చారు. దాంట్లో గూడా రామారావుగారికి రాజకీయాలు బాగా తెలుసు."

"మళ్లీ అక్కడే పప్పులో కాలేశావ్." అన్నాడు చక్రపాణిగారు  సిగరెట్ వెలిగిస్తూ.  గతుక్కుమన్నాడు పెద్దమనిషి.

"రాజకీయాలు తెలిపిన వాళ్లకి అవేశం, తొందరపాటూ వుండకూడదంటారు తెల్సా!......

"చిత్తం అవన్నీ పూర్వం రాజులకీ, మహారాజులకీ వుండేవనీ, మాట మాట్లాడితే కత్తి దూసేవారనీ కథల్లో చదివాం గదండి. అయినా రామారావుగారు యిప్పుడు కాషాయ గుడ్డలు కట్టుకొని రాజఋషిగా ఉంటున్నారు."

అది విని చక్రపాణిగారు చిన్నగా నవ్వారు. పెద్దమనిషి వెలవెలబోతూ "తమరు నవ్వారు" అన్నాడు.

"మరి ఏడవమంటావయ్యా? కాషాయ గుడ్డలు కట్టి నంత మాత్రాన ఋషి ఎట్టా అవుతాడయ్యా? తన చుట్టూ ముళ్ల పొదలా వున్న బాధ్యతల్నించి బయట పడగల్డా? ఒక పెద్ద వేదాంతి చెప్పాడులే.. ఎనకటికి ఎవడో ఒకడు తన నీడ తనతో కూడా వుంటం నచ్చక, ఎట్టనయినా పూడ్చి పెట్టాలని తీర్మానం చేసుకొని, తన నీడ పడ్డచోట గబగబా గుంట తవ్వడం మొదలు పెట్టాడంట. గుంట తవ్వేకొద్దీ తన నీడ గుంటలో పడడం చూసి సంతోషపడిపోతూ, యింకా బాగా లోతుకు తవ్వాడంట! ఆ నీడ గూడా బాగా లోతుకు పోయిందంట. అతను 'ఒదిలిందిరా శని' అంటూ ఆ నీడని ఆ గుంటలో మట్టేసి పూడ్చడం మొదలెట్టాడంట. మట్టేసి పూడ్చేకొద్దీ మట్టి మీద తన నీడగూడా పైకిరావడం మొదలెట్టింది. పూర్తిగా గుంట మూసి చూస్తే తన నీడ ముందెక్కడుందో అక్కడే వుందట. చచ్చిందాకా చావులా వెంటబడే నీడని పూడ్చి పెట్టడం ఎట్లాంటిదో, పుట్టుకతో వొచ్చిన సహజ గుణాలు మార్చడం గూడా అట్టాంటిదే!.... "

"అయితే సినిమావాళ్లకి రాజకీయాలు తెలీవంటారా?"

"అట్టా ఎందుకంటాను? యిప్పుడు అమెరికాలో రీగన్, దక్షిణాదిలో మన ఎమ్.జి.ఆర్. వుండ్లా! ఎమ్.జి.ఆర్. శానా ఏండ్లుగా అన్నాదురై, కరుణానిధీ వాళ్లతో పాలిటిక్స్ లో బాగా నలిగినోడు."

"అయితే ఎం.జి.ఆర్. కూడా సినిమా యిమేజ్ తోనే రాజకీయాల్లో నెగ్గాడంటారు"

"నేనంటం ఏంటయ్యా! ప్రపంచానికే తెలుసు. జనానికి హీరోగా అతని మీదుండే పిచ్చి అభిమానంతోనే అనాడు డి.యమ్.కె పార్టీకి ఓట్లు వేశారు. పైగా ఎమ్జీఆర్ తను చేసే సినిమాలన్నిట్లో గూడా డైలాగుల్లో, పాటల్లో డియమ్ కె పార్టీ ప్రచారం బాగా చేసి పార్టీకి పునాదులేశాడు. అసలు ఎమ్ జి ఆర్ లేకపోతే డియమ్ కె అనే ఒక పార్టీ అంత ప్రబలం అయ్యేది గాదు. యీనాటికీ మిగతా అందరూ పోయినా ఎమ్ జి ఆర్ కి స్టార్ గా, సి.ఎం గా మంచి పేరుంది."

"అదంతా అతనికి సినిమాలిచ్చిన 'యిమేజ్' యిప్పటికీ అతను బయట జనంలోకొస్తే యింత ముసలోడై గూడా యింకా అడామగా అతన్ని చూట్టానికి ఎగబడుతారు. అతని పాత సినిమాలన్నీ గుర్తు పెట్టుకొని. ఏం! యిప్పుడు రామారావు బయటికెళ్తే, అయన్ని రాముడుగా, కృష్ణుడుగా, దుర్యోధనుడుగా, కర్ణుడుగా, ఒక దేవుడుగా చూట్టానికి జనం విరగబట్టంలా? అదే సమయంలో సినిమాల్లో లేని చీఫ్ మినిష్టరు ఎవరన్నా చేస్తే అట్టా యిరగబడి చూడమను. సి.ఎమ్. "యిమేజ్ 'కంటే సినిమా 'యిమేజ్ ' గొప్పదయ్యా."

"నీకో సంగతి తెల్సా?"

"తెలీదండి"

"నీకు తెలీదని నాకు తెలుసులే! ఆ మధ్య అరవ దేశంలో.."

“యిక్కడ తెలుగు దేశంలాగా అరవదేశం అనే పార్టీ వుందాండీ!
“అదిగాదయ్యా! తమిళనాడు."
“ఓహో మనం ఆ మధ్య 'తెలుగునాడు' అన్నాంలెండి."
“మనం అంటున్నావు. నేనెప్పుడన్నాను?” గతుక్కుమన్న పెద్దమనిషి గుటకమింగి “అబ్బే మీరు కాదండి. యిక్కడ మన తెలుగుదేశం పార్టీ వారు అట్లా గూడా అన్నారు ఆంధ్రదేశాన్ని.”
“అదేంటో నాకు తెలీదుగానీ సినిమాపిచ్చి జనంలో ఎంత ఎక్కువైందో యీ మధ్య జరిగిన ఒక చిన్న తమాషా కథ చెప్తా విను."
"చిత్తం చెప్పండి”
“ఆ మధ్య మద్రాసుకి నూరుమైళ్ల దూరంలో వున్న విల్లిపురం అనే వూరికి దక్షిణాదిలో మంచి పేరున్న కృపానంద వారియార్ అనే హరికథలు చెప్పే పెద్దాయన్ని ఏదో ఫంక్షన్ కి పిలిపిస్తే, ఫస్టుక్లాసులో రైల్లో వస్తున్నాడంట. ఏదో వూర్నుంచి అదే రైల్లో యిప్పుడు అరవ సినిమాల్లో 'హాట్ కేక్' లాగున్న సిల్క్ స్మిత అనే జయమాలినిలా 'సెక్స్' డాన్స్ లు చేసే సినిమా స్టారు ఆయనున్న 'ఫస్ట్ క్లాసు కంపార్టుమెంట్' లోనే ఎక్కిందంట ఏ వూర్నుంచో వస్తూ. ఆ కంపార్ట్ మెంట్ లో ఆ పెద్దాయనా, ఆ స్మితా, వాళ్లతో వచ్చిన ఒకళ్లిద్దరు తప్ప యింకెవ్వరూ లేరంట."
"ఆహా! విశ్వామిత్రుడూ మేనకా ' కాంబినేషన్' అనండి."అన్నాడు పెద్దమనిషి వెకిలిగా నవ్వుతూ.
“మధ్య నువ్వెందుకయ్యా మెలికలు తిరిగిపోతావ్!”
చటుక్కున బిగుసుపోయిన పెద్దమనిషి, "చిత్తం! స్మిత చాలా అల్లరిపిల్ల గదా, ఆ పెద్దాయనతో ఏం మాట్లాడిందండి."
“నే విన్లా! నాకు యితర్లు చెప్పింది చెప్తా విను. "
"చిత్తం.”
“ఆ పెద్దాయన శానా లావుగా వుంటాడులే, అతను బాత్ రూంకెళ్లి చాలీచాలని చిన్న అంగవస్త్రం కట్టుకొని స్మిత కెదురుగా వున్న సీట్లో కూర్చున్నాడంట!
“మంచి రసవత్తరమైన ఘట్టం!" అన్నాడు పెద్దమనిషి మళ్లీ సిగ్గుతో మెలికలు తిరుగుతూ!
“ఆ సంగతి యిప్పుడు నీ అవస్థ చూస్తేనే తెలుస్తా వుందిలే! స్మిత పేరు వింటేనే నువ్విన్ని మెలికలు తిరుగుతున్నావే! మరి స్మిత లేంది యీనాడు అరవ సినిమా అమ్ముడుపోదనటంలో తప్పేం లేదు.”
“అవునండీ! ఆ పిల్లంటే జనానికి భలే పిచ్చటండీ. అయితే ఆ కృపానంద వారియార్ గార్ని కూడా స్మిత తన బుట్టలో వేసుకొందాండీ!”
“ఆయన్ని బుట్టలో వేసుకుందో ఒళ్లో వేసుకుందో ఆ సంగతి నాకు తెలీదుగానీ, మొత్తానికి ఆయన్ని ఆయన కట్టుకున్న చాలీచాలని చిన్న అంగోస్త్రాన్ని చూసి సూటిగా ఒకే మాట అడిగిందంట!

“స్వామీ. మీరు గొప్ప పండితులూ, వేదాంతం వేలాది ప్రజలకి బోధించే మహాత్ములూ, మీరు యిలా చాలీచాలని చిన్నగుడ్డకొని మీ ఒళ్లు సగం బయటికి తెలుస్తున్నా మిమ్మల్ని చూసి ఎవరు ఈలలు వేయరు. గలాటా చేయరు. పైగా మీరీ చిన్న గుడ్డగూడా తీసేసి గోచీ పెట్టుకొంటే యింకా మీ గొప్పతనం పెరిగిపోయి సాష్టాంగ నమస్కారాలు చేస్తారు. మరి సినిమాల్లో యీ చిన్నగుడ్డ నేను కట్టుకుని ప్రొడ్యూసర్లు గెంతమన్నట్టల్లా గెంతుతున్నాను. మరి నన్నెందుకు విమర్శిస్తారు, అసహ్యించుకుంటారు కొందరు? మీ గోచీకి లేని పేచీ నే కట్టే పీలికల కెందుకు రావాలి.....చెప్పండి..... " అని నిలదీసిందంట ఆ హరికథలాయన్ని.

“అబ్బా! అబ్బా ! అద్భుతంగా వుంది. స్మిత అడిగిన ప్రశ్న. ఏంచెప్పాడో ఆ పెద్దాయన?!"

“ఏం చెప్తాడు. ఏ హరికథల్లోదో పిట్టకథ చెప్పి వుంటాడా పిల్లకి. ఊ! అసలు సంగతిను. ఇంతలోనే ఆ పెద్దాయన దిగాల్సిన విల్లిపురం స్టేషనొచ్చిందంట. ఆయన్ని ‘రిసీవ్' చేసుకోడానికి పెద్ద మాలలూ బుట్టలబుట్టల పూలు తెచ్చారంట అయన్నాహ్వానించిన ఫంక్షను వాళ్లంతా."

ఇంతలోనే ఆ గుంపులో ఎవరో సిల్క్ స్మితని గుర్తుపట్టారంట. అంతే. ‘సిల్క్ స్మితరోయ్!’ అంటూ ఆ గుంపంతా ఆ పిల్ల చుట్టూ మూగి ఆ మాలలన్నీ ఆ పిల్ల మెళ్ళో వేసి, కపార్టుమెంట్ లోకి చొరబడి వాళ్లు పెద్దాయనకి తెచ్చిన బుట్టలబుట్టల పూలన్నీ ఆ సిల్క్ స్మిత మీద పోసేశారంట పిచ్చి సంతోషంతో.

“ప్రజల్లో సినిమా పిచ్చి మరీ రోజురోజుకి దాలా ఎక్కువై పోయిందండి. యింతకీ ఆ పెద్దాయన్ను ఏంచేశారో పాపం?”

"పచ్చడికింద తొక్కారంట. చావుతప్పి కన్ను లొట్టపోయి ప్లాట్ ఫారమ్ మీదికెళ్లి పడ్డాడంట. ఇంతకీ నే చెప్పొచ్చేదేంటంటే..”

“అర్థం అయిందండి. మీరు చెప్పేదాంట్లో ఎన్నోనగ్నసత్యాలున్నాయి."

“ఊ! ఇంతకీ మన రామారావుగారి ఆరోగ్యం బాగుంది గదా?"

"ఆ! బాగానే వున్నారండీ. ఒక్కటే ఆయన బాధ, ప్రజలకేదో చేయాలనీ, వాళ్లకేలోటూ లేకుండా వాళ్ల కేంకావాలో.....”

“అసలు వాళ్లకేం కావాలో వాళ్లకేం తెలుసంట?” చక్రపాణిగారు తాపీగా అడిగారు.

పెద్దమనిషి తెల్లబోయి “బాగా చెప్పారు." అన్నాడు.

“అసలు రామారావు రాజకీయాల్లో రాణించగూడదని లోపల్లోపల కుళ్లుకొని చచ్చేవాళ్లు మనోళ్లల్లోనే శానామంది వున్నారు." అన్నాడు చక్రపాణిగారు సిగిరెట్ విదిలిస్తూ.

“అబ్బో! శానా పెద్ద పెద్దోళ్ళే వున్నారండి పైకి పెద్ద మనుషులనబడేవాళ్లు. అంతెందుకండీ అయన సి.యమ్ అయిన కొత్తల్లో ఎవరో ఒక సినిమా పెద్దమనిషే అడిగాడటండి యింకో సినిమా పెద్దమనిషిని 'రామారావుగారు ఎంతకాలం వుంటాడంటారీ పోస్టులో’ అని."

“అది నే విన్నాలే. యింకో తమాషా తెల్సా!”

"తెలీదండి."

"ఏం ఆయన పార్టీలోవాళ్లే కొందరు ఎమ్.ఎల్.ఏ.లు మినిష్టరీలు వస్తాయని ఎదురుచూసి రాకపొయ్యేసరికి 'ఉత్సవ విగ్రహాల్లా వుంటానికా యింత డబ్బు తగలేశాం' అంటూ ఏడ్చుకుంటున్నారంట."

"చూశారా. ఎంత అన్యాయం."

"అంతేగాదు. రామారావుకి బాగా తెలిసినోళ్లందరి దగ్గరికి వెళ్లి 'మీ రామారావే గదండి ఒక్కమాట ఆయన్తో చెప్పండి మమ్మల్ని మినిష్టర్లని చెయ్యమని' అని బ్రతిమాలారంట!"

"అదేనండీ ఆయన పార్టీ గౌరవం పాడుకాకూడదు గదండీ."

"పార్టీ సంగతి దేవుడెరుగు. ముందాయన సంగతేమిటంట! యిట్టా వున్నయి రాజకీయాలు. నా మాట రుచించదు గానీ ఒకప్పుడున్న గౌరవం యీనాడు రాజకీయాలకి లేదుగదా? అంతెందుకూ యీనాటి రాజకీయాల్లో దేవుడే దిగొచ్చినా జనాన్ని తృప్తిపరచలేడు. ప్రస్తుత పరిస్థితుల్లో.. రష్యాలో రామరాజ్యం రావాలన్నట్టుంటుంది. అందర్నీ తృప్తిపర్చడానికి ప్రయత్నించడం."

"బాగా చెప్పారు. ఎలాగైనా రామరాజ్యం చేయాలనే రామారావుగారి తపన."

"అదే తప్పంటా!" మళ్లీ గతుక్కుమన్నాడు పెద్దమనిషి.

"రామరాజ్యం అనే ఒక సినిమా తీసి అందులో సి.ఎమ్. వేషం వేసి, యాక్టుచేసి, ఎన్ని నీతులు చెప్పినా జనం అదే నిజమని నమ్మి సంతోషించి, రామారావుకి బ్రహ్మరధం పడతారు.  కానీ, నిజజీవితంలో అతను ఎంతో సిన్సియర్ గా దేశం బాగుచెయ్యాలని తపనపడ్డా, అదంతా ఒట్టి యాక్టింగ్ అంటూ తేలిగ్గా చప్పరించేస్తారు. అదే యీ పెద్ద పెద్ద స్టార్లయినవాళ్లకి ఒక పెద్ద డిజంద్వాటేజ్. వాళ్లు నిజంగా ఏడిస్తే జనం నవ్వుతారు. అదే వాళ్లు సినిమాల్లో గ్లిజరిన్ వేసుకుని వుత్తిత్తినే ఏడిస్తే, జనం వాళ్లతోపాటు ఏడుస్తారు. అయినా తెలీకడుగుతాగానీ  రామరాజ్యం అంటే నీ ఉద్దేశంలో ఏంటి అని?" అని నిలదీశాడు చక్రపాణిగారు. మళ్లీ ఆ పెద్దమనిషి గతుక్కుమన్నాడు.

"చిత్తం. రామరాజ్యం అంటే ప్రజలకి ఏ లోపం లేకుండా...." నసిగాడు పెద్దమనిషి

"మళ్లీ అక్కడే దెబ్బతిన్నావ్. ప్రజలకి ఏ లోటూ రాకుండా చూసుకొన్న రాముణ్ణి ఒక చాకలివాడు నానా బూతులు తిట్టాడయ్యా! రావణాసురుడి పంచన పడున్న పెళ్లాన్ని మళ్లీ తెచ్చుకొని ఆ చచ్చురాముడు గనక ఏలు కుంటున్నాడు. నేనైతే నరికి పోగులేసే వాణ్ణి అన్లా? అసలు ఆ చాకలోడే హీరో అంటాన్నేను. ఊ! అంత గొప్ప రాముడూ ఆ దెబ్బతో 'ఫ్లాట్' అయినాడా లేదా?"

"చిత్తం అబ్బో. రామరాజ్యం కావాలంటే చాలా సెల్ఫ్ శాక్రిఫైస్ చేయాలండి మరి"

"యిప్పుడు మినిష్టర్లు చస్తే చెయ్యరు. అందులోనూ సినిమా మినిష్టర్లు అట్లాంటిది పొరపాట్న గూడా చెయ్యరు. అదంతా ఆ పాత కాంగ్రెసోళ్లతోటే పోయింది."

"యిప్పుడు మినిష్టర్లయ్యేది వున్న ఆస్తుల్ని వృద్ధిచేసుకోడానికీ, కూతుళ్లకీ, కొడుకులకీ, కావాల్సినోళ్లకీ, లేని ఆస్తుల్ని ఏడుతరాలకి సరిపడేటట్లు సంపాదించి పంచడానికే. శాక్రిఫైస్ అనేది మహాత్మా గాంధీ, నెహ్రూ

లాంటి గొప్పోళ్లతోనే అంతం అయింది. యింతకీ హైదరాబాదు సినిమా వాళ్లేమంటున్నారు?" అన్నాడు చక్రపాణి మరో సిగరెట్ వెలిగిస్తూ,
"మద్రాసులో వుండే సినిమా వాళ్లందరూ హైద్రాబాదు రావాలంటున్నారు."
"చస్తే రారు. అదిప్పట్లో జరిగే పని గాదు."
"అదీ నిజమేలా కనిపిస్తోంది. పైగా సబ్సిడీలు తీసేశారంటున్నారు."
"మంచిపని చేశారు. అదొక దండగా గవర్నమెంట్ కి."
"మరి హైద్రాబాదులో ఫిలిం పరిశ్రమ అభివృద్ధి చెందేదెట్లాగండి?"
"అందుకని పిల్లలకి చాకలెట్ చూపించి దగ్గరికి పిల్చినట్టు ఎంతకాలం సబ్సిడీలిచ్చి చేతులు కాల్చుకుంటారు గవర్నమెంటోళ్లు. పీకేస్తే ఆ పీకులాటే లేదుగా!"
"అదేనండి కొందరికి అసంతృప్తి."
"చెప్పానుగా, అందర్నీ తృప్తిపర్చడం ఆ దేవుడివల్లే గాదని."
"అకాడెమీలను గురించి ముఖ్యంగా సంగీత నాటక అకాడమీ.."
"ఆ సంగతి నా దగ్గరెత్తక. నాకు చిర్రెత్తుకొస్తది!"
"ఆస్థాన కవిగార్ని తీసేయడం సరస్వతీ దేవిని అవమానించినట్లే అని కొందరు అంటున్నారు."
"అదేదో నాకు తెలీదుగానీ, మనదేశంలో శానావరకూ మంచి కవులే డబ్బు లేక కష్టపడేది, ఏ కొద్ది మందో తప్ప! అదొక పెద్ద ఖర్చుగాదు సబ్సిడీల్లాగా వుంచిండొచ్చు. ఆదినుంచి వస్తున్నదే గనక."
"చిత్తం మీరు కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడతారండీ! కాని స్వామీ....."
"నే స్వామిని గాదయ్యా! ఒట్టి చక్రపాణ్ణి."
"అదేనండి. మీరొచ్చిన యీ సమయంలో రామారావుగారు రాజధానిలో లేకపోవడం చాలా బాధగా వుంది. రామారావుగారంటే మీకెంత అభిమానమో అందరూ చెప్పుకొంటూంటే విన్నా."
"అవును. ఒకప్పుడు అతని మీద యీగవాల్నిచ్చేవాణ్ణి కాదు. ఎంతయినా మా విజయా హీరో కదా!"
"చిత్తం. ఆ పాత అభిమానాలు పోవు." అని ఆ పెద్దమనిషి చక్రపాణిగారితో మాట్లాడుతుంటే యమభటులొచ్చారు.
"పద! ప్రొద్దుననంగ కత్తిపోటుతో చచ్చి మా కళ్లల్లో కారం కొట్టి పారిపోయొచ్చి బాతాఖానీ లేస్తున్నావా! పదపద!" అంటూ ఆ పెద్ద మనిషి రెండు చేతులూ పట్టుకొని లాగడం మొదలెట్టారు.
అది చూసి చక్రపాణిగారు ఒక్కసారి గతుక్కుమని "ఓరి చచ్చినోడా. నువ్వా చచ్చినోడివేనా ! నాతో యింత సేపు మాట్లాడావ్!"
"చిత్తం, ప్రొద్దుటే ఆఫీసుకి బయల్దేరి వస్తున్న నన్ను వెనక నుంచి కత్తితో పొడిచారు."
"మరి యింతదూరం ఎట్టా వచ్చావ్ యింత సేపు ఎక్కడున్నావ్?"

“ఒక చెట్టుకింద దాక్కున్నానండి. దూరాన్నుంచి మిమ్మల్ని చూశాను యిందాక. ఒక్కసారి ప్రాణం లేచి వచ్చింది.”

“ఊ. మాటలు చాలు, బయల్దేరు!" అని యమదూతలు గద్దించారు ఆ పెద్దమనిషిని.

“ఉండండోయ్! అస్సరే యింత సేపు మీ రెక్కడున్నారు!” చిక్కు ప్రశ్న వేశాడు చక్రపాణిగారు. అది విని గతుక్కుమన్నారు యమభటులు.

“మాట్టాడ్రేం?" అని రెట్టించాడు చక్రపాణిగారు సిగరెట్ చివరి దమ్ము లాగుతూ,

“అదే అదే! ఏదో పాత సినిమా యన్.టి. రామారావు గారిది ఆ పక్కనే అడుతుందనీ .... ”

“ఆ సినిమా చూట్టాని కెళ్లారు. అంతేనా?" సిగరెట్ కాలికింద నలిపేశాడు చక్రపాణిగారు.

యమదూతలు ఒకళ్ల మొఖాలు ఒకళ్లు చూసుకున్నారు గుటకలు మింగుతూ....

“ఏం?మాట్లాడ్రేం?"

“అవునండి” అన్నారు భయపడుతూ.

“బాబ్బాబు మీరు యీ విషయం మా చిత్రగుప్తుడు గారితో, యమధర్మరాజుతో చెప్పకండి చక్రపాణిగారూ. రామారావు గారి మీదుండే అభిమానంతో ఆ సినిమా కెళ్ళాం ... మా ఉద్యోగాలు పోతయ్ యీ సంగతి పైన తెలిస్తే..”

“చెప్పన్లే గాని ఆ పెద్దమనిషిని మర్యాదగా తీసుకెళ్లండి! పాపం అర్థాంతరంగా చచ్చాడు. నిన్ను నేనొచ్చి కలుస్తాన్లే” అన్నాడు చక్రపాణిగారు దూతల్ని చూసి భయపడుతున్న పెద్దమనిషితో.

“అయ్యా చక్రపాణిగారూ మీరు నాతో రాగూడదూ! కొత్త చోటు నాకు.."

“ఏం ఫర్వాలేదు. అలవాటుపడతావ్ లే! యిక్కడ్లానే వుంటుందక్కడ గూడా! పైగా నే వస్తాగా! మా మనవడి పెళ్లి ఏర్పాట్లు ఎట్టా చేస్తున్నారో చూడాల. మా దీపావళి యువకి యింకా భానుమతి కథరాసి పంపిందో లేదో చూడాల. ఎప్పుడూ లేటుగానే పంపుద్ది. మా సుధాకర్ ని చూసి మాట్లాడొస్తా.....” అంటూ యువ ఆఫీసు వేపు నడిచి వెళ్లాడు చక్రపాణిగారు!"

***0***

యువ దీపావళి ప్రత్యేక సంచిక నవంబర్1983 ప్రచురణ

# నేను కథలు ఎలా వ్రాస్తాను?

**కథామంజరి కథకుల కోసం శ్రీమతి పరిమళా సోమేశ్వర్ పంచుకున్న అనుభవాలు**

నేను వ్రాసే కథలన్నీ జీవితం నుండి వచ్చినవే. నేను చూసినవి, విన్నవి అనుభవించినవి మాత్రమే కాక ఇతరుల జీవితాల్లో జరిగిన సంఘటనలు, న్యూస్ పేపర్స్ లో వచ్చిన వార్తలు అన్నీ నా కథా వస్తువులే. సంఘటనలు అనుభవాలే కాదు ఎప్పుడో ఎక్కడో విన్న ఒక వాక్యం, ఒక చిన్న ఆలోచన విస్తారమయి కథా రూపం దాల్చుతుంది. సామాజిక వాస్తవికత లేని సాహిత్యం వ్యర్థమని నా ఉద్దేశ్యం. వాస్తవికతకు తోడు కథా కథన శైలి, భావోద్వేగాలు తోడైతే అది మంచి కథ గా రూపొందుతుంది.

నేను వ్రాసిన కథలు కొన్నిటికి ఇన్స్పిరేషన్ ఎలా వచ్చిందో కొంచం వివరిస్తాను.

**1. అన్నదమ్ములు**

అరవైలలో నేను, మా వారు పాత బస్తీ హైదరాబాద్ లో ఉన్న గవర్నమెంట్ సిటీ కాలేజ్ లో లెక్చరర్లగా పని చేస్తుండే వాళ్ళం. ఇల్లు కూడా దగ్గర్లోనే అద్దెకు తీసుకుని ఉండేవాళ్ళం. ఆ రోజుల్లో పాత బస్తీలో మత కల్లోలాలు బాగా జరుగుతుండేవి. మామూలు రోజుల్లో కలసి మెలసి ఎంతో అన్యోన్యంగా జీవించే రెండు మతాల వాళ్ళు, ఆ కలహాల సమయంలో ఒకర్నొకరు అపరిచితులుగా భావించే వాళ్లు. పైగా మతకల్లోలాలు జరిగినప్పుడల్లా కర్ఫ్యూ విధించే వాళ్లు. జనజీవనం స్తంభించి పోయేది. ఏడాదిలో మూడు సార్లన్నా స్కూల్స్, కాలేజ్ లు బందయ్యేవి. తరువాత అంతా మామూలుగానే ఉండేది. తీరా మత కలహాలకు కారణం చూస్తే చాలా చిన్న విషయమే నని తెలిసేది.

రోడ్ మీద ట్రాఫిక్ లో ఇరువురి మధ్య జరిగిన పొట్లాటలో, సారా దుకాణం దగ్గర జరిగిన కొట్లాటలో కారణం అని తెలిసేది. ఆ చిన్న విషయానికి మతం రంగు పూసి కొందరు రాజకీయాలు చేస్తుంటే, మరి కొందరు అసాంఘిక వ్యక్తులు ఇదే అదనుగా దోపిడీలు విధ్వంసాలు సృష్టించే వాళ్ళు. దాంతో కర్ఫ్యూ పెట్ట వలసి వచ్చేది. నికృష్ట రాజకీయాలకు, అసాంఘిక శక్తుల విద్వంసాలకు సామాన్యుల జీవితాలు వాల్ అయ్యేవి. అలాంటి నేపథ్యాన్ని సృష్టిస్తూ నేనొక కథ వ్రాసేను. అదే అన్నదమ్ములు .

ఆ కథలో ఒకే ఊరికి చెందిన ముస్లిం , హిందూ రైతు లిద్దరు పొట్ట కూటి కోసం హైదరాబాద్ వచ్చి పాత బస్తీ లో ఉంటూ సైకిల్ రిక్షాలు అద్దెకు తీసుకుని జీవితం గడుపుతూ ఉంటారు. వారిద్దరి కుటుంబాలు కూడా అరమరికలు లేకుండా స్నేహపూర్వకంగా ఉంటారు. ఒకరోజు వాళ్ళిద్దరూ రిక్షా నడపటం అయ్యేక అలవాటు

ప్రకారం సారా కొట్టు దగ్గరకు వెళ్లి ఫుల్ గా తాగేసి, ఆ మత్తులో ఏవేవో మాట్లాడుకుంటూ వాదించుకుంటూ ఉంటారు. ఆ వాదనలు చివరకు ఘర్షణగా మారి, ముస్లిం అతను హిందువును కత్తితో పొడిచి చంపేస్తాడు. కింద పడి అచేతనంగా ఉన్న స్నేహితుడిని చూసి విలపిస్తాడు. కానీ అప్పటికి చేయి జారి పోవటంతో అతను పోలీసులకు లొంగిపోతాడు. సాక్ష్యాధారాలు బలంగా ఉండటం వల్ల నేరస్తుడికి ఉరి శిక్ష పడుతుంది. ఆ సంగతి విన్న వాళ్ళ కొడుకు లిద్దరూ ఒకరి నొకరు కౌగలించుకుని ఏడుస్తారు
"మన తండ్రులు చేసిన తప్పు మనం చేయ వద్దురా. మనం రోజు ప్పుడూ అన్నదమ్ముల్లా కలసే ఉందాం." అనుకుంటారు
కర్ఫ్యూ టైం లో వ్రాసిన ఈ కథ ' ఆంధ్ర ప్రభ వార పత్రికలో వచ్చి విశేష జనాదరణ పొందింది.

**2. క్రోటను మొక్కలు.**

నేను స్కూల్ ఫైనల్ లో ఉన్నప్పుడు నా స్నేహితరాలి ఇంటికి వెళ్లాను. ఆ రోజుల్లో ఆడపిల్లలకు స్కూల్ ఫైనల్ కాగానే పెళ్ళి చేసే వాళ్ళు. అందువల్ల నా స్నేహితురాలి వదిన "నీ పెళ్ళి ఎప్పుడు?" అనడిగింది. "ఇప్పుడేం పెళ్ళి? నేను కాలేజ్ లో జాయిన్ అవుతాను. పిజి అయ్యాకే పెళ్ళి" అని జవాబు ఇచ్చేను. ఒక పల్లెటూరులో ఒక ఆడపిల్ల ఆరోజుల్లో అలా మాట్లాడటం చాలా అరుదైన విషయం. అందుకే ఆమె ఓ నిట్టూర్పు విడిచి "ఏమిటో ఈ కాలం ఆడపిల్లలు. పెళ్ళి మాటే లేదు. క్రోటన్ మొక్కల్లా ఉంటారు. ఓ పువ్వు లేదు, కాయా లేదు" అన్నది
ఆమె మాటలు ఎందుకో నా మనసులో గాఢంగా హత్తుకు పోయినాయి. ఎక్కువగా చదువుకోని ఆమె, పెళ్ళి కాని ఆడపిల్లలను క్రోటన్ మొక్కలతో పోల్చటం చాలా అద్భుతంగా అనిపించింది నాకు.
నేను పిజి చేసి, పెళ్ళిచేసుకుని ఇద్దరు పిల్లలుని కనే వరకు కూడా ఆ వాక్యం నన్ను వెంటాడుతూనే ఉంది. రోజు ఉద్యోగ రీత్యా సిటీ బస్సులో ప్రయాణం చేసేటప్పుడు ఎంతో మంది వయసు మీరిన అవివాహిత స్త్రీలను, ముఖ్యంగా ఉద్యోగినులను చూస్తుంటే ఆ వాక్యమే నన్ను వెంటాడేది. అప్పుడు చాలా మంది ఉద్యోగినులు ఇలా అవివాహితలుగా ఎందుకు మిగిలి పోతున్నారు అని ఆలోచించే దానిని. మధ్య తరగతి కుటుంబాలలో ఆడపిల్ల సంపాదనకు అలవాటు పడ్డ తల్లి దండ్రులు, ఆమెకు పెళ్ళి చేస్తే సంసారం గడవటం ఎలా అని పెళ్ళి వాయిదా వేస్తారు. మరి కొన్ని ఫ్యామిలీలలో పెద్ద చదువులు చదివిన ఆడపిల్లల స్థాయికి తగ్గ వరులను వెతకలేక, వయసు దాటేక ఆమె కన్న పెద్ద వరులు దొరక్క ఇలా అనేక కారణాల వలన వయసు మీరిన కన్యలు మన దేశంలో చాలా మంది కనపడుతూ ఉంటారు. అలాంటి క్రోటన్ మొక్ లాటి అమ్మాయి జీవితాన్ని తీసుకుని క్రోటన్ మొక్కలు అనే కథను వ్రాసేను.
పూలు సుమంగళి తనానికి చిహ్నం. కాయలు సంతానం కు గుర్తు. ఈ రెండూ లేక విద్యాధికులు అయిన స్త్రీల జీవితాలెన్నో వ్యర్థంగా గడచి పోతున్నాయి.

ఈ కథ " భారతి" అనే తెలుగు మాస పత్రికలో అచ్చయింది. ఆ కథ ఎంతగా పాపులర్ అయిందంటే ఆ సంవత్సరం వచ్చిన తెలుగు కథల అంతోలజీలో చోటు చేసుకోవటమే కాక తమిళ్ పత్రిక కల్కిలో వచ్చిన ఆంతోలజీలో కూడా కవర్ స్టోరీగా అచ్చయింది. ఆ తరువాత హిందీలోకి అనువదించి ధర్మయుగ్ అనే పత్రికలో అచ్చయింది. హిందీ నుండి ఉత్తర భారతదేశ భాషలయిన పంజాబీ, సింది, మరాఠీ మొదలైన భాషలలోకి, కన్నడ భాషలోకి కూడా అనువదించబడింది. మా స్నేహితురాలి వదినగారు అన్న ఒక వాక్యం ఇచ్చిన ఇన్స్పిరేషన్ తో నేను వ్రాసిన కథ వల్ల, నాకు అన్ని కీర్తి ప్రతిష్టలు వచ్చినవి. ఆ కథ ను డ్రామాగా మార్చి రేడియోలో వినిపించారు. పాండిచ్చేరి రేడియోలో కూడా ఆ కథ ప్లే గా మార్చ బడి తమిళ్ లో ప్రసార మయింది.

**3.గాజు పెంకులు**

నేను బేగంపేట ఉమెన్స్ కాలేజ్ లో వర్క్ చేస్తున్నప్పుడు, రోజు దిల్సుక్ నగర్ నుండి బేగపేటకు సిటీబస్ లో వెళ్లేదానిని. చాలా దీర్ఘ ప్రయాణం అవటం వల్ల కిటికి దగ్గర కూర్చుని బయటకు చూస్తూ ఉండేదానిని. అలా రోజు చూస్తుంటే సోమాజిగూడ ప్రాంతంలో ఒక పెద్ద భవనం, ఆ భవనం చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ కనడేవి. ఆ ప్రహరీ గోడకు పైన నిలువుగా గుత్తుగా పొడుచుకు వచ్చిన గాజు పెంకులు కనపడేవి. ఎండలో తళతళ మెరిసే ఆ గాజు పెంకులను చూస్తుంటే వళ్ళు జలదరించేది నాకు. వాటిని చూసినప్పుడల్లా కర్కశమైన ఆ గాజు పెంకుల వెనుక జీవించే యజమాని ఎంత కర్కశంగా ఉంటాడో కదా అనుకునే దానిని. అలా వచ్చిందే ' గాజు పెంకులు ' కథ.

ఇంట్లో ఒక పెద్ద వ్యాపారస్తుడు ఉంటాడు. అతని ఇంట్లో తనకే లెక్క తెలియనంత బ్లాక్ మనీ ఉంటుంది. ఆ ధనాన్ని కాపాడు కోవడం కోసం ఎత్తైన ప్రహరీ గోడ కట్టుకొని దొంగ లెవరు రాకుండా చూసుకుంటాడు. లోపల గార్డెన్ లో దట్టమైన పూల మొక్కలు పండ్ల చెట్లు పెంచుతాడు. ఆ తోటలో పాములతో కూడిన మొగలిపొదలు కూడా ఉంటాయి. అతని పిల్లలు అతని ముందు ఎంతో వినయం ప్రవర్తించినా, అతను ఊళ్ళో లేనప్పుడు పబ్స్ కి, పార్టీలకు పోతూ అర్ధరాత్రి దాటే వరకు బయటనే ఉంటారు. ఓ రోజు వ్యాపార రీత్యా వేరే సిటీ కి వెళ్లి వారం రోజుల వరకు ఇంటికి రాడు వచ్చినప్పటికీ అర్ధ రాత్రి దాటింది. తన దగ్గరున్న డూప్లికేట్ తాళంతో గేట్ తెరిచేడు. హఠాత్తుగా ఎక్కడి నుండి వచ్చిందో ఒక పెద్ద కుక్క "భౌ భౌ" అంటూ అతని మీదకు లంఘించింది. తను ఊళ్ళో లేని సమయంలో పిల్లలు కుక్కను కొన్నారన్న సంగతి తెలియక పోవటం వల్ల అతను నిరుత్తరుడయ్యాడు.

గేట్ తీసి లోపలికి వచ్చేశాడు. తిరిగి బయటకు వెళ్లే మార్గం లేక కుక్క నుండి తప్పించు కోవటానికి గోడను పట్టుకుని పాకేడు. కుక్క అతని పంచను నోటితో పట్టుకుని గుంజింది. వెంటనే అతని పిక్కను కండ ఊడి వచ్చేలా కొరికింది.

బాధతో అతను మరింత గోడ పైకి ఎగబాకేడు. కానీ కుక్క అతని లాల్చీ పట్టుకుని చింపేసింది. గోడ దూకి పారిపోవాలని చేతులు రెండూ గోడ పైన వేసేసరికి గాజు పెంకులు గుచ్చుకున్నాయి. బాధతో అలాగే గోడమీద నుంచి జారిపోయాడు. కాసేపటిలోనే కుక్కకాటుతోను, గాజు పెంకులతోను గాయాలై నిర్జీవంగా పడిపోయేదు. తనను, తన ఆస్తిని కాపాడటం కోసం ఏ గాజుపెంకులు పరచకున్నాడో, ఆ గాజు పెంకులే అతనిని బలి తీసుకున్నాయి.

ఇందులో "పెట్టుబడి దారీ వ్యవస్థ తన గోతిని తానే తవ్వుకుంటుంది" అన్న మార్క్సిస్ట్ భావజాలాన్ని ఈ కథలో చూచాయగా చెప్పటం జరిగింది.

**4. ఉరి**

నేను ఓ మాగ జైన్ లో హాంగ్ మన్ ఉద్యోగం ఎలా ఉంటుందో, ఒక వ్యక్తిని (అతను ఎంతటి నేరస్తుడైనప్పటికి) ఉరి తీసినప్పుడు అతని ఎమోషన్స్ ఎలా ఉంటాయో చెప్పారు. కొందరు హాంగ్మెన్ లయితే, ఉరి తీయగానే మనసు చెదిరి పిచ్చి వాళ్లైన సందర్భాలు కూడా ఉన్నాయని చదివేను. ఒక మామూలు నేరస్తుడిని చంపినప్పుడే అంత బాధ పడితే ప్రజల క్షేమం కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడే ఒక విప్లవకారుడిని ఉరి తీసినప్పుడు ఎంత బాధ పడతాడో కదా అనుకున్నాను. దాని ఫలితమే ఉరి అన్న నా కథ. సెవెంటీస్ లో ఆతివాద భావజాలం పాచుర్యం పొందుతున్న సమయంలో వారి త్యాగాలకు ప్రభావితమై వ్రాసిన కథ ఉరి. ఆ కథ వ్రాసేటప్పుడు ఉరి తీసే సమయంలో ఎవరెవరు ఉంటారు, ఎలా ఉరి తీస్తారు అన్న విషయాన్ని జైలర్ కొడుకైన నా స్టూడెంట్ ద్వారా తెలుసుకుని ఆ కథ వ్రాసేను.

నా కథలో ఉరి తీయ బడిన వ్యక్తి విప్లవకారుడు. సమ సమాజం కోసం పాటు పడేవాడు. హాంగ్మాన్ ఏ ఉద్యోగం దొరక్క హాంగ్మన్ గా చేరి మొదటి సారిగా వృత్తి రీత్యా చేసిన మొదటి ఉరి.

నేరస్తులకన్న భిన్నంగా ఉండి తెలుగులోనూ, ఇంగ్లీష్ లోనూ అనర్గళంగా మాట్లాడే ఆ యువకుడు పేదల సంక్షేమం గురించి , పెత్తందార్ల దోపిడీని గురించి చెప్తుంటే ఆసక్తి గా వినేవాడు.

"నేను చావుకు భయపడను. ఎందుకంటే నేను చనిపోతోంది నీ కోసం, నీ లాటి పేదల కోసం. అందుకే నేను భయ పడను. నా చావు తరవాత మీరంతా సంతోషంగా ఉంటే నాకు అంతే చాలు!" అన్న అతని మాటలు హాంగ్మన్ హృదయంకి బలం గా నాటుకు పోయినాయి. అతని మీద ఎంతో ప్రేమను, అనుబంధాన్ని పెంచుకుంటాడు. ఆ అబ్బాయికి ఏదో విధంగా ఉరిశిక్ష తప్పితే బాగుండు ననుకునేవాడు. ఎలాగయినా అతనిని కాపాడమని దేవుడిని ప్రార్థించేవాడు.

కానీ ఆ విప్లవకారుడికి ఉరిశిక్ష తప్పలేదు.

మర్నాడు ఉరి అనగా రాత్రి నిద్ర లేదు హాంగ్మాన్ కి. తెల్లవారిన తర్వాత అతనిని ఉరి తీసి, తన గుడిసెకు పోయి అచేతనంగా మంచంలో పడిపోతాడు.

ఈ కథను అప్పటి ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ జస్టీస్ ఆవుల సాంబశివరావుగారు ఎంతో మెచ్చుకున్నారు. ఆయన సతీమణి ప్రచురించిన అంతోలోజీలో ఆ కథ చోటు చేసుకున్నది.

కథలే కాక నవలలు కూడా యదార్ధ సంఘటనల ఆధారంగా వ్రాస్తాను.

ఒక ఉదాహరణ నేను వ్రాసిన తప్పటడుగు అనే నవల.

ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో వచ్చిన ఒక జడ్జిమెంట్ ఆధారంగా వ్రాసిన నవల అది. లక్నోలో జమీందారీ ఫ్యామిలీకి చెందిన ఒక ముస్లిం యువతి పెళ్లయి, పిల్లల తండ్రి అయిన హిందూ డాక్టర్ ప్రేమలో పడి, చివరికి అతని రెండవ భార్యగా కూడా ఉండటానికి సిద్ధ పడుతుంది. కానీ ఆడపిల్లలను ప్రేమలో పడేసి వారి మనసులతో, జీవితాలతో ఆడుకోవటం అతని హాబీ అని గ్రహించే సరికి ఆమె తట్టుకో లేకపోతుంది. తనలాగే ఇతర అమాయక బాలికల జీవితాలతో ఆడుకోకుండ ఉండాలని పిస్టల్తో కాల్చి చంపుతుంది. ఆమెకు యావజ్జీవ కారాగార శిక్ష పడుతుంది.

ఈ కథను హైదరాబాద్ నేపధ్యంలో జరిగినట్టు ఆ నవలను వ్రాసాను.

ఇలా యదార్ధ జీవితానికి దగ్గర గా ఉండే కథలు వ్రాయటం నాకు ఇష్టం

**పరిమళా సోమేశ్వర్**



# వినదగునెవ్వరు చెప్పిన ..

నమస్తే మహాశయా..

.

ముందుగా మీ సమయ పాలనకు అభినందనలు. కథామంజరి ఒకటవ తేదిన విడుదల.సంపాదకీయం లక్ష్యశుద్ధిని స్పష్టంగా అందించింది. శీలా వీర్రాజు గారి పరిచయం బాగుంది. సంచిక చక్కగా నిండుగా వచ్చింది. మీ అందరి కృషికి విజయోస్తు!!

విహారి, హైదరాబాద్

సంపాదకీయం భేషుగ్గా ఉంది. శీలా వీర్రాజు గారి పరిచయం, చలం గారి పేజీ, పకడ్బందీగా వచ్చాయి. అభినందనలు.

ద్విభాష్యం రాజేశ్వరరావు , విశాఖపట్నం

మీ శ్రావ్య సంచిక చాలా బావుంది. మంచి గాత్రంతో హాయిగా వినాలనిపించింది. గాత్రధారులకు అభినందనలు

గంధం యాజ్ఞవల్క్య శర్మ, నరసరావుపేట

# దసరా శుభాకాంక్షలతో ..

మరి శలవు.

దీపావళి ప్రత్యేక సంచికతో కలుద్దాం